# భారతీయాంగ్ల కవులు

డా. కల్లూరి శ్యామల



శ్రీ
కౌముది
మీ ముంగిట్లో సాహితీ వెన్నెల
www.koumudi.net

ప్రచురణ సంఖ్య: 139

# భారతీయాంగ్ల కవులు

డా. శ్యామల కల్లూరి

## విషయసూచిక


| ఏడాది | నెల | పేరు | పేజి |
|---|---|---|---|
| 2010 | 01 | ముందు మాట | 2 |
| | 02 | చారిత్రిక నేపథ్యం | 5 |
| | 03 | హెన్రీ లూయీ వివియన్ డెరోజియో | 8 |
| | 04 | మైఖేల్ మధుసూదన్ దత్ | 15 |
| | 05 | తోరు దత్త్ | 21 |
| | 06 | రబీంద్రనాథ్ టాగోర్ | 27 |
| | 07 | శ్రీ అరవిందులు | 33 |
| | 08 | సరోజినీ నాయుడు | 40 |
| | 09 | జయంత మహాపాత్రా | 46 |
| | 10 | ఎ.కె.రామానుజన్ | 52 |
| | 11 | రాజగోపాల్ పార్థసారథి | 59 |
| | 12 | కమలా దాస్ | 65 |
| 2011 | 01 | సునీతా జైన్ | 71 |

# భారతీయాంగ్ల కవులు

## డా.శ్యామల కల్లూరి



### ముందుమాట

చిన్నతనంలో
తల్లి రంగరించిన పోసిన భాష
మాతృభాష!
ఊహ తెలిసాక నువ్వు ప్రేమించి
స్వంతం చేసుకున్న భాష
ఆంగ్లభాష!
తల్లి నేర్పిన మాట
జ్ఞాపకాల పొరలమాటున
ఏనాడో మరుగున పడింది!
అఆఇఈలు కూడా రాని
స్థితి ఇపుడు నీది.
కష్టపడి నువు నేర్చుకున్న భాష
ఎంత కష్టపడ్డా సృజన శక్తికి బాట కానేరదు!
అందుకే ఎప్పుడూ నువు త్రిశంకులా
రెంటికీ చెడ్డ రేవడివై మిగులుతావని
నీ నిరంతర తపన!

అయితే అప్పుడప్పుడు అనిపిస్తుంది
తూర్పుకీ పడమరకీ
నువు కట్టే వంతెనలే నీ కవిత్వమని
నువ్వు ప్రేమించి దగ్గర చేసుకున్న
నీ ప్రియురాలు
నీ తల్లిలాటి మాతృభాషతో
మమేకమైతే నీ కోసం నువు

ఒక భూతల స్వర్గం నిర్మిచుకోగలవు
నిరంతరం ఒక అస్థిత్వం కోసం
నువు పడే తపనకీ ఆరాటానికీ
అద్దం నీ కవిత్వం
అదే నీ కవితా వస్తువు!

ఆ అద్దంలో ముక్కలైన నీ ముఖం
నీ జ్ఞాపకాల జిగురుతో ఎంత చక్కగా
అంటించినా అతుకులు కప్పలేవు!
నీ జాతి వాడే మరొకడు చెప్పినట్టు
గతుకులు మాత్రం తప్పవు!
ఇది నిఖార్సయిన నిజం!
స్వంత దేశంలో ఆగంతకుడివి!
ప్రపంచాన్ని నీ రచనలతో జయించాలని
కలలుకనే స్వాప్నికుడివి!
భారతీయాంగ్లకవివి!

రెండు వందల సంవత్సరాల బ్రిటీషువారి పరిపాలన వలన చరిత్రలో ఎన్నడూ ఏ జాతీ మర్చిపోలేని బానిసత్వ శృంఖలాల జ్ఞాపకాలని మనకి మిగిల్చినదనేది ఒక నిఖార్సయిన నిజమైతే, దానితో పాటు రాబోయే యుగాలలో కొన్ని శతాబ్దల పాటు మనం బహుశ గర్వంగా చెపుకునే కొన్ని విజయాలకి సోపానాలు పరిచిందనేది కూడా మనం ఘంటాపథంగా చెప్పుకోగలిగిన విషయం అనటానికి ఏ మాత్రం సందేహించనక్కరలేదు. భారతీయాంగ్లసాహిత్య చరిత్రని రాస్తూ ప్రొ.కె.ఆర్.శ్రీనివాస అయ్యంగారు అన్నట్టు బ్రిటీష్ పాలన మనకి మిగిల్చిన చెరగని సాంస్కృతిక ముద్రలు ముఖ్యంగా మూడయితే - క్రికెట్ పై భారతీయుల మక్కువ మొదటిదనీ, భారతీయ శిక్షాస్మృతి రెండవది అని చెబుతూ ఆంగ్ల భాషపై మనకున్న మక్కువ ముచ్చటగా మూడవది అని చెపుతారు. భారతీయభాషలో జరుగుతున్న విద్యావిధానానికి స్వస్తి చెప్పి పద్దెనిమిది, పందొనిమిది శతాబ్దాలలో దేశంలో అనేకచోట్ల ఆంగ్లభాషా మాధ్యమం ద్వారా విద్యాబోధన మొదలైనపుడు మన ఈ చారిత్రక ప్రయాణానికి అంకురార్పణ జరిగింది. అప్పటి రోజులలో బెంగాలులో బీజాలుపడి యావద్భారతంలోను ఆంగ్లభాషాబోధన విస్తరించింది. శతాబ్దాల బానిసత్వపాలనలో తమ జాతి సహజ సంస్కృతీవాసనలని విస్మరించిన అప్పటి యువతకి ఆంగ్లేయుల సాహిత్యం, కవిత్వం కొత్త ప్రపంచపు ద్వారాలని తెరిచాయి. ఈ సాహిత్యపువెల్లువలో కొట్టుకుపోయిన మొదటి తరం యువకులు ఆ కవులచే ప్రభావితులై, ఆ సాహిత్యాన్ని క్షుణంగా అధ్యయనం చేయటమేగాక వారిలా రాయాలని తపన చెందటం మొదలెట్టారు. అలా మొదలైన మన ప్రయాణం ఇప్పుడు ఏ స్థితికి వచ్చిందంటే ప్రపంచంలో ఆంగ్లభాషతో ప్రమేయమున్న ప్రతిదేశంలోను భారతీయులు కీలక స్థానం పొందటమేకాక బుకర్, పులిట్జర్ పురస్కారాలలాంటి విశేష సాహిత్య పురస్కారాలని కూడ ఒకసారి కాదు పదే పదే పొందటం లేకపోతే నామినేట్ అవటం మనం ఈనాడు చూడగలుగుతున్నాం. అమెరికాలాంటి దేశాలలో అయితే నేడు ఇన్ఫర్మేషన్ టెక్నాలజీ, ఆర్థిక, వైజ్ఞానిక శాస్త్రాలలో భారతీయుల సహకార కారణంగా ఆదేశాలు పురోగతి చెందుతున్నాయి. ఆంగ్ల భాషాపరిజ్ఞానం మన యువతని ఎన్నో కీర్తిశిఖరాలని ఎక్కించటానికి ముఖ్యకారణమయిందనేది కూడా జగమెరిగిన సత్యం.

సాహిత్యపరంగా ఈ సంస్కృతీ వికాసాన్ని గురించి చాలా తక్కువమందికి తెలుసు. కేవలం సాహిత్యాభిమానులకేకాక భారతీయాంగ్ల భాషా సాహిత్యంతో తక్కిన అందరికీ పరిచయం చేసుకోవటం ఈనాడు చాలా ముఖ్యం. ఆ ఉద్దేశ్యంతో ఈనాడు ఈ సాహిత్యాన్ని అనేక విశ్వవిద్యాలయాలలో ప్రపంచవ్యాప్తంగా ప్రవేశపెడుతున్నారు. ఐతే విశ్వవిద్యాలయాలతో ప్రమేయంలేకుండా కేవలం అభిలాషతో ఆసక్తితో ఈ సాహిత్యాన్ని పరిచయం చేసుకోవాలనుకునేవారికి కౌముది ద్వారా తెలియచేయటానికి ఇదొక ప్రయత్నం. ఈ సాహిత్యం మొదలయిన తొలిదినాలనుంచీ నేటి వరకు కవిత్వాన్ని రాసిన ప్రముఖుల గురించిన వ్యాసాలు పాఠకులముందుకు తెస్తాను. చదివి ఆనందించండి.

ఈ వ్యాసాలలో ముఖ్యంగా భారతీయాంగ్లకవుల జీవితాలు, చరిత్రలు, వారి కవిత్వంగురించిన విశేషాంశాలు, కొన్ని కవితల అనువాదాలు ఉంటాయి. హెన్రీ డెరోజియో, మన్మోహన్ దత్, తోరు దత్, మైఖేల్ మధుసూదన్ దత్, సరోజినీ నాయుడు, శ్రీ అరవిందులు, రవీంద్రనాథ్ ఠాగూర్ లాంటి స్వాతంత్ర్య పూర్వ కవులతోపాటు, నిసీమ్ ఇజేకియల్, జయంత మహాపాత్ర, ఎ.కె.రామానుజ, ఆర్.పార్థసారథి, కేకి దారువలా, సుజతా భట్, ఆఘా షహీద్ ఆలీలంటి స్వాతంత్ర్యానంతర కవులుకూడా ఉంటారు. నా ప్రయత్నాన్ని సహృదయంతో స్వీకరించి తగిన సలహాలు ఇస్తారని ఆశిస్తున్నాను.

*డా. శ్యామల కల్లూరి*

*మానవీయ సామాజిక శాస్త్ర విభాగం, ఐ.ఐ.టి న్యూఢిల్లీ*

✡ ✡✡

2

# చారిత్రక నేపథ్యం

**భారతదేశం** రాజకీయంగా ఈస్ట్ ఇండియా కంపెనీ చేతుల్లోనుంచి బ్రిటీషు కిరీటపు అధికారం క్రిందకి మారేనాటికి మనదేశం అప్పటికే దాదాపు ఏడెనిమిది వందల సంవత్సరాలపాటు ఏదో ఒక విదేశపు బానిసత్వపు సంకెళ్ళల్లో అణగిమణగి వుండిందనేది మనందరికీ తెలిసిన విషయమే! దాదాపు 1205 ఎ.డి నాటితో ప్రారంభమైన పరాయిపాలన చేతులుమారుతూ 1947 ఆగస్ట్ 15లో దేశం సర్వ స్వతంత్రదేశం అయిందాకా కొనసాగింది. అయితే మొగలాయి రాజ్యపాలనలో పాలకులు దాదాపు అక్బరుకాలంనుంచీ ప్రవేశపెట్టిన పరిపాలనా పద్ధతులు, వాటివలన దేశానికి జరిగిన ఉపకారాలు బేరీజు వేస్తే మొగలాయి సంస్కృతి పూర్తిగా భారతీయ సంస్కృతిలో విలీనమయిందని స్పష్టమవుతుంది. ఎంతబాగా మొగలాయీ రాజులు భారతీయ సంస్కృతిలో మమేకమైనారంటే 1857లో జరిగిన మొదటి స్వాతంత్ర యుద్ధంగా చిత్రీకరింపబడిన సిపాయి తిరుగుబాటు ఉద్యమాలన్నిటికీ భారతీయ సిపాయిలు, ఆఖరి మొగలాయి రాజు బహదూర్ షా జఫర్ని భారతీయ రాజుగా, బ్రిటీషు వారికి విరుద్ధంగా తమని నడిపింపగలిగిన దేశ ప్రతినిధిగా, పరిగణించారు. ఈ విలీనం మొగలాయిరాజు అక్బరుతో మొదలయిందని చెప్పవచ్చును.

చారిత్రక ఋజువులు వున్నాయిని చెప్పలేకపోయినా జనంలో ప్రచారంలో వున్న కథలని పరిశీలిస్తే అక్బరు జననం ఒక హిందూ రాజపుత్ర ప్రముఖుని ఇంట్లో జరిగిందనీ, అతనికి రాజపుత్రులతో చాల సన్నిహిత సంత్సంబంధాలు వుండేవనీ అర్థమవుతుంది. ఈరోజు ఏ ఇంటర్నెట్ సైట్‌లోకి వెళ్ళినా అక్బరు జననం గురించీ అతనికి రాజపుత్రులతో గల సంబంధాల గురించి ఎన్ని కథలు ప్రచారంలో వున్నాయో అర్థమవుతుంది. ముఖ్యంగా హిందీలో ఇటీవల విడుదల అయిన జోధా-అక్బరు ఎన్నో వాద వివాదాలకి దారి తీసింది. వీటన్నిటి వెనకాల చారిత్రక సత్యాన్ని తెలుసుకోవాలన్న నిజాయితీ కన్నా హిందూ-ముస్లిం వివాహాల రాజకీయాలని ఖండించి, హిందూ ధర్మానికి అన్యాయం జరుగుతుందనీ, వాళ్ళు భావించే అన్యాయాన్ని అరికట్టాలనే నేటి రాజకీయాల ఛాయలు ఎక్కువగా కనిపిస్తాయి. అందుకే వాటి చారిత్రక సత్యాల జోలికి ఇక్కడ పోదలుచుకోలేదు. మన చరిత్రకి సంబంధించినంత మట్టుకు మొగలాయీ సుల్తానులు భారతీయ రాజులుగా గుర్తింపబడినారనేదే ముఖ్యం! అయితే ఔరంగజేబు కాలం వచ్చేనాటికి చాలా మట్టుకు భారత దేశం మొగలాయి పాలన క్రిందకి వచ్చినా మత కలహాలు పెచ్చు పెరిగాయి. అలా మొగలాయి సామ్రాజ్యం క్రమేణా క్షీణించి పోయింది.

బహదూర్ షా జఫర్ గొప్ప సాహితీ ప్రియుడనీ, స్వయంగా కవి అనీ పేరు పొందినా రాజకీయంగా అతి బలహీనుడైన రాజు. అతనితో మొగలాయి సామ్రాజ్యం అంతరించింది. బ్రిటీషు ప్రభుత్వం అసహాయుడూ, అసమర్థుడూ అయిన ఈ రాజుని అప్పటి బర్మా దేశంలో భాగమైన రంగూన్‌కి బహిష్కరించింది. సమకాలీన సాహిత్యంలోను తర్వాత వచ్చిన చారిత్రక కథనాలలోను ఈయన మృతిని గురించి హృదయవిదారకమైన కథలు ప్రచారంలో వున్నాయి.

అలా మొదలయిన బ్రిటీషు రాజకీయ అధికారిక పాలన, ఈస్ట్ ఇండియా పరిపాలన అంతమై విక్టోరియారాణి అధీనంలోకి భారతదేశం ఒక సామ్రాజ్య దేశంగా మారటంతో ఒక మలుపు తిరిగింది. నవంబరు ఒకటవ తారీఖు 1858 లో విక్టోరియా రాణి ఇచ్చిన ప్రకటనతో యిది అమలులోకి వచ్చింది.

మొదటితరం బ్రిటీషు పాలకులు జాతి దురహంకారానికీ అధికార మధాంధకారానికీ ప్రతీకలు. కాలక్రమేణా ఈ దేశంలో వుండి దీన్ని పాలించాలంటే వాళ్ళు ఈదేశ భాషలనన్నా నేర్చుకోవాలి ఈ దేశవాసులకి ఆంగ్లభాషనన్నా నేర్పించాలి అనే అవసరాన్ని గుర్తించారు. వివిధ భాషా సంస్కృతుల సమేళనమైన భారతదేశం వారికి ఒక సవాలుగా నిలిచింది. కొందరు ఆంగ్లేయులు భారతీయ సంస్కృతి పట్ల, భాషల పట్ల ఆకర్షితులై ఈ దేశపు వందల సంవత్సరాల సంస్కృతిని తెలుసుకోవటానికి సంస్కృతభాషని అభ్యసిస్తే మరికొందరు కలకత్తాలో, మద్రాసులో ఢిల్లీ హైదరాబాదులలో ఆయా ప్రాంతపు భాషలు నేర్చుకున్నారు. తెలుగుభాషని అధ్యయనం చేసి అందులోని వేమన పద్యాలవంటి అమూల్యరత్నాల్ని వెలికితీసిన ఘనత, మొదటి తెలుగు-ఆంగ్ల పదకోశాన్ని కూర్చిన ఘనత సాధించిన సి.పి. బ్రౌనుదొరని ఈ సందర్భంగా తలుచుకోవటం సముచితం. మరికొందరు దేశవాసులు, ఆంగ్ల విద్యామాధ్యమం ద్వారా, భాషా సాహిత్యాలని ఔపోసనం పట్టడం మొదలుపెట్టారు. ఈ రకమైన సంస్కృతీ వారధులు, ఒక అందమైన మలుపుకి దారి తీసి భారతీయాంగ్లసాహిత్యానికి పునాదులు పడ్డాయి. విలియం జోన్స్, డేవిడ్ హారె వంటి ప్రముఖులు భారతీయ సంస్కృతినీ, సమాజాన్నీ, ద్యాత్మకపునాదుల్నీ అర్థంచేసుకుని విస్తారంగా రాశారు.

అలాగే ఆంగ్ల విద్యాబోధన మొదలైనాకా వచ్చిన మొదటితరం భారతీయులు సాహిత్యాన్ని, హేతువాద దృక్పధాన్ని విజ్ఞాన పరంపరలనీ ప్రేమించటంతో పాటు, స్వదేశీ సమాజంలో వున్న వెనుకబడిన తనాన్ని కులతత్వాల్ని, మూఢనమ్మకాల్నీ, సాంఘికదురాచారాల్నీ వదిలించుకోవల్సిన ఆవశ్యకతని గుర్తించారు. రాజారామ మోహన్ రాయ్, కేశవచంద్ర సేన్, దేవేంద్రనాథ్ టాగూర్ వంటి సంస్కర్తలు, ఈశ్వర చంద్ర విద్యాసాగర్, హెన్రీ డెరోజియో వంటి స్వదేశీయులెందరో ఈ సాంస్కృతిక పునరుజ్జీవనానికి కారణభూతులైనారు. కలకత్తాలో, మద్రాసులో, బొంబాయి నగరాలలో విద్యాసంస్థలు వెలిసాయి. మెకాలే మినిట్స్ ఆంగ్ల విద్యాబోధనకి పునాదులు వేస్తే, విలియం బెంటిక్‌లాంటి పరిపాలనదక్షులు 'సతి' వంటి సాంఘికదురాచారాలకి చట్టపరంగా స్వస్తి పలికారు.

ఈరకంగా ఒక సాంస్కృతిక పునరుజ్జీవనం ఆధారంగా భారతీయాంగ్ల సాహిత్యం వేళ్ళుపాదుకుంది. తొలితరం కవులు రచయితలలో ఆంగ్ల సాహిత్యాన్ని గుడ్డిగా అభిమానించి, అనుకరించిన వాళ్ళూ వున్నారు. భారతీయ సంస్కృతియొక్క గొప్పదనాన్ని - ఆంగ్లేయులకి, స్వంత సంస్కృతిని గురించి తెలియని భారతీయులకి చెప్పాలనే తపనతో రామాయణ, మహాభారతాలు, ఉపనిషత్తులని గురించి ఆంగ్లంలో రచించిన వాళ్ళూ వున్నారు. సాహిత్యం, ఆలోచనాధోరణి ఇచ్చిన పటిమతో స్వంత భాషలని పునరుద్ధరించి సాహిత్య సృష్టికి అనుగుణంగా భాషని తీర్చిదిద్దిన మైకేల్ మధుసూదన్ దత్‌లాంటి విద్వాంసులున్నారు. దాదాపు అన్ని భారతీయ

భాషలలోను ఆంగ్లభాషను అభ్యసించిన అర్థం చేసుకున్న పండితులూ, ఆంగ్ల భాష వాసనలేమాత్రం లేని స్వదేశీ పండితులు సాహిత్య ప్రక్రియలని పునరుద్ధరించారు.

నాటి నుండి నేటి వరకు ఆంగ్లభాష వలన దేశానికి మేలు కలిగిందా, కీడు జరిగిందా అనే వాదవివాదాలు ప్రచారంలో వున్నాయి. నేడు భారతదేశంలో మాతృభాషల ప్రాముఖ్యం తగ్గిపోయిందనేది నిర్వివాదశం. ఆంగ్లం అప్పటికీ ఇప్పటికీ కూడా ఈ రకమైన ద్వైదీ భావనని సృష్టిస్తూనే వుంది. దేశం ఆర్థికంగా విద్యాపరంగా ముందుండడానికి నేడు ఆంగ్లభాషతో మన యువతకున్న ప్రావీణ్యమే కారణమనేది కూడా అనేది కూడా నిర్వివాదాంశమే! మాతృభాషలకి తల్లికిచ్చిన గౌరవాన్నిచ్చి సజీవంగా నిలబెట్టడం గూడా మన బాధ్యత. ఆంగ్లభాష నేర్చుకోవాలంటే మనభాషని వెనక్కుపెట్టాలనే అనే వాదనే ఒక విధంగా లోపభూయిష్టమైనది. భారతదేశంలో నగర సమాజాలలో ప్రతి వ్యక్తీ సహజంగానే ద్విభాషాప్రావీణ్యంతో వుంటారు. పాతరోజుల్లో సంస్కృతం ఎలా జ్ఞాన సముపార్జనకి అత్యవసరమైందో ఈనాడు – ఆంగ్లం అవసరార్థం మనకి ఉపయోగపడుతున్న భాష . ఒక చారిత్రక ఆవశ్యతగా మనకి సంక్రమించిన భాష . నేడు దేశ విదేశాల్లో మన రచయితలు, కవులు అవార్డులతో సత్కరింపబడే దాకా ఎదగటానికి నాడు చారిత్రకంగా ఏర్పడిన పునాదులు ముఖ్యకారణాలు.

*డా. శ్యామల కల్లూరి*

*మానవీయ సామాజిక శాస్త్ర విభాగం, ఐ.ఐ.టి న్యూఢిల్లీ*

✡ ✡✡

# హెన్రీ లూయీ వివియన్ డెరోజియో

## ౧౮౦౯ - ౧౮౩౧

**భారతీయాంగ్ల కవిత్వానికి** ఆద్యుడని చెప్పదగిన కవి హెన్రీ డెరోజియో. క్రీ.శ 1809 వ సంవత్సరంలో ఏప్రియల్ 18న జన్మించిన డెరోజియో తండ్రి పోర్చుగీసు భారతీయ జాతులకి చెందిన తల్లిదండ్రులకి చెందిన వాడైతే, తల్లి బ్రిటీషుజాతికీ చెందిన స్త్రీ. యూరేషియన్ జాతికి చెందిన ఈ కవి చాలా రకాలుగా బెంగాలు భూమిని ప్రభావితం చేసాడు. ఆరేళ్ళ చిన్నవయస్సులోనే పసి మొగ్గగా డ్రమ్మండ్ అకాడమీలో చేరి విద్యాభ్యాసం చేశాడు. పదునాలుగవ ఏట విద్యాభ్యాసం ముగించే నాటికి పరిపక్వత సాధించి స్వతంత్ర భావాలు గల యువకునిగా డెరోజియోని తీర్చి దిద్దిన ఘనత ఈ డ్రమండ్ అకాడమీ ప్రిన్సిపాలుకే దక్కుతుంది. కొంతకాలం తండ్రిగారితోను తర్వాత తన మామతో బీహారులోని భగల్‌పూరు ఇండిగో తోటలలోను పని చేసి కలకత్తాకి తిరిగి వచ్చాడు. రెండుచోట్లా అతను పనిచేసిన పని వ్యాపార ధోరణి దృక్పథాలకి సంబంధించినది కావటంతో డెరోజియో ప్రవృత్తికి సరిపడలేదు. అయితే బీహారు సమీపప్రాంతాలు అక్కడి గంగానదియొక్క మౌన గాంభీర్యం కవిగా తిర్చుదిద్దుకుంటున్న ఈతనిపై ఒక మంచి ప్రభావాన్ని కలిగించిందని తర్వాత డెరోజియో ప్రచురించిన ఫకీర్ ఆఫ్ ఝుంఘీరా చదివితే అర్థమవుతుంది. నదితీర ప్రాంతం చుట్టుపట్ల వున్న ఇసుకతిన్నెలూ, రాళ్ళు అన్నీ ఈ కావ్యంలో చోటుచేసుకున్నాయి. ఇండియా గెజిట్‌లో అప్పటికే అతని కవితలు ప్రచురింపబడ్డాయి. దాని ఎడిటరు డెరోజియోని కలకత్తా రప్పించి అసిస్టెంట్ ఎడిటరుగా నియమించాడు. అలా కవిగా ఎదగటం మొదలెట్టాడు. తను స్వంతంగా కలకత్తా గెజిట్ ప్రారంభించి కలకత్తా నగరంలో ఒక సంచలనాన్ని సృష్టించాడు.

వయస్సుకి మించిన తెలివితేటలతో డెరోజియో సాధించిన విజయాలు అతన్ని అప్పటికే సమాజంలో ఒక విశిష్ట వ్యక్తిగా గుర్తింపు కలిగించాయి. 1826లో కలకత్తా నగరానికి చెందిన ప్రసిద్ధ కాలేజీ అయిన హిందూ కాలేజీలో అసిస్టెంట్ మాస్టరుగా నియమించబడ్డాడు. అప్పటికి కేవలం అతి స్వల్ప సమయం క్రిందనే స్థాపింపబడిన ఈ కాలేజీ ఆంగ్ల భాషా సంస్కృతుల ప్రభావంతో నవీనభావాలతో ఆదర్శాలతో ప్రారంభింపబడింది. రాజా రామ మోహన్ రాయ్, ద్వారకానాధ్ టాగూరు వంటి ప్రముఖుల సాగత్యంలో దీని పేరు ప్రఖ్యాతులు అప్పటికే నలుగు నోళ్ళలో నానటం మొదలయింది. ఉత్సాహవంతుడయిన డెరోజియో తన తెలివి తేటలతో నవ్య ఆలోచనా విధానంతో నాటి యువతని ప్రభావితుల్ని చేసాడు. సహజంగా తాను యువకుడవటమే కాక యువకుల సంపర్కం అతనిలో నాటి హిందూ సమాజంలో యువతని సంస్కర్తలని కలచివేస్తున్న సాంఘిక దురాచారాలపట్ల ఒక తిరుగుబాటు ధోరణి ప్రబలంగా చోటుచేసుకోటానికి దోహదం చేసాయి.

ఈరకంగా మొదలైన టీచరు ఉద్యోగం కాలేజీలో పాఠాలు చెప్పటంతో ఆగలేదు. కాలేజీ అయినతర్వాత గూడ యువకుడైన డెరోజియో తన అభిమాన విద్యార్థులతో కలిసి అనేక చర్చలు గోష్ఠులతో రోజూ పాల్గొని ఆధునిక, సాంఘిక, సామాజిక విషయ

పరిజ్ఞానానికి సంబందించిన ఎన్నో విషయాలు చర్చించేవాడు. నాటి ఎంతోమంది యువకులు ఈ మొదటితరం ఆంగ్ల ఉపాధ్యాయుని సహకారంతో బాల్య వివాహాలు, స్త్రీవిద్య, వితంతువివాహాలు తదితర సాంఘిక సమస్యల గురించి ఆలోచించటం నేర్చుకున్నారు. ఇది ఎంత వరకు వచ్చిందంటే నాటి కలకత్తా నగరపు సాంప్రదాయవాదులు డెరోజియో కారణంగా యువత తప్పుత్రోవలు పడుతన్నారని ఆరోపించి అతన్ని కాలేజీనుంచి బర్తరఫ్ చెయ్యాల్సిందని కాలేజి యజమాన్యానికి విన్నపాలు పెట్టుకున్నారు. ఈ పిటిషన్ల జోరుకాగలేని యజమాన్యం అతన్ని సంజాయిషీ ఇవ్వవలసిందని నోటీసు ఇచ్చింది. అందులో ముఖ్యంగా చేసిన ఆరోపణలు డెరోజియో నాస్తికుడని, యువతని తప్పు త్రోవ పట్టిస్తున్నాడని తల్లితండ్రులమీద తిరుగుబాటుకి ప్రోత్సాహిస్తున్నడని, కులమతాలని పాటించకుండా అందరు కలిసి తినేలా ప్రొత్సాహిస్తున్నాడని ఆరోపణలు అతని మీద మోపి యాజమాన్యం అతన్ని ఉద్యోగంనుంచి తొలగించారు. తొలిసారిగా కలకత్తానగరంలో మొదలైన ఆధునిక విచారధారకి డెరోజియో భాధ్యుడు. అతని ఆధ్వర్యంలో యువత ఆలోచించటం దురాచారాలని తిరస్కరించటం నేర్చుకున్నారు. కులమతాలపేరిట జరిగే అత్యచారాలు, స్త్రీల పట్ల చిన్నచూపు, సతి వంటి అత్యాచారాలపట్ల నిరసన అన్నీ ఈసమయంలోనే మొదలయ్యాయి. అయితే యజమాన్యపు ఈ చర్యని తిరస్కరించిన వాళ్ళూ ఉన్నారు. నాటి ఆధునిక విచారధోరణి కలిగిన సంస్కర్తలందరూ డెరోజియోని సమర్థించారు. తను మళ్ళీ అతని పత్రికా రచనలోకి వెళ్ళిపోయినాడు. అయితే ఈ సంఘటన తర్వాత ఎక్కువ రోజులు బ్రతకలేదు. తన ఇరవైరెండవ ఏట కలరా వ్యాధి సోకి అకస్మాత్తుగా మరణించాడు. కేవలం తన ఆరేళ్ళ కవితా వ్యాసంగంలో(1825-1831) అనేక రచనలు చేసాడు. 1827లో "పోయమ్స్" అనేసంకలనాన్ని ప్రచురించాడు.

డెరోజియో ముఖ్యంగా దేశప్రేమగురించి, స్వాతంత్రకాంక్ష గురించి రాశాడు. ప్రేమకథగా మొదలై సమకాలీన దురాచారాలని ఖండించిన కావ్యం "ఫకీర్ ఆఫ్ ఝంఘీరా". నాటి ఆచారాలననుసరించి పతి చితాగ్ని మీద ప్రాణాలు తీసుకోబోతున్న ఒక యువతిని ఫకీరుగా మారిన ఆమె తొలి ప్రేమికుడు పరారు చేయించి తీసుకుపోతాడు. ఆ యువతి అన్న వాళ్ళని వెంబడించి పట్టుకుని ఫకీరు ప్రాణాలు తీస్తాడు. అతని మృతదేహంమీద యువతి ప్రాణాలు విడుస్తుంది. ఆచారాల బంధంలో సతీసహగమనాన్ని బలవంతంగా చెయ్యబోయిన ఆమె సహజంగా ప్రియుడి శవంమీద చనిపోతుంది.

అలాగే ఆంగ్ల దేశాన్ని గురించి, బానిసత్వాన్ని గురించి కవితలల్లిన తొలి జాతీయకవి. యూరేపియన్ అయిన ఈకవిని యూరోపియన్లు, భారతీయులు కూడా తమవాడిగా పరిగణించలేదు. ఆ ఆవేదన అతని కవితలో ప్రస్ఫుటంగా కనిపిస్తుంది. అయితే దేశభక్తిలో ఏజాతీయ కవికీ తీసిపోని కవిత రాసాడు.

ప్రతి కవితా ఖండికలోను ఈతని సహజ ప్రతిభ కనిపిస్తుంది అయినా నాటి ప్రభావలకనుగుణంగా భాషలో పాత ధోరణులు కనిపిస్తాయి. అలోచనలలో అధునికత కనిపిస్తుంది. జాతీయతని ప్రతిఫలించే కొన్ని కవితలు, విద్యార్థులపట్ల డెరోజియో ఏవిధంగా స్పందించే వాడో తెలియచేసే కవితలు కవిగా తన పట్ల తనకు గల విశ్వాసాన్ని గురించి అతను రాసిన కవిత మచ్చుకి తెలుగు అనువాదంలో ఈ క్రింద ఉదహరింపబడ్డాయి. అయితే తెలుగు చదవగలిగిన ప్రతి చదువుకున్న పాఠకుడూ డెరోజియోని గాని మరే ఆంగ్ల కవిని గాని ఆంగ్లంలోకూడా చదవగలడు. అందుకునే దీన్ని ఒక అనువాదంగా కాక ఒక సృజనాత్మకమైన ప్రయోగంగా భావింపగలరు.

<u>స్వేచ్ఛ గురించి డెరోజియో: బానిసకి స్వేచ్ఛ అనే కవితలో,</u>

తానిక బానిస కాదని మొదటిసారి విన్నప్పుడు
అతనికేమనిపించి వుంటుంది?
అతని హృదయమెంత గర్వంగా చలించి వుంటుంది?

తను ఇప్పుదొక స్వేచ్ఛాజీవినని విన్నప్పుడు
ఒకేసారి అతని మనస్సులో అత్యున్నతమైన
భావాలు మెరుపుల్లా మెదిలాయి!
అతనింక మోకరించనక్కర లేదు.
అతని ఆలోచలెప్పుడూ ఇక పైపైకి చూస్తాయి!
మొదటిసారిగా అతను తనను తను మనిషిగా అనుకున్నాడు!
పైకి చూశాడు- స్వర్గలోకపు కొత్తగాలులు కొంగ్రత్తగా తాకాయి!
స్వేచ్ఛగా ఎగిరేపక్షులని తొలిసారి చూసి
ఉత్సాహంగా నవ్వుకున్నాడు!
తన ఎదుట క్రింద పరుగులిడే సెలయేటి
ప్రవాహాన్ని తొలిసారి వీక్షించాడు!
గాలులు, పక్షులు, వరదలూ చూశాడు!
"నేను కూడా వీటిలా స్వేచ్ఛాజీవిని" అనుకున్నాడు!

ఓ స్వాతంత్రమా! నీ పేరులోనే ఒక ఆత్మీయత!
అది వెలిగిస్తుంది అంతరాత్మ గుడిలో ఒక ఆరని దీపాన్ని!
దేశభక్తుని ఒరలోనుంచి నీ కోసం దూసిన కత్తి
విజయాన్ని చవిచూస్తుంది!
నీ స్వేచ్ఛకోసం చిందిన రక్తం
గుండె గాయాల్నించి గర్వంగా ఉబికివస్తుంది.
నీకై నియంతలు నిర్దేశించిన సంకెళ్ళని తెంచిన చేతులు,
బానిసల స్వేచ్ఛకై తపించిన
హృదయాలు దేవుని కటాక్ష వీక్షణాలతో పునీతాలు!

***జాతీయత గురించి:***

<u>నిద్రాణ వీణ (హార్ప్ ఆఫ్ ఇండియా)</u>

ఎందుకు నీవలా ఎండి మోడైన కొమ్మపైన
శ్రుతిచెయ్యని వీణలా వుండిపోతావు?
నీ సంగీతమొకప్పుడు ఆ పాతమధురం,
ఎవరు వింటారిప్పుడు దానిని?
ఈ మలయమారుతం ఒక నిట్టూర్పులా
నీ తీగలమీద పయనిస్తుంది నిష్ఫలంగా!
నిశ్శబ్దం నిన్ను బంధించిందొ

మృత్యుశీతలమైన తన సంకెళ్ళలో!
నువ్విప్పుడొక తిరస్కరించబడిన
నిరాశాపూరిత మౌన రాగానివి!
ఎడారి భూముల్లో నిర్మానుష్యమైన
ఒక చారిత్రక శిధిలానివి!
ఈతీగలపై దివ్య సంగీతాన్ని
సృష్టించిన చేతులు నాకన్నా గొప్పవి!
కవుల సమాధుల మీద ఇప్పటికీ
వసివాడని కీర్తి పుష్పాల మాలలు!
అయితే  చేతులు ఇపుడు మృత్యు శీతలాలు!
ఆ దివ్య గానాన్ని పురరుజ్జీవితం చెయ్యటానికి
చేతులు కరువైతే అందుకో,
ఈ చాచిన హస్తాన్ని
ఓ నిద్రాణ భారతీ! అందుకో నా ఈ
స్నేహ హస్తాన్ని!

ఇండియా, నాజన్మ భూమి- టు ఇండియా మై నేటివ్ లాండ్

ఓ నాదేశమా! నీగతించిన వైభవపు దినాలలో
నీ చుట్టూ ఒక తేజస్సు అల్లుకుని వుండేది!
నువ్వు అప్పుడు ఒక దేవతలా పూజించబడ్డావు!
ఎక్కడుంది ఇప్పుడు  కీర్తి? ఏది  గౌరవం నేడు?
నీ ఎగిరే విహంగాల పక్షాలు యిపుడు సంకెళ్ళలో,
నువ్వు దుమ్ములో, ధూళిలో పడుతూ లేస్తూ!
ఏ పాటకులూ ఇక నీకోసం పాటల దండలు గ్రుచ్చరు!
కేవలం నీ వేదనల విషాద సంగీతాన్ని వినిపిస్తారు!
సరే! కాలపు లోతుల్లోకి వెళ్ళనీ నన్ను!
కాలగర్భంలో కలిసిపోయిన  గాయాల్ని వెలికి తీస్తాను!
అందులో కొన్ని అమర క్షణాల తునకల్ని
మళ్ళీ మనుష్యులెన్నటికీ చూడలేని  వైభవాన్ని
నన్ను తిరిగి తీసుకురానీ! ఓ పతనమైన నాదేశమా!
నీ నుంచి ఒక కరుణాపూరితమైన అనుగ్రహం చాలు నాకు!

హిందూ కాలేజి విద్యార్థుల కోసం -సానెట్ టు మై స్టూడెంట్స్ ఆఫ్ హిందూకాలేజి

నేను చూస్తువుంటాను
విచ్చుకోబోతున్న పుష్పాల్లా విస్తరిస్తున్న
మీ మేధస్సు సున్నితంగా తెరుచుకుంటాయి
మీ మేధలను కట్టి పడేసిన శక్తులు నెమ్మదిగా
విడివడటం చూస్తాను.
తొలివేసవి దినాలలోఎగరడానికి ఎదిగే పక్షులలా
మీరెక్కలు విచ్చుకుని తమ శక్తిని పరిక్షించుకుంటాయి!
పరిస్థితుల గాలులు, ఏప్రిల్ మాసపు తొలివానలు
అప్పుడే విచ్చుకుంటున్న విజ్ఞానశకలాలు!
లెక్కపెట్టలేనన్ని రకాల క్రొత్త దృక్పధాలు
వాటి ప్రభావాన్ని చూపిస్తాయి, విడిపిస్తాయి!
మీరు సత్యాన్ని సర్వశక్తిమంతమైన దాని మహత్వాన్ని
ఆరాధిస్తారు!
మీకీర్తి భవితవ్యమనే అద్దంలో
మీరు సాధించబోయే విజయాలమాలలల్లుతున్నప్పుడు
ఎంత సంతోషం నామీద వర్షంగా కురుస్తుంది
నాజీవితం వ్యర్థం కాదని అనిపిస్తుంది!

తొలిప్రేమ భావనలు-(నాటి స్త్రీ దృష్టికోణంనుంచి)

అది సంతోషకరమైన పండగ రోజు!
అతని కళ్ళు హాలంతా గాఢంగా పరికించాయి!
అతను నన్ను కలిశాడు, నాచేతిని వత్తాడు!
నాగుండెల్లో ఒక అకస్మాత్తు చల్లదనం!
నేను వణికిపోయాను, నాచేయి చల్లబడిపోయింది!
నాచివరి క్షణం వచ్చిందనిపించింది.
అదేనిజమైతే ఎంతబాగుండేది!
కాని అతని చిరునవ్వు సూర్యకాంతిలా మెరుస్తూ
ఉత్సాహాన్ని నింపింది.
అతను నన్ను చూసి నవ్వినప్పుడు
నాహృదయం అతని ముందు ఆరాధనతో
మోకరిల్లింది.

ఒక్క చూపుని అది ఎల్లా భరించగలదో తెలియదు
అతని చిరునవ్వు, అతని చూపు-
పిచ్చితనానికి, బాధకి తప్పితే
క్షణం మళ్ళీ జీవించలేకపోదును!
ఓహ్!ఎందుకు స్త్రీలకి అతిగా చలించే హృదయాల్నిచ్చి
వాటిని చూపించలేని అశక్తతనీ ఇస్తారో!
లేక అగ్నిలో శుద్ధమై పైకిలేచిన ఫీనిక్స్ శక్తిలా
స్త్రీ హృదయం తయారు చెయ్యబడిందా?

అతను కొన్ని సంబాషణలు యధేచ్ఛగా చేసాడు.
ఒక జ్వలించే వూహ నాలో మెదిలింది.
అది చెదిరిపోయింది- అయితేమెరుపుతీగల్లా
నా శలన్నీ దాని వేడికి కరిగిపోయాయి!
అదీ చెదిరిపోయింది- క్షణంలో ఎందుకు
పువ్వులా వాడిపోలేదు అనుకున్నాను.
ఒక స్వర్గంలో విరిసిన పువ్వు
కన్నీటితో పునీతమైవిచ్చుకున్న పువ్వు
ఒక పెనుగాలివచ్చినప్పుడు నేల రాలిపోయింది!
నాతో అల్లావుండదు; నా వేదన ఒకొక్క రేకుగా
రాలిపోతుంది. అలా జీవించినా
కేవలం శ్వాస గాక, అదేమి జీవితం?

ఒక వీడిపోతున్న నిర్జీవ కిరణం
వడిలిపోతున్న ఆత్మ అది!
ఓ, భగవంతుడా, భగవంతుడా
ఇది జీవన్మరణం!
ఆలోచన - నేనది చెప్పలేనిప్పుడు-
నామది  భారంతో చలిస్తుంది.
నా కణతలు కాలిపోతున్నయి చిత్రంగా!
నా చెవులు నేను వినలేని  కంఠంతో
మారుమోగుతున్నాయి!

నాకు శుభరాత్రినీ శాంతినీ కలగాలని చెప్పి
అతను  హాలు వదిలి వెళ్ళిపోయాడు.
అందరి కళ్ళూ అతని మీదే, నాకళ్ళూ మాత్రం
పైకి చూడలేక పోయాయి, మెరుపు కోల్పోయాయి-
ఏదో మసకతెరకప్పేసింది - కాదు, కాదు
నా బలహీనత చూపినందుకు నన్ను నేను
నిందించుకున్నాను.
నేను చుట్టూ చూసాను అతను ఎక్కడా లేడు
అప్పుడు అనుకున్నాను, అతనే
అతనే నా అదృష్టాన్ని పాలించగలిగిన వాడని .

**ఈ కవితలన్నీ దాదాపు 1827 ప్రాంతంలో రాసినవి.**

✡ ✡✡

*డా. శ్యామల కల్లూరి*
*మానవీయ సామాజిక శాస్త్ర విభాగం, ఐ.ఐ.టి న్యూఢిల్లీ*

# మైఖేల్ మధుసూదన్ దత్ (1824 - 1873)

20వ **శతాబ్దంలో** బెంగాల్‌లో జరిగిన సాంస్కృతిక విప్లవం అంతా మనమంచికే జరిగిందని అన్ని వర్గాల మేధావులు అంగీకరించినా ఒకరకంగా అదితీసుకొచ్చిన మార్పుల వెనకాల ఎన్నో జీవితాల కథలు వ్యధలు ఉన్నాయనటం అతిశయోక్తికాదు. సమాజంలో ఏ మార్పు అయినా నిశ్శబ్దంగా రాదు. దాని వెనకాల ఎన్నో ఎదురీతలు, వ్యతిరిక్తతలు, వ్యక్తిగతమైన స్థాయిలో ఎన్నో పోరాటాలు నిబిడీవుంటాయి. దీనికి సరియైన ఉదాహరణ మైఖేల్ మధుసూదన్ దత్ జీవితమని చెప్పవచ్చును.

1824 లో జెస్సోర్ జిల్లా లోని సాగర్దారి అన్నేగ్రామంలో (నేటి బంగ్లాదేశ్ లో) పుట్టిన మధుసూదన్ బెంగాల్‌లోని రోజుల్లో పేరెన్నికగన్న ఉన్నతకుటుంబమైన దత్ కుటుంబానికి చెందిన వాడు. తండ్రి రాజనారాయణదత్ వకీలయితే, తల్లి జాహ్నవీ దేవి మధుసూదన్‌కి మొదటి గురువు. కలకత్తాలో పాఠశాల చదువు తర్వాత హిందూకాలేజిలో చదివిన మధుసూదన్ అక్కడ ఆంగ్లంతో బాటు బెంగాలీ, సంస్కృతం, పర్షియన్ భాషలు అధ్యయనం చేశాడు. డెరోజియో తర్వాత చెప్పుకోదగిన మొదటితరం ఆంగ్లకవి, రచయిత అని చెప్పవచ్చును. చిన్నప్పటినుంచి పెంచుకున్న ఆంగ్లభాషాభిమానం ఆంగ్ల సాహిత్య అధ్యయనంతో ఆగక హిందూమతాన్ని వదిలి క్రిస్టియానిటీని అవలంబించేదాకా వచ్చింది. ఒక రకంగా, తన కుటుంబంలో అనూచానంగా వస్తున్న ఆచారాలవ్యవహారాలబారినుంచి తప్పించుకోటానికి మతం మార్చుకున్నాడు. ముఖ్యంగా తలిదండ్రులు కుదిర్చిన వివాహాన్ని వ్యతిరేకించి దాన్నినుంచి తప్పించుకోటానికి ఇంటినుండి పారిపోయి మిషనరీల సహాయంతో మతం మార్చుకుని తనపేరుకి ముందు మైఖేల్ చేర్చుకుని పూర్తిగా క్రిస్టియన్ అయినాడు. బాల్యవివాహాలు సర్వ సాధారణమైన రోజులలో ఎన్నోకుటుంబాల యువకులు అనాదిగా వస్తున్న మూఢాచారాలని ఎదిరించలేక సంస్కృతిలో ఇమడలేక అవస్థలు పడ్డారు. తలితండ్రులకి ఏకైక సంతానమవటంతో అది వారికొక పెద్ద దెబ్బ. తండ్రి ఇతనిని పూర్తిగా తననుంచి తన ఆస్థినుంచి వంచించటమేకాక బ్రతికున్నన్నినాళ్ళు కుమారుని ముఖం చూడలేదని అంటారు. సుప్రసిద్ధ బెంగాలి రచయిత శ్రీ సునీల్ గంగోపాధ్యాయ రచించిన సెయ్ సామయ్ అనే నవలలో వందేళ్ళనాటి ప్రముఖుల జీవితాలని చక్కగా ఊహని జోడించి నిజజీవితాలుగా చిత్రీకరించారు. దీనిని డా. అరుణా చక్రవర్తి దోజ్ డేస్ అని ఆంగ్లనామంతో అనువదించారు. మైఖేల్లో మధుసూదన్ ప్రస్తావన ఇందులో విస్తారంగా వుంది. హిందూకాలేజి వదిలిన తర్వాత బిషప్స్ కాలేజీలో చేరి గ్రీకు, లాటిన్ అధ్యయనం చేసాడు. సమకాలీన సమాజం ఇతని మతమ్మార్పిడిని గాని తల్లిదండ్రులని తిరస్కరించిన విధానాన్ని గాని అంగీకరించలేకపోవటంతో మద్రాసునగరానికి వెళ్ళి అక్కడ ఉద్యోగంలో చేరాడు. కాలేజీ రోజుల్నుంచీ ఇతని కవితలు బెంగాలీలోనూ, ఆంగ్లంలోనూ ప్రచురించబడసాగాయి. తండ్రి దగ్గరినుంచి ఏరకమైన ఆర్థిక సహాయం అందక పోవటంతో మద్రాసునగరంలో స్కూల్‌లో పాఠాలు చెప్పటం మొదలుపెట్టాడు. మద్రాసు స్పెక్టేటర్ అనే మాగజీన్‌లోను తదితర అనేక పత్రికలలో రచనావ్యాసంగాన్ని కొనసాగించాడు.

అదే సమయంలో మొదటిసారి వివాహంచేసుకుని కుటుంబజీవితంలో స్థిరపడటానికి ప్రయత్నంగూడచేసాడు. తల్లిదండ్రుల మృతితో తిరిగి కలకత్తా చేరుకుని మద్రాసులో భార్యాపిల్లల్ని వదిలి కలకత్తాలో హెనిట్టా అనే ఫ్రెంచి యువతితో సంబంధమేర్పర్చుకుని

ఆమెద్వారా సంతానాన్ని పొందాడు. అతని ఈ వివాహాన్ని గురించిన వివరాలు ఎక్కడా దొరకలేదు. నేటి ఇంటర్నెట్ సమాచారాలననుసరించి మొదటిభార్య రెబకాని వదిలేసి ఫ్రెంచి యువతితో స్థిరపడిన సంగతి చాలామట్టుకు నిజమని చెబుతాయి. అయితేవీటిలో నిజానిజాలంత ఖచ్చితంగా చెప్పగలిగినస్థాయిలో వుండవు. కలకత్తాలో ఇతని రచనావ్యాసంగం మరింత పెరిగింది. అనేకమంది స్నేహితులు బెంగాలీలో రచనలు చెయ్యమని సలహాలు ఇచ్చారు. మైఖేల్ మధుసూదన్ లో కూడా బెంగాలీ భాషని పునరుద్దరించి సాహిత్య రచనలు సాగించాలనే ఆలోచన పునాదులు వేసుకుంది. శర్మిష్ట అనే బెంగాలీ నాటకాన్ని రచించి మొదటి నవ్యబెంగాలీ నాటక రచయిత అయినాడు. కలకత్తాలో గడిపినదినాలలో చాలమట్టుకు తాగుడికి బానిస అయి అప్పులపాలయి తీవ్రమైన మనోవ్యధతో, బీదరికంలో, హెన్రిట్టా చనిపోయిన మూడురోజులకి, 1873 లో మై ఖేల్ మధుసూదన్ దత్త్ కాలధర్మం చెందాడు.

శ్రీ అరవింద క్రిష్ణ మెహ్రోత్రా తన ఏన్ ఇల్స్ట్రేటెడ్ హిస్టరీ ఆఫ్ ఇండియన్ ఇంగ్లీష్ లిటరేచర్ అనే పుస్తకంలో ఈ సాహిత్య చరిత్రని సవివరంగా కొన్ని విలువైన పాత ఫోటోలు కూడా జోడించి రాసి అందులో మైఖేల్ మధుసూదన్ దత్త్ గురించిన వివరాలు విస్తారంగా రాశారు. ఇందులో మైఖేల్ మధుసూదన్ దత్త్ సాహిత్య జీవనాన్ని మూడు భాగాలుగా వర్ణించారు. మొదటి భాగంలో పూర్తిగా ఆంగ్లభాషాభిమానిగా మధుసూదన్ దర్శనమిస్తాడు. తన ది ఆంగ్లో శాక్సన్ అండ్ ద హిందూ అనే రచనలో భారతజాతి పరిస్థితిని గూర్చి మధుసూదన్ దేశబానిసత్వాన్ని వర్ణిస్తూ నెత్తుటిదాహంతో ఘజనీ అనే తోడేలు భారత భూమి పశ్చిమ శిలల్ని పడగొట్టి, ఇళ్ళని ధ్వంసంచేసి, దేవతామూర్తులని వారి అద్భుత దేవాలయాలనుంచి తొలగించి, మట్టికరిపించి ఆమె వీర కుమారులని బంధించినప్పుడు మొదలైన భారతదాస్య చరిత్ర అక్కడితో ఆగక అనేకమంది ఇతర సుల్తానుల అఘాయిత్యాలకి లోనై బానిసదేశంగా మారిపోయింది అని చెపుతాడు. అదేసమయంలో ఆంగ్లభాషని వర్ణిస్తూ అది ఒక విశాలమైన నదిలా వైభవంగా ప్రవహిస్తూ ఇతర భాషలని సంస్కృతులనీ తనలో కలుపుకుంటూ పోతుందని దాని నెవరూ 'ఇంతే, దీన్ని దాటి నువ్వు ప్రవహించలేవు' అని నిర్దేశించలేరని అంటాడు. ఆంగ్లభాషద్వారా తను పొందగలిగిన అపారమైన జ్ఞానాన్ని పొందిన తర్వాత ఇతరభాషల వైపు దృష్టినిసారించాడు.



ఇదే సమయంలో అప్పటి విద్యావేత్త బెతూనె రాసిన ఒక లేఖలో మధుసూదన్ తన తెలివితేటల్ని - ఆంగ్లకవిత్వం రాస్తూ కాలాన్ని వృధాచెయ్యక బెంగాలీభాషని పునరుద్దరిస్తే తనభాషకి అనన్య సామాన్యమైన సేవచేసినవాడవుతాడని అంటారు. బెంగాలీ రచయిత బంకించంద్ర చటర్జీ కూడా ఈరకమైన సలహానే ఇచ్చాడు. వీరికి సమాధానమన్నట్లు మధుసూదన్ తన రచనా విద్యావ్యాసంగాలగురించిన ఒక ప్రస్తావనలో బైసక్ అనే తన స్నేహితుడికి రాసిన లేఖలో తన దినచర్యని వర్ణిస్తూ - ఆరునుంచి ఎనిమిది దాకా హిబ్రూ, ఎనిమిదినుంచి పన్నెండు దాకా గ్రీకు, రెండునుంచి అయిదుదాకా తెలుగు సంస్కృతం, అయిదు నుంచి ఏడుదాకా లాటిన్, ఏడునుంచిదాకా పదిదాకా ఆంగ్లంలో పరిశ్రమిస్తానని చెప్పినాడు.

మూడవ భాగంలో మధుసూదన్ దత్త్ తన జీవితాన్నిపూర్తిగా బెంగాలీభాషకి అంకితం చేశాడు. అప్పుడే మొదటి బెంగాలీనాటకాన్ని శర్మిష్ట పేరుతో రచించటం జరిగింది. ఈ నాటిక శర్మిష్ట, యయాతిలకథ ఆధారంగా రచించబడింది. బెంగాలీ కవిత్వంలో బ్లాంక్ వెర్స్ రచించి సాహిత్య స్థాయిని పెంపొందిచిన ఘనత దక్కించుకున్నాడు. మేఘనాధ వధ అనే సుప్రసిద్ద కావ్యాన్నీ రచించాడు. ఈరెండూ కూడా బ్లాంక్ వెర్స్‌లోనే రాశాడు. మేఘనాధ వధ కావ్యం చిత్రంగా ఆ రోజుల్లో అసామాన్యమైన ఆలోచన అనగలిగిన పద్ధతిలో రావణాసురుడి కుమారుడు మేఘనాధుడ్ని నాయకుడిగా చిత్రీకరించాడు. ఈతని భార్య ప్రమీల. నాటికీ నేటికీ కూడా ఇది చెప్పుకోదగిన బెంగాలీ కావ్యం. మైఖేల్ మధుసూదన్ దత్తుని చిరస్థాయిగా సాహిత్యప్రపంచంలో నిలబెట్టిన కావ్యమని చాలామంది బెంగాలీ పండితుల అభిప్రాయం కూడా! ఆంగ్లంలో మాత్రం ది కాప్టివ్ లేడీ అనే కావ్యాన్ని రచించాడు.

అయితే, అనేక సందర్భాలలో పరిస్థితులకి చలించి రచించిన కవితలెన్నో వున్నాయి. శ్రీ అరవిందుల వారు "మానవుడు తన అంతరాత్మలో చెలరేగే తుఫాన్లలాంటి అనుభూతుల్ని అత్యున్నతమైన స్థాయిగల భాషలో" ప్రకటిస్తే ఎలావుంటుందో మధుసూదన్ కవితలు వుదాహరిస్తాయని అంటారు. పద్మావతి, తిలోత్తమ సంభవం వీరు బెంగాలీలో రాసిన ఇతర కావ్యాలు

చివరగా చెప్పవలసినవిషయం. తన జీవితాంతం గుర్తింపుకోసం ప్రాకులాడి తను నమ్మిన ఆశయాలకోసం ధనాన్ని, కుటుంబ సంపర్కాన్నీ, విడనాడి పేదరికంలో జీవితంగడిపి, అనేక వ్యసనాలకి బానిసుడై చిట్టచివరికి బెంగాలు భూమిని ఎలా ప్రార్థిస్థాడంటే

ఓబాటసారీ, ఒక్క నిమిషమాగుము!
బెంగాలుమాత నిన్ను తన వాడిగా గుర్తిస్తే
ఇక్కడ ఈ మట్టి గుండెల్లో తల్లి ఒడిని చేరి నిద్రించే
పసివాడిలా శాశ్వత నిద్రను అనుభవిస్తూ
దత్త కుటుంబ సభ్యుడు మధుసూదనుడు ఇల్లుచేరినాడిదిగో!

ఆఖరి క్షణంలో తనను తాను మైఖేల్ మధుసూదన్ దత్ అనుకోకుండా మధుసూదన్ దత్తా ఆఫ్ దత్తాస్ అని వర్ణించుకున్నాడు, తనభాషని తల్లిలాంటి బెంగాలుభూమినీ భక్తితో గౌరవంతో తల్చుకున్నాడు. బెంగాలు గర్వింపదగిన కుమారుడిగా గుర్తింపుని కూడా పొందాడు.

ఇక అతని కవిత్వానికి వస్తే మచ్చుకి కింగ్ పోరస్ - ది లెజెండ్ ఆఫ్ ద ఓల్డ్ అనే కావ్య ఖండిక యొక్క అనువాదం ఈ క్రింద చూద్దాం. ఈ కావ్యఖండిక కథాకథనశైలిలో సాగి పురుషోత్తముడు బందీగా పట్టుబడి అలెగ్జాండర్ ముందు నిలబడినదాకా నడిస్తుంది. వీరుడైన అలెగ్జాండర్ పోరస్ రాజు ధైర్య సాహసాలను చూచి ముగ్దుడవుతాడు. కవి అంతర్థానమైన స్వాతంత్ర కాంక్షని గురించి విచారం వ్యక్తపరచటంతో కథ ముగుస్తుంది.

అర్థరాత్రి తుఫాను ఉచ్చస్వరరంలో పాడుతున్నది,
స్వచ్ఛస్వాతంత్రమా, విషాద సంగీతం నీకోసమే!
మేఘాలన్నీ వురుముతూ ఇస్తున్న సంకేతాలని
ఎవరూ వినటంలేదు. వర్షం కుంభవృష్టిగా కురుస్తూనేవుంది
వరదలతో ఉప్పెనలా ఝీలం నదీ కెరటాలు
ముందుకు త్రోసుకువస్తూనే వున్నాయి!
కళ్ళు చెదిరేటట్టు మెరుపుతీగ మెరిసింది
మేలిముసుగు వెనకమెరిసే యువతి కంటి చూపులా!
ఎగసిపడే బరువైన గాలి తరంగాలలో ఎవరో ఏడుస్తున్నట్టు
ఒక విషాదం. భారతావనీ, నీపుత్రులు ఏమీ ఎరుగని
స్థితిలో గాఢనిద్రలో మునిగివున్నారు!
నిశ్శబ్దంగా, సడిలేని అడుగులతో నెమ్మదిగా
వూపిరిని అంతమొందించే చిరుతలా దగ్గరవుతున్న
మృత్యువురాక వారికసలు తెలియదు.

అగ్నిపర్వతందాచుకున్న భూకంపంలా
శత్రుప్రకంపనలగురించీ, వాళ్ళజీవితాలనావరిస్తున్న
ఘోరతుఫానులగురించి వారికసలు తెలియదు!

తెల్లవారింది! బంగారు సుమేరు పర్వత
శిఖరహర్మ్యాల నుంచి ఉదయకాంతులు
అంతటా ఆవరించి వున్నాయి!
ఒకప్పుడు సర్వప్రపంచం భయభక్తులతో
వినమ్రతతో తలవంచిన భారతదేశపు
విజయకేతనం గర్వంగా ఎగురుతున్నది.
అప్పుడే ఒక భయంకరమైన కేక!
సింహగర్జనతో ప్రతివీరుడూ శత్రువుకి
అభిముఖంగా పరుగులుపెట్టుతున్నాడు,
స్వతంత్రాన్ని పొందటానికో స్మశానానికి చేరటానికో!
మృత్యువుయొక్క ఈకేళిలో ఎంత రక్తం
ఈదేశపు చారిత్రకవైభవంలో మిళితమైనదో,
ఈశుభోదయపు గడియలో ఎన్నిప్రాణాలు
ధూళిలో కలిశాయో?
గ్రీకువీరునిముందు మట్టికరిచిన
పర్వత వృక్షశ్రేణుల్లాంటి వీరులెందరో,
దేశస్వాతంత్రంకోసం వీరమరణంపొందారు!

అయితే శత్రు సమ్ముఖాన నిశ్చలంగా ధీమాగా
నిలబడినరాజు పోరస్, పురుషోత్తముడతడు ఒక్కడే, అడుగో!
రణరంగాన మంచుకిరీటాన్నిధరించిన హిమపర్వతంలా
రాజు, అతని ఫాలతలాన తీవి వజ్రకాంతులీనుతున్నది,
అతని ఏనుగు పాలలాస్వచ్ఛమైన ధవళకాంతులతో
వజ్ర వైఢూర్యాలతో అలంకరింపబడివున్నది!
తనచుట్టూ ఆవరించివున్న ఓటమిఛాయలతన్ని
కదిలించలేదు. కోపోద్రిక్తమైన పెనుగాలులమధ్య
వీరుడిలా పోరాడినరాజు నిలిచాడు నేలకరిచిన
పర్వతవృక్షాలమధ్య అరివీరభయంకరుడిలా

శత్రుసేనలమధ్య వన్నెతగ్గిన కిరీటంతో!
గాలికివణికే గడ్డిపోచల్లా శత్రుసేనలతని
సమక్షంలో భయభీతులై నిలిచారు!
కన్నెత్తిచూడలేని అశక్తులయ్యారు!
చూపుల తీక్షణత ముందు కుచించుకు పోయారు
వారిముందు నిలబడినది మృత్యుభయాన్ని జయించిన
ఒకవీరుడి మెరుపుతీగలాంటి చావంటే భయంలేని వ్యక్తిత్వం,
అంతేకాదు ఎందరినో మృత్యువు కోరల్లోకి త్రోసిన వ్యక్తిత్వం అది!

అజరామరుడైన అలెగ్జాండర్
అత్యాశ్చర్యంతో వీర పురుషోత్తముణ్ణి
తిలకించాడు. ధైర్యంతో దూసుకువస్తున్న
రాజు వేలమంది సైనికులు చుట్టుముట్టగా
అలల తాకిడికి తట్టుకొని నిలచిన సముద్ర శిలలా
నిలిచి తన తండ్రిని తలపించాడు. గ్రీకురాజు రక్తంలో
తడిసిన పురుషోత్తముని గాయాలని పరికించి చూశాడు
"ఆపండి, ఆపండి" అంటూ తనవారిని నిలవరించాడు.
"ఈ మహాపురుషుని రక్తం నేలన చిందరాదు"
ఒక రాయబారి ఓడిన, రక్తమోడుతున్న పోరస్
వద్దకు పంపబడినాడు, "ఓ రాజోత్తమా! వీరుడుదయాళువైన
శత్రువు యుద్ధమాపి నీకై పిలవనంపినాడదిగో!
ఎగసి పడే శాంతి పతాకని చూడు!భీకరయుద్ధానికి స్వస్తిచెప్పి
శాంతికి మేలుకొలుపు చెపుతున్నది!

సింహసంకెళ్ళమధ్యనిలచిన వీరుడు
రక్తమోడుతూ నిలిచాడు గర్వంగా!
కళ్ళల్లో అగ్ని కురిపిస్తూ తిరస్కారదృక్కులతో!
రాజు పోరస్ ముందుకు నడిచాడు
విజయకేళితో చుట్టుముట్టిన సేనలమధ్య
దైవంలా కూర్చున్న అలెగ్జాండర్ దిక్కుగా
చుట్టూతా ప్రపంచపు వీరచక్రవర్తులెందరో
మోకరిల్లిన అలెగ్జాండర్‌కి పోరస్

సామంతుడు కానేకాదు!
అతడు తలవంచలేదు, మోకరిల్లలేదు
నిటారుగా వటవృక్షంలా నిలబడ్డాడు
హిమపర్వతపు గాంభీర్యంతో!
"నిన్ను ఏరకంగా గౌరవించవలెనో చెప్పు"మని
అడిగిన గ్రీకురాజుకు "మరొకరాజునిఏరకంగా
సత్కరించవలెనో అట్లే" అని రాజఠీవితో బదులిచ్చినాడు
భారతదేశపు ప్రౌఢ వీరకుమారుడు!
విజేత సంతసించినాడు, వదిలివేసినాడు.
భారతకిరీటమలా ఓడి గెలిచింది!

అయితే ఏడి పోరస్ రాజు ఈనాడు?
స్వాతంత్రం కోసం రక్తమొలికించి
దేశభక్తిని మెరుపులా గుండెల్లో ధరించి
మృత్యుభయమెరుగని గరుడపక్షుల్లా
శత్రురాజు ముందు నిలవగలిగిన శౌర్యమెక్కడ ఈనాడు?
స్వాతంత్ర్యమా నీవెక్కడ? ఒకపుడు వీర భారతం
కొలిచిన దేవతవీవు!
అజరామరమైన మహిమతో నిండిన నీవు హిమాలయమంత
ఎత్తుకు ఎదిగి ఆకాశాన్ని చుంబించిన ఘనకీర్తి నీది!
ఆ మహిమ ఈనాడు అంతర్ధానమయింది స్వప్నంలా
సెలయేటి నీటిమీద మెరిసే సూర్యకాంతిలా!
ఒకప్పుడు నీ ఫాలతలాన్ని అలంకరించిన
నీకిరీటమీనాడు మట్టికరుచుకుపోయింది.
ఆ ముత్యాలు,, వజ్రాల పొదిగిన బంగరుకిరీటమిప్పుడు నీదికాదు!
నీదేశాన్ని ఆక్రమించిన ప్రతినియంత దాన్నిదొంగిలించి
నిన్ను నీమట్టినుంచి వంచించాడు!
నీవు నిలిచావు ఫలాలులేక పుష్పాలు లేక
ఆకులురాలిన ఎత్తైన మోడులా
నీ ఓటమిలో తిరస్కరింపబడిన బహిష్కరించబడిన
ఒక మహాశక్తిలా!

*డా.శ్యామల కల్లూరి*
*మానవీయ సామాజిక శాస్త్ర విభాగం, ఐ.ఐ.టి న్యూఢిల్లీ*

## తోరు దత్ (1856-1877)



కలకత్తా నగరంలో ఆ రోజుల్లో పేరెన్నిక ఉన్నతకుటుంబాలలో దత్తు కుటుంబం ఒకటి. ఆ కుటుంబములో అనేకమంది రచయితలు కవులు ఉండేవారు. ఒమేష్ చందర్ దత్, రమేష్ చందర్ దత్, మైఖేల్ మధుసూదన్ దత్ మొదలైన వారందరు దత్ ఫామిలీ ఆల్బంలో సభ్యులు. ఆ కుటుంబానికి చెందినవాడే గోవింద్ చందర్ దత్. స్వయానా కవి, అంతేకాదు, బహుబాషావేత్త, పండితుడుకూడా. ఇతనికి ముగ్గురు పిల్లలు అబ్జు, అరు తోరులతా దత్తులు. ఇతని భార్య క్షేత్రమణి దైవభక్తురాలు. హిందూమత దేవీ దేవతలమీద అచంచలమైన విశ్వాసం వుండేది. అయితే తోరుకి ఆరు సంవత్సరాల (1862) వయస్సులో గోవింద్ చందర్ దత్ క్రిస్టియన్ గా మతంమార్చుకున్నాడు. ఆ రోజులలో ఉన్నతకుటుంబాలకి మతమ్మార్పిడు చేసుకోవడం కొత్తకాదు. వాళ్ళు కోరుకున్న విజ్ఞానం ఇంగ్లాడులో వుందని అది పొందాలంటే మతంమార్పుడు ఒక పాస్ పోర్ట్ లాంటిదని వాళ్ళు నమ్మారు. అదే తరంలో మైకేల్ మధుసూదన్ దత్ కూడా మతం మార్చుకున్నాడు. ఒకరకంగా అధికారపీఠానికి దగ్గరగా వుండాలన్నా నాటి బ్రిటీషు అధికారులకి చేరువకావాలన్నా ఆంగ్లంలో ప్రావీణ్యంసంపాదించటం ఒకటైతే, జ్ఞానసముపార్జనకోసం ఇంగ్లాడు వెళ్ళాలన్నా కూడా ఆంగ్లం భాష నేర్చుకోవటం అత్యవసరమయింది. ఇందులో నిజానికి ఆధునిక విచారధారపట్ల వీళ్ళకి వున్న అపరిమితమైన ఆకర్షణ కూడా ఈరకమైన మార్పుకి కారణమని చెప్పవచ్చును. గోవింద్ చందర్ దత్ కుటుంబంలో ఈ మతంమార్పు కారణంగా భార్యాభర్తలమధ్య కొంతకాలపాటు వివాదాలు ఏర్పడ్డాయి. అయితే భారతీయ విలువలని గౌరవించే స్త్రీ కనుక ఆమె త్వరలోనే భర్త అడుగుజాడల ననుసరించి తనుకూడా క్రిస్టియన్ మతం స్వీకరించటమే కాక సహజంగా వున్న భక్తి ప్రపత్తుల వలన ఈమతం పట్ల కూడా మమకారాన్ని, భక్తినీ పెంపొందించుకోగలిగింది.

చిన్ననాటి నుంచి తండ్రి ఆధ్వర్యంలో పిల్లలు మంచి జ్ఞాన తృష్ణని అలవరుచుకున్నారు. అంతేకాదు స్వేచ్ఛపట్ల మమకారాన్ని, సృజనాశక్తినీ పెంపొందించుకున్నారు. గోవింద్ చందర్ పిల్లలికి ఇంట్లోనే విద్యాబుద్ధులు ట్యూటర్ ద్వారా నేర్పించాడు. పిల్లలవిషయంలో దురదృష్టవంతుడైన ఈ పండితునికి అడుగడుగునా అడ్డంకులెదురయ్యాయి. కొడుకుకి పదునాలుగేళ్ళవయస్సులో (1865) అతన్ని పోగొట్టుకున్నాడు. అక్కచెల్లెలిద్దరికీ ఈ మృత్యువు ఒక దెబ్బ. ఈ మృత్యువుతో వాళ్ళిద్దరూ ఒకరికొకరు చేరువయ్యారు. తోరుకి పదమూడేళ్ళ వయస్సులో కుటుంబాన్ని యూరోపు తీసుకువెళ్ళాడు. కలకత్తాలో అతని మతంమార్పిడి వలన సమకాలీన సమాజంలోని ఛాందసవాదులు వారి కుటుంబాన్ని వెలివేశారు. గోవింద్ చందర్‌కి ముందునుంచీ ఆంగ్ల సాహిత్యాన్ని అభ్యసించాలంటే దేశాలకి వెళ్ళడం అనివార్యమని తోచింది. మొదట వాళ్ళు ఫ్రాన్స్ వెళ్ళి అక్కడ కొన్ని నెలలున్నారు. అరు, తోరు ఒక స్కూలులో చేరి ఫ్రెంచ్ భాషని

నేర్చుకున్నారు. ఈ భాషపట్ల మమకారం తోరుకి జీవితాంతం వుంది. తర్వాత వాళ్ళు ఇటలీ వెళ్ళీ ఒక సంవత్సరం తర్వాత ఇంగ్లాండ్ వెళ్ళారు. ఫ్రెంచి భాషపట్ల మమకారాన్ని కొనసాగిస్తూనే ట్యూటర్ దగ్గర ఆంగ్ల భాష, సంస్కృతుల గురించిన జ్ఞానాన్ని సంపాదించారు. తోరు కేంబ్రిడ్జి యూనివర్సిటీలో అధ్యయనం చేసింది. అక్కచెల్లెలిద్దరూ ఫ్రెంచి కవితలని ఆంగ్లంలోకి అనువదించటం మొదలుపెట్టారు. ఇక్కడే తోరు మేరీ మార్టిన్ అనే ఆంగ్ల యువతితో స్నేహం చేసింది. ఆమెకి తోరు రాసిన ఉత్తరాలు అప్పటి వాళ్ళజీవితాన్ని గురించీ తదనంతరం వాళ్ళు ఎదుర్కొన్న సంకటాలగురించీ తర్వాత తరాలకి తెలియజేసే పరిశోధనలకి ఆధారాలయ్యాయి.

నాలుగేళ్ళ విదేశవాసం తర్వాత కలకత్తా తిరిగి వచ్చిన ఈ కుటుంబాన్ని ఛాంధస కుటుంబాలకి చెందిన ఉన్నత సమాజంలో ఇమడలేక పోయారు. స్వదేశంలో వున్నన్నాళ్ళు ఫ్రెంచి సాహిత్యాన్ని ఆంగ్లంలోకి అనువదించటం కొనసాగించారు. ఈ సమయంలో మళ్ళీ విషాదం జరిగి 1874 అదే క్షయ వ్యాధితో అరు మరణించింది. తోరు అనవరతం అన్న అక్కల స్మరణంలోనే గడపసాగింది. 1876 తోరు ఎ షీఫ్ గ్లీన్డ్ ఇన్ ఫ్రెంచ్ ఫీల్డ్ అనే పేరిట కలకత్తాలో ఒక ప్రెస్సులో ప్రింట్ చేయించి తను అరు కలిసి అనువదించిన కవితల్ని ప్రచురించింది. కొన్ని నెలలు మాత్రం ఫ్రాన్స్ దేశంలో ఉండి, భాషని నేర్చుకుని విక్టరు హ్యూగోలాంటి ఉద్దండులైన కవులని వీరిద్దరూ అనువదించారు. ఈ అనువాదాల్ని సుప్రసిద్ధ ఇంగ్లీష్ కవి ఎడ్మండ్ గోస్ కి పంపింది. అవి చదివిన గోస్ ప్రింటింగ్ నాణ్యతని ఉపేక్షిస్తే ఈ అనువాదాలు చాలా మెచ్చుకోదగినవని పేర్కొన్నాడు. అతను చేసిన రివ్యూ ది ఎక్సామినర్ అనే ఆంగ్ల పత్రికలో ప్రచురించబడింది. ఇందులో దాదాపు డెబ్బయి కవుల కవితలు నూట డెబ్బయిమూడు దాకా వున్నయి. ఈ సమయంలోనే తండ్రీ కూతుళ్ళిద్దరూ సంస్కృత భాషని అభ్యసించటం మొదలెట్టారు.

కలకత్తాలో వున్నప్పుడు దీక్షతో సంస్కృతాన్ని అభ్యసించి భారతీయ పురాణసాహిత్యాన్ని, పురాణ పురుషులగురించి చిన్నతనంలో తల్లి చెప్పిన కథలనీ మేళవించి ఒక సంకలనాన్ని తయారు చేసింది. అయితే అప్పటికే క్షయ మహమ్మారి తక్కిన పిల్లల్ని పొట్టన పెట్టుకున్నట్టే తోరుని కూడా ఆవహించింది. అనుక్షణం నీడలా వెంటాడిన మృత్యువుతో దాదాపు రెండు సంవత్సరాలు సహజీవనం చేసి 1877 లో అతిచిన్నవయస్సులో కాలధర్మం చేసింది.

ఈ తరం కవులందరూ చిన్నవయస్సులోనే కన్నుమూయటం గురించి రాస్తూ ప్రొఫెసర్ శ్రీనివాస అయ్యంగార్ వీళ్ళందరూ అసంపూర్తిగామిగిలిన ఖ్యాతికి వారసులని అభివర్ణిస్తారు. తోరుదత్ మరణించిన తర్వాత ఆమె కాగితాలలో దొరికిన ప్రతిని "ఏ షీఫ్ గ్లీన్డ్ ఇన్ సంస్కృత్ ఫీల్డ్స్ అనే కావ్యాన్ని తండ్రి ప్రచురించాడు. ఇదే తర్వాత "ఏన్షియంట్ లెజెండ్స్ అండ్ బాల్లెడ్స్ ఆఫ్ హిందూస్థాన్" పేరిట ప్రచురితమై ఖ్యాతి పొందింది. ఇందులో "అవర్ క్యాజురీనా ట్రీ"తో పాటు, రామాయణం నుంచి, మహాభారతం నుంచి విష్ణుపురాణం నుంచీ కథలు తీసుకుని కవితలుగా మలచబడినాయి. తోరు చేతి మంత్రదండం ఈ కథలని వుట్టి పుక్కిటిపురాణాలలా కాక ఆమె స్వంత దృష్టికోణం కూడా మేళవించిన కవితా సృష్టిగా తీర్చిదిద్దింది.. ఈ అద్భుత పరిమాణాన్ని సీత అన్న కవితలో స్పష్టంగా వ్యక్తమవుతూ చూస్తారు. సీత కేవలం పురాణపాత్రగానే కాక తన స్వంత జీవితంతో సీత కథ ఎల్లా ముడిపడివుందని, ఆమె వ్యక్తపరిచిందో చూడవచ్చును.

భారతదేశంలో స్త్రీలు స్కూళ్ళకి కాలేజికి వెళ్ళడమే అరుదైన రోజులలో తోరుదత్ దేశ విదేశాలలో తన కవితలకి ప్రశంసలనందుకుంది. స్త్రీ స్వాతంత్ర్యానికి ఈరకంగా శ్రీకరం చుట్టడమేకాక తన తర్వాత ఎందరినో ఉత్సాహపరిచి, స్ఫూర్తినిచ్చింది. ఈమె మరికొన్ని సంవత్సరాలు బ్రతికి వుండి వుంటే మరిన్ని కీర్తి శిఖరాలని అందుకుని వుండేది అని నాటి సమకాలీన కవులు విద్వాంసులే కాక నేడు ఆమె కవితలని చదివిన వారుకూడా అనుకుంటారు. ఇప్పుడు కొన్ని కవితలు మచ్చుకి చూద్దాం!

## మా క్యాజురీనా చెట్టు

అది ఒక పెద్ద చెట్టు!
వేళ్ళూనుతూ తారలదాకా ఎదిగిన చెట్టు
చిటారికొమ్మ దాకా, దానిచుట్టూ కొండచిలువ చుట్టుకున్నట్లు
ఓ తీగ! ఆ బిగి కౌగిలి ధాటికి మరే చెట్టూ తట్టుకోలేదు!
మా చెట్టు మాత్రం మంకెన పువ్వుల
స్కార్ఫ్ చుట్టుకొన్నమొనగాడిలా
నిట్టనిలువుగా!
అన్నికొమ్మలకీ అల్లుకున్న తీగకి
చెట్టునిండుగా పువ్వులు, గుత్తులుగుత్తులుగా!
చెట్టంతా కలకలారావాలు!
పిట్టలతో, తేనెటీగల ఝుంకార నాదాలతో
అప్పుడప్పుడు అర్థరాత్రి దాటినా
తోటనిండా సంగీతపు వెల్లువలు!
కోయిలగానంతో నిద్రాణ ప్రపంచం
మత్తులో మునిగిపోతుంది.

శీతాకాలపు వేకువఝామున నా కిటికీ తెరవగానే
నా కళ్ళు ఆ రెండు చెట్టుమీద వాల్తాయి!
వేకువ వేళ ఒక గచ్చకాయ రంగు బబూన్
ఒంటరిగా పై కొమ్మలమీద
సూర్యోదయాన్ని చూస్తూ నిశ్చలంగా కనిపిస్తుంది.
క్రింద కొమ్మలమీద దాని పిల్లలు
అరుస్తూ, ఆడుకుంటూ!
దూరతీరాలెక్కడినుంచో కోకిలలు
సూర్యోదయానికి స్వాగతమిస్తూ పాడుతుంటాయి.
పశువులన్నీ నిద్ర కళ్ళతో తటాకం దిశగా కదుల్తాయి!
చెట్టు పంచే నీడక్రింద తటాకంలో
నీటి కమలాలు...మంచుముద్దల్లాగా!

దానితో ముడిపడిన నా జ్ఞాపకాలు ఎన్నో!

అందుకే ఆ చెట్టు అంత ప్రియం నాకు!
దాని పరిమాణం కాదు కారణం!
దానినీడలో మేమాడిన  ఆటలు పాటలు
సంవత్సరాలు గడిచినా వాడని స్మృతులు!
నేను గాఢంగా ప్రేమించిన నాటి నా సహోదరుల
తిరిగిరాని ఆ రోజులు నేటికీ నాకు ప్రియం!
వేడి కన్నీటితో మూసుకుపోయిన రెప్పలవెనుక
మీ రూపాలు నాటి ఆనంద దీపాలు
నేటికీ నాకు ప్రియాతిప్రియం!
ఎక్కడిదీ విషాద సంగీతం?
అది వృక్షం చేసే శోకాలాపం!
నాలాగే రోజులు తల్చుకుంటూ
మా ఈ రోదన రోదసిని చీల్చుకుని
తెలియని లోకాలకు పైకి, పైపైకి వెళ్ళాలని...

తెలియని లోకాలు, అయినా
మా విశ్వాసాలకు చిరపరిచితాలు!
పాట నేను విన్నాను!
దూరంగా బహుదూరంగా, సముద్రతీరాలలో
రాళ్ళమధ్య చిక్కుకుపోయిన
కెరటాల మధ్య
నీటి రాక్షసులు బంధింపబడిన గుహలలో
ఫ్రాన్స్ లో,ఇటలీలో, వెన్నెలతీరాలలో
సమస్త జగత్తూ నిద్రలో మునిగిన నిశ్శబ్దరాత్రులలో నేను విన్న
సంగీతం - నాకళ్ళముందు నీ రూపం!
ఓ మహా వృక్షమా, నా ఇంటి వెనుక నువ్వున్నట్టే!

అందుకే నీకంకితం నా ఈ పాట!
ఇప్పుడు
శాశ్వతనిద్రలో వున్న నా సఖుల జ్ఞాపకచిహ్నంగా
నాక్యాజురీనా నాకెప్పుడూ ప్రియం!
మహాకవి చెప్పిన చావులేని  మహావృక్షాలలో

ఈ నాచెట్టు ఒకటిగా నిలుస్తుంది!
నాపాట నీరసించిపోవచ్చు కానీ
నా ఈచెట్టు మృత్యువుని జయించి
కలకాలం నిలుస్తుంది!

ఆంగ్ల మహాకవి వర్డ్స్ వర్త్ 'యూ ట్రీస్' అని తాను చూసిన నాలుగు మహావృక్షాల మొదళ్ళని గురించి రాస్తాడు. చెట్లు క్రీస్తుపూర్వానికి చెందినవని అతి పురాతనమైనవని కవి అందులో కీర్తిస్తాడు. తోరు ఇందులో వాటిని ప్రస్తావించి తానంతటి గొప్ప కవయిత్రి కాకపోయినా తన క్యాజురీనా చెట్టు శాశ్వతంగా నిలవాలని ఈ కవితని వ్రాస్తుంది. ఈ కవితని జనం చదివినన్నాళ్ళు చెట్టు నిలుస్తుందనేది నిజమేకదా!

*<u>నీటి కమలం (ది లోటస్)</u>*

ప్రేమదేవత పుష్పాధిదేవత దగ్గరికి వచ్చి
అడిగింది- ఒక్క పువ్వు అన్ని పువ్వులకి
రాణి అనదగినదానిని ఇవ్వగలవా?- అని.
గులాబీ కీ లిల్లీ పువ్వుకీ ఈ స్థానంకోసం
తగాదా వుండనేవుంది ఎన్నో సంవత్సరాలుగా!
కవులందరూ రెండు పక్షాలయిపోయి ఇద్దర్నీ
నోరారా కీర్తిస్తూనే వున్నారు.
"గులాబి ఎప్పటికీ లిల్లీలా నిలువుగా ఎత్తుగా
జ్యూనోలాఎదగలేదు" "అయితేమాత్రం లిల్లీ అందమైనదా?"
అనంతుడూ అజరామరుడు అయిన మనిషి తోటలోనూ
పుష్పాల పక్షాల వాద సమ్వాదాలు చెలరేగుతున్నాయి.
"అయితేనాకొక పువ్వునివ్వు- గులాబీలా అందమైనదీ,
లిల్లీలా రాజఠీవితో అలరించేది అయిన పువ్వు ఒకటి ఇవ్వు"
దానికేరంగు అద్దాలి మరి?" గులాబీ ఎరుపు... కాదు, కాదు
లిల్లీ తెలుపు... రెండూ రెండురంగులూ వున్నపువ్వు" ప్రేమ ప్రార్థన
అప్పుడు పుష్పదేవత సృష్టించి ఇచ్చింది కమలాన్ని- నీటి పుష్పాన్ని
గులాబీ తెలుపు రంగులు మేళవించి రాజసం
ఉట్టిపడే అందమైన కమలం!

## ప్రేమ దేవత:

## జ్యూనో

## సీత

చీకటి గదిలో  ముగ్గురు పిల్లలు సంతోషంగా
కళ్ళువిప్పార్చుకు దేనికేసి అంత దీక్షగా చూస్తున్నారు?
వాళ్ళకళ్ళముందు ఒక దృశ్యం! అందులో సూర్యకిరణం కూడా జొరబడలేని
చిక్కని దట్టమైన అడవి. దాని మధ్యలో ఒక సమప్రదేశం!
దానిచుట్టూ ఎత్తుగాఎదిగిన చెట్లని అల్లుకున్న తీగలకు వ్రేలాడుతూ
గుత్తులుగుత్తులుగా పువ్వులు! మధ్యలో
ఒక ప్రశాంతమైన స్ఫటిక సమానమైన స్వచ్ఛతతో ఒక సరస్సు!
అందులో కదలాడుతూ అందమైన హంసలు! అదుగో
గుబురుగా పెరిగిన పొదలమధ్యనుంచి దూకుతూ ఒక నెమలి!
గుంపులుగుంపులుగా తారాడుతూ అడవి జింకలు!
ధాన్యాలతో నిండిన పచ్చని పొలాల మధ్య ఒక ఋష్యాశ్రమం!
హోమగుండాన్నుంచి పైకిలేస్తూ నీలిరంగు పొగ
ఋశ్యాశ్రమంలో మునివరుని నివాసం!
చక్కని ప్రశాంత వాతావరణంలో ఎవరీ లలామ?
ఆమె కన్నుల కన్నీరు? ఏమికారణమో మరి?
ఆమె కార్చే ప్రతి కన్నీటిబొట్టుకీ ప్రతిస్పందిస్తూ
మూడుజతల కళ్ళలో నీళ్ళు!
ముగ్గురి పసి తలలు దుఃఖభారంతో వంగిపోయి వున్నాయి!
అది ఒక పురాతనమైన కథ! కథనుంచి సీతమ్మని మేల్కొలిపి
కళ్ళలోనిలిపిన పాట ఒకతల్లి పాడుతున్నది!
పాట ఆగిపోయింది! దృశ్యంచెదిరిపోయింది!
అయినా పిల్లలు ఆ జ్ఞాపకాన్ని జీవితాంతం తల్చుకుంటారు!
పిల్లలు ముగ్గురూ మళ్ళీ తల్లి ప్రక్కన చేరి కథలూ పాటలూ
వినే సాయంసమయం మళ్ళీ వస్తుందా?

✡ ✡✡

*డా. శ్యామల కల్లూరి*

*మానవీయ సామాజిక శాస్త్ర విభాగం, ఐ.ఐ.టి న్యూఢిల్లీ*

## రబీంద్రనాథ్ టాగోర్ (1861-1941)



**గురుదేవుడని,** విశ్వకవి అని అనేక నామాలతో మనందరికీ సుపరిచితుడయిన కవి రబీంద్రనాధ టాగోర్. కలకత్తాకి చెందిన సుప్రసిద్ధ బెంగాలీ ఉన్నత సమాజానికి చెందిన శ్రీ దేవేంద్రనాథ్ టాగోర్ కి కనిష్ఠ కుమారుడిగా రబీంద్రనాథ్ 1861 మే 8న జన్మించాడు. తండ్రి దేవేంద్రనాథ్ టాగోర్ బ్రహ్మసమాజం సంస్థాపనలో ముఖ్యపాత్రని నిర్వహించారు. రబీంద్రనాథ్ తనచిన్నతనంలో ఇంటిదగ్గరేవుండి చదువుకున్నాడు. పదిహేడేళ్ళవయస్సులో ఉన్నతవిద్యాభ్యాసంకోసం ఇంగ్లండు వెళ్ళినా అక్కడ చదువు పూర్తిచెయ్యలేదు. జీవితమంతా రచనా వ్యాసంగానికే గాక ఎన్నో సృజనాత్మకమైన కార్యకలాపాలలో వ్యస్తుడైన ఈ కవికి ఆకాశమే సరిహద్దు. విశ్వవ్యాప్తంగా వీరు ఆర్జించిన కీర్తికి నోబెల్ బహుమానాన్ని మించిన ఉదాహరణలేదు. 1913లో భారతదేశంలోనేకాక ఆసియా ఖండానికే మొట్టమొదటిసారి సాహిత్యంలో నోబెల్ బహుమతిరావడానికి టాగోర్ పునాదివేశారు. నోబెల్ పురస్కారగ్రహీతగా భారతీయులకి ఎప్పటికీ చిరస్మరణీయుడు. ఎందుకంటే తర్వాత 1930లో సర్ సి.వి రామన్ కి వచ్చిన పురస్కారాన్ని మినహాయిస్తే తక్కిన భారతదేశానికి వచ్చాయని మనమనుకునే నోబెల్ పురస్కారాలన్నీ భారతావని వదిలి బయటికి వెళ్ళిన రచయితలకీ, శాస్త్రవేత్తలకీ ఆర్థికశాస్త్రనిపుణులకీ వచ్చాయికాని దేశంలో ఉండి ఈ నేలమీద నుంచి ఉద్భవించిన ప్రతిభాపాండిత్యాలకి రాలేదనే చెప్పాలి. దీనికి వేరేకారణాలెన్నయినా వుండవచ్చును కాని ఇదిని ఖార్సయిన నిజం. అందుకే అప్పటికీ, ఇప్పటికీ టాగోర్ చిరస్మరణీయుడు. ఇదికాక 1915లో అప్పటి పాలకదేశమైన బ్రిటీషుప్రభుత్వం నైట్ హుడ్ ని ఇచ్చి వీరిని సత్కరిస్తే బ్రిటీషు పాలనాపద్ధతికి విరుద్ధంగా వ్యతిరేకతని వ్యక్తపరుస్తూ ఈ సత్కారాన్ని తిరస్కరించారు. కవిగా, నాటకరచయితగా, సంగీతకారుడుగా, వాగ్గేయకారుడుగా, చిత్రకారుడుగా, బహుముఖప్రజ్ఞాశాలి అయిన టాగోర్ ఎక్కువగా కవిగానే ప్రఖ్యాతిపొందాడు. ఇంకే ఇతర ప్రక్రియలోను కవిగా పొందిన గుర్తింపురాకపోవడానికి కారణం గూడా కవిగా నోబెల్ పురస్కారాన్ని పొందటమనే అనుకోవచ్చును. వీరి రచనలన్నీ అనేక భారతీయ, యూరోపియన్ భాషలలోకి అనువదింపబడినాయి. అన్నిటికన్నా భారతీయులందరూ గర్వింపదగిన విశేషం స్ట్రాట్ఫోర్డ్ అపాన్ అవోన్గా అందరికీ సుపరిచితమయిన షేక్స్పియర్ జన్మస్థలంలో ఉద్యానవనంలో టాగోర్ విగ్రహం ఈ విశ్వవిఖ్యాత నాటకవేత్తకి టాగోర్ అర్పించిన నివాళితో గూడి నెలకొని వుంది.

ఈకవి రూపులో, చూపులో, వాక్కులో, వాగ్ధాటిలో ప్రతి భావంలో పలుకులో గుండెని సున్నితంగా స్పృశించి పులకింపచేసే గాఢత్వం, సౌందర్యం వున్నాయి. ఏదో ఒక అతీతమైన భావ ప్రపంచంలో అనవరతం నివసించే రవీంద్రులు ఏ కాలేజీడిగ్రీలకీ అందని ఒక అపూర్వ సంస్కారానికి వారసులు. నిజానికీ ఎన్నో విద్యాసంస్థలు నెలకొల్పి విశ్వభారతి వ్యవస్థాపకులైన టాగోర్ ఏ కాలేజీలోను చదువుకోలేదు. ఏ యూనివర్సిటీ డిగ్రీనీ పొందలేదు. ఏ కాలంలోనైనా, ఏ సందర్భంలోనైనా ఏ మతస్థులైనా చదివి ఆనందిపగలిగిన కవిత్వాన్ని జాతికి వారసత్వంగా ఇచ్చిన ఈ మహనీయుడు వస్తుతః కవి. తర్వాతే ఏదైనా. వీరి కవిత్వాన్ని ట్రాముల్లోను, బస్సుల్లోను, బస్ స్టాపుల్లోను, చదువుకుని పరవశించి పోయేవాని ప్రఖ్యాత బ్రిటీషు కవి, నోబెల్ విజేత డబ్ల్యు.బి యేట్స్ ఒకచోట చెప్పారు. అయితే, ఒక విశేషం వుంది. షేక్స్పియర్‌ని ఇంగ్లాండులో జనమెల్లాచదవటమ్మానేశారో అల్లాగే టాగోర్ జన్మస్థలమయిన బెంగాలులోను, భారతదేశంలోను టాగోర్‌ని చదివేవారి సంఖ్య తగ్గిందని చెప్పాలి. వారి ఆదర్శవాదం తర్వాత వచ్చిన సామాజిక స్పృహ చాలామట్టుకు దీనికి కారణం కావచ్చును.

మనదేశంలో ఎంత భాషా వైరుధ్యముందంటే ఒక భాషలో ఒక కవి పలికితే అతనెంత గొప్పవాడైనా విదేశాలమాట అటుంచి స్వంతదేశంలోనే నలుమూలలా కీర్తినార్జించగలగడం చాలా గొప్ప విషయం. సాహిత్య అకాడమీలుకాని, జ్ఞానపీఠంవారు గాని ఏ రచయితకైనా అవార్డు ఇస్తే ఒహో అని ఆనందిస్తాంగాని మనభాషతప్ప మరే ఇతరభాషలకైనా ఈ అవార్డులు లభిస్తే రచయిత పేరును మించి మనకే విధమైన సమాచారమూ తెలియని సందర్భాలెన్నో వున్నాయి, ఇంక వారి రచనా వ్యాసంగాన్ని గురించైతే చెప్పనే అక్కరలేదు. దీనికి విరుద్ధంగా రబీంద్రనాథ్ టాగోర్‌కి పేరు గుర్తింపు వచ్చాయంటే అది వీరి కవిత్వం వివిధ భారతీయ భాషలలోకి అనువదించటం వలననే సాధ్యపడింది. టాగోర్ చాలామట్టుకు తన కవిత్వాన్ని తానే ఆంగ్లంలోకి అనువదించుకున్నారు. అయితే బెంగాలీ తెలిసిన వారెందరో ఈ ఆంగ్లానువాదాలతో తృప్తులు కాలేదు. బెంగాలీలో గీతాంజలి చాలా ఉన్నతమైన గ్రంథమని పలువురి బెంగాలీ ప్రియుల అభిప్రాయం. అయితే భాషతెలియని వారికి వీరి ఆంగ్ల రచనలు అనుసృజనలాగే అనిపిస్తాయి, అడపాదడపా స్వతంత్రపతిపత్తిగల కవితల్లా అనిపిస్తాయి కాని అనువాదాల్లాగా అనిపించవు. మూలంతో మనకి పరిచయంలేదు కనుక. అది అల్లావుంచి వీరి ఆంగ్లానువాదాలు బెంగాలీ తెలియని వారికి వీరి కవిత్వాన్ని వేరే భారతీయభాషల్లోకి అనువదించటానికి తోడ్పడ్డాయి. గీతాంజలిలాంటి కావ్యాలని చలంలాంటి ఉద్దండులు తెలుగులోకి అనువదించారు. చలమొక్కడేకాదు గీతాంజలిని తెలుగులోకి పలువురు అనువదించారు. ఈశ్వరుడ్ని తాను నమ్మని రోజుల్లోకూడా గీతాంజలి తనకి పారాయణ గ్రంథమని చలం చెప్పుకున్నారుకూడా!

భారతీయ కవిగా వీరు పొందిన అంతర్జాతీయ ఖ్యాతి వీరికి యూరోపు, అమెరికా జపాన్ జర్మనీ వంటి దేశాలలో పర్యటించే అవకాశాన్ని కల్పించింది. రోజులలో దేశవిదేశాల కవులు కళాకారులు టాగోర్‌తో సత్సంబంధాలు కలిగివుండే వారు. శాంతి ప్రియుడిగా, సర్వమానవ సౌభాతృత్వాన్ని కామించిన కవిగా అందరి ప్రశంశలని అందుకున్నారు అయితే టాగోర్ అప్పుడు దేశంలో జరిగే స్వాతంత్ర ఉద్యమానికి దూరంగా వున్నారనే చెప్పచ్చును. వీరి రచనలలో స్వేచ్ఛాప్రియత్వం కనిపిస్తుంది అయితే స్వాతంత్ర ఉద్యమానికి వ్యతిరేకి కాకపోయినా అప్పుడు దేశాన్ని కదిలించిన గాంధీ అహింసా ఉద్యమాలలో టాగోర్ పాల్గొనలేదు. అదేసమయంలో సుభాష్ బోస్, అరబిందో తదితరులు నమ్మిన తీవ్రవాదానికి సరే, స్వతహాగానే విరుద్ధులు. నేషనలిజం అని వారు వ్రాసిన వ్యాస సంపుటిలో కూడా తాను విశ్వసించే సర్వమానవ సౌభాతృత్వం గురించి రాసిన ఉద్దేశ్యాలు వీరు దేశభక్తికి వ్యతిరేకులుకారుకాని, ఏరకమైన సంకుచిత దేశవాదాన్ని గూడా సమర్థించలేదని పలువురి అభిప్రాయం.

ఐన్ స్టైయిన్ సహితం అనేక శాస్త్రవేత్తలు, సి. ఎఫ్. ఆండ్ర్యూస్ వంటి మనవతా వాదులు వీరిని సందర్శించిన ప్రముఖులు. దేశంలో తెలుగు భాషతో సహా అనేక భాషల కవులు పండితులు, సంగీతకారులు చిత్రకారులు టాగోర్ చేత ప్రభావితులైనారు. టాగోర్ పిఠాపురం సంస్థానానికి వచ్చినప్పుడు ప్రచారంలో వున్న కథ ఆచంట జానకిరాంగారు ఒకసారి చెప్పారు. టాగోర్‌కి పిఠాపురం రాజా వారు

ఆహ్వానాన్ని పంపిస్తూ 'మా స్థానంలో ఒక వైణిక విద్వాంసులు ఉన్నారు. దయచేసి తమరు ఒక గంట వారి వీణావాదనాన్ని వినవలసిందిగా కోరుతున్నాము' అని రాస్తే టాగోర్ వచ్చారట. రాత్రంతా విద్వాంసులు వీణ వాయిస్తూనే వున్నారట. టాగొర్ కదలక, మెదలక విన్నారటకూడా. 'మీ రాజావారు ఒక గంట వినమని అడిగినారు. ఇంత మహావిద్వాంసుణ్ణి ఎంత సేపయినా వినవచ్చును' అని అభినందించినారట. ఆ విద్వాంసులు వైణికసార్వభౌములు శ్రీ తుమరాడ సంగమేశ్వర శాస్త్రిగారు. టాగోర్ భావాలు, కళాభిరుచి ఆ రోజుల్లో చాలామంది తెలుగు కవుల్ని ప్రభావితుల్ని చేసింది. ఈకవి 1941లో కాలధర్మం చెందారు. రవీంద్ర సంగీతం ఇప్పటికీ బెంగాలీ సంస్కృతిలో ఒక విడదీయలేని అంశం. నందలాల్ బోస్, జతిన్ దాస్ లాంటి ఎందరో కళాకారులకి ఈయన మార్గ దర్శకుడు. కృష్ణశాస్త్రి, బసవరాజు లాంటి తెలుగు కవుల సహితంగా ఎందరో భారతీయ కవులు టాగోర్ రచనలతో ప్రభావితులైనారు.

ఇక టాగోర్ కవిత్వానికి వస్తే, ఇతని కవిత్వమంతా అంతర్లీనంగా ప్రవహించే భావధార. వీరి సౌందర్యారధన, ప్రతి చెట్టులో పుట్టలో, పువ్వులో అందాన్ని తద్వారా భగవంతుణ్ణి చూడగలిగిన అంతర్నేత్రం కవిత్వం అంతటా విస్తరించి వుంటుంది. గడ్డిపోచనుంచి మహావృక్షందాకా, చిన్న నీటి బిందువునుంచి అనంతమైన జలరాశిదాకా ప్రతిదానిలో సౌందర్యాన్ని తద్వారా భగవత్ స్వరూపాన్నీ చూశారు ఈ కవి. ఆకాశంలో ఎగిరేపక్షి, నీటిలో కదలాడే చేప నేలమీద నడిచే భూచరులైన జంతువులు మనుష్యులు అందరూ అన్నీ కవితా వస్తువులే! తెల్లవారు ఝామునలేచి నిశ్చలంగా టాగోర్ తోటలో గంటల తరబడి కూర్చునేవారట. అప్పుడు ప్రకృతి కదలక మెదలక మేరు పర్వతంలా కూర్చున్న ఈ వ్యక్తి తనలో ఒక భాగమమేననుకుని నిస్సంకోచంగా సంపూర్ణంగా తన సౌందర్యాన్ని వీరిముందు పరిచి ఆయనని పరవశుడిని చేసేదని టాగోరే స్వయంగా చెప్పుకున్నారు. తత్ఫలితంగానే ఈ కవి గొంతువిప్పి పరవశుడై ప్రకృతిలోని ప్రతి అణువునీ అందాన్నీ కీర్తించాడు. ప్రకృతిలో తాను లీనమై దర్శించిన పరమాత్మ స్వరూపాన్ని మనముందు ప్రత్యక్షం చేసారు. వీరు చూపించిన శక్తి స్వరూపం పరమాత్ముడిదని మనం అనుకుంటే పరమాత్ముడు ఏ మతానికీ ఏ ధర్మానికీ, ఏ జాతికి పరిమితుడుకాదు. అందరివాడు. ఒక విశ్వజనీనమైన శక్తి. ఈ భగవత్ స్వరూప రూపకల్పనకి అధారం మన వైష్ణవ భక్తి సాంప్రదాయం. మధ్య యుగాలలో భారతీయ సాహిత్యంలో ఈ భక్తిసాంప్రదాయం విస్తారంగా ప్రచారంలో వుండేది. గీతాంజలి, క్రిశెంట్ మూన్, గార్డినర్, క్రాసింగ్, స్ట్రేబర్డ్స్ లాంటి కావ్యఖండికలలో దీని ఛాయలు మనకి కనిపిస్తాయి. భగవంతుణ్ణి ఇష్టసఖుడిగా, ప్రేయసిగా, తల్లిగా తండ్రిగా, రారాజుగా, వేదాంతిగా, ఆచార్యుడిగా, శిశువుగా వివిధస్వరూపాలలో వివిధ సందర్భాలలో దర్శించిన కవి ఈ అన్ని రూపాలనీ మనముందు ఆవిష్కరిస్తారు. హోం అండ్ ద వర్ల్డ్, గోరా లాంటి ప్రసిద్ధ నవలలు, కుదితపాషాణ్ తదితర కథలు, పోస్టాఫీసు, కింగ్ ఆఫ్ ది డార్క్ చాంబర్ చిత్రాంగద లాంటి నాటకాలు తదాది రచనలు కోకొల్లలుగా సాగించారు. కొన్ని మచ్చుకి అనువాదాలు వారి కవితలనుంచి. తన రచనలు ఆంగ్లంలోకి అనువదించినప్పుడు టాగోర్ వాటిని చాలామట్టుకు వచన పద్యాలుగా మలిచారు. ఈ తెలుగు అనువాదాలుగూడా వచనపద్యాలుగానే రూపొందాయి.

### స్వర్గ సదృశ్యమైన స్వేచ్ఛా ప్రపంచం

ఎక్కడైతే మానవ మేధస్సు నిర్భయంగా సంచరించగలదో
ఎక్కడైతే మనిషి నిస్సంకోచంగా తలపైకెత్తి నడవగలడో
ఎక్కడైతే జ్ఞానం సంకలితమై వుంటుందో
ఎక్కడైతే ప్రపంచం సంకుచితమైన జాతి మతాల సరిహద్దులచేత

తునాతునకలుగావింపబడదొ,
ఎక్కడైతే సత్యం యొక్క అంతరంతరాలలోనుంచి పదాలు ఉద్భవిస్తాయో
ఎక్కడైతే అనాశ్రాంతమైన పరిశ్రమ పరిపూర్ణత్వాన్ని సాధించడం కోసం
చేతులు సాచి ముందుకు సాగుతుందో,
ఎక్కడైతే నిర్మలమైన హేతువనే కాసారం అలవాట్లు అనే
ఎడారి ఇసుకలో ఇంకిపోకుండా వుంటుందో
ఎక్కడైతే మేధస్సు ఆద్యంతాలులేని సువిశాలమైన
వాక్కు, క్రియా శుద్ధి గల సుందర ప్రపంచంలోకి
నీచేత నడిపింపబడుతుందో
అల్లాంటి స్వర్గ సదృశ్యమైన
ప్రపంచంలో మేల్కొనేటట్లు, నా తండ్రీ, నాదేశాన్ని నడిపించు!

(గీతాంజలి నుంచి)

నీముఖాన్ని చూసానని నాకనిపించింది అందుకే
చీకటిలో నేను నా పడవని ముందుకు నడిపించాను.
ఇప్పుడు ఉదయం నవ్వులతో ప్రత్యక్షమయింది
వసంతపుష్పాలు విరగబూసాయి.
అయితే, వెలుతురు పోయి, పువ్వులు వాడి పోయినా
నా పడవతో నేను ముందుకే సాగుతాను.

నువ్వునాకు మూగగా సైగచేసినప్పుడు ప్రపంచం
నిద్రపోతోంది, చీకటి నగ్నంగా పరుచుకుంది.
ఇప్పుడు గంటలు అవిరామంగా గట్టిగా మ్రోగుతున్నాయి
నా పడవ బంగారం బరువుతో కుంగుతోది
అయితే గంటలు మ్రోగటమాగిపోయినా నా పడవ ఖాళీ అయినా
నేను ముందుకే సాగుతాను.

కొన్ని పడవలు వెళ్ళిపోయినాయి, కొన్ని తయారుగా లేవు.
కానీ నేను ఆలశ్యం చెయ్యను.
తెరచాపలు విచ్చుకున్నాయి,
పక్షులు కొన్ని ఇతర తీరాలనుంచి వచ్చివున్నాయి.

అయితే, తెరచాపలు దిగిపోయినా తీరంనుంచి వచ్చేసందేశాలు
అందకపోయినా నేను ముందుకే సాగుతాను

(ఉత్తర - క్రాసింగ్ నుంచి)

"అమ్మా, నేనెక్కడనుంచి వచ్చాను, నన్నెక్కడనుంచి తెచ్చావు"-
శిశువు తల్లిని ప్రశ్నిస్తుంది.
సగం కన్నీళ్ళతో, సగం నవ్వుతో తల్లి చెపుతుంది తన బిడ్డని గుండెలకి హత్తుకుంటూ-
"నువ్వు నాగుండెల్లో కోరిక రూపంలో దాగి వున్నావు, చిన్నారీ
నువ్వు నేను ఆడుకున్న బొమ్మల్లో, నా చిన్నతనపు బొమ్మలాటల్లో నిక్షిప్తమైవున్నావు.
నేను మట్టితో ప్రతి ఉదయం నా దేముడి బొమ్మలు చేసినప్పుడు
నిన్ను చేస్తూ, మారుస్తూ వచ్చాను
మా కులదేవతని పూజించినప్పుడే ఆయన రూపంలో నిలచివున్న
నిన్నూ ఆరాధించాను
నా ఆశలలోనూ, నా ప్రేమల్లోనూ,నా జీవితమంతటా,
నా తల్లి ప్రాణంలోనూ నువ్వు జీవించి వున్నావు.
ఎన్నో యుగాలుగా మేము పూజించిన అనంతమై, అజరామరమైన
శక్తివాడిలో నువ్వు నివశిస్తూ వచ్చావు.
నేను బాలికగా వున్నప్పుడు నా హృదయపు రేకలు వుచ్చుకుంటున్న
తరుణంలో నువ్వు పుష్పాల సుగంధమై అక్కడ వున్నావు.
నీ కోమల మృదుత్వం నాయవ్వన కరచరణాలలో వికసించింది
ఆకాశంలో సూర్యోదయానికి ముందు పరుచుకునే మెరుపులా!
సూర్యకాంతితో ఉదయించే స్వర్గపు మొట్టమొదటి చిన్నారి కిరణంలా
జీవితపు నదీధారతో ప్రవహించి వచ్చి నువ్వు నాహృదయంలోకి వాలావు,
నీ ముఖంలోకి చూస్తూవుంటే ఈ రహస్యం నాకు అర్థమవక తికమక పెట్టుంది
అందరికీ చెందవలసిన నువ్వు నాకే స్వంతమయ్యావు.
ఎక్కడ నిన్ను కోల్పోతానోనని నిన్ను గట్టిగా నాహృదయానికి హత్తుకుంటాను.
ప్రపంచపు ఖజానాని నాకే దక్కించి నాకోమల హస్తాల్లోపెట్టిన శక్తి ఎలాంటిదోకదా!

(క్రిశెంట్ మూన్ నుంచి)

1."ఓసాగరమా, నీలోచెలరేగే ఘోష ఏభాష?"
"నాభాష శాశ్వతమైన ప్రశ్ననుంచి ఉద్భవించింది."
"ఓకాశమా, నీ సమాధానపు భాష ఏది?"
భాష అనంతమైన నిశ్శబ్దంలోనుంచి ఉద్భవించింది"

2. ఈ ప్రపంచంలోకి అడుగుపెట్టే ప్రతిశిశువూ భగవంతుడు మానవజాతి పట్ల ఇంకా విసుగు చెందలేదు అనే సందేశాన్ని తీసుకుని వస్తాడు.

3. హృదయమా, సవ్వడి చెయ్యకు. ఈ పెద్ద వృక్షాలన్నీ ప్రార్థనలో వున్నాయి.

4. ఓ ప్రభూ, నువ్వుతప్పితే అన్నీ వున్నవాళ్ళు నువ్వుతప్ప ఏమీ లేని వాళ్ళని చూసి నవ్వుతారు.

5. ఓ పృథ్వీ నీ తీరానికి ఒక ఆగంతకునిగా వచ్చాను. నీ ఇంటిలో ఒక అతిథిగా నిలిచాను. ఒక స్నేహితుడిగా నీ గృహద్వారాన్ని వదిలి వెళతాను.

6. బిడియపడే భావాల్లారా, నన్ను చూసి భయపడకండి. నేనొక కవిని.

7. నీప్రేమలో నాకు పరిపూర్ణమైన విశ్వాసంవుంది ప్రభూ! ఇదే నా ఆఖరిమాట.

(ఇవన్నీ స్ట్రేబర్డ్ అనే వచన కవితాసంకలనంనుంచి. 1990 లో భావవిహంగాలు అనే పేరుతో నేను చేసిన అనువాదాన్ని విశాలాంధ్ర వారు ప్రచురించారు)

✡ ✡✡

*డా. శ్యామల కల్లూరి*

*మానవీయ సామాజిక శాస్త్ర విభాగం, ఐ.ఐ.టి న్యూఢిల్లీ*

# శ్రీఅరవిందులు (1872-1950)



భారతీయ సంస్కృతిలో, చరిత్రలో, స్వాతంత్ర సమరంలో, ఆధ్యాత్మిక పరంపరలో, భారతీయాంగ్ల సాహిత్యంలో నిజానికి ఆయన స్పృశించిన ప్రతి ప్రక్రియలో శ్రీ అరవిందులు ఒక ప్రత్యేకమైన తనదైన శైలినీ స్థాయినీ సాధించారు. బెంగాలీ కుటుంబంలో అరబిందో ఘోష్‌గా 1872లో ఆగష్టు 15 జన్మించిన వీరి తండ్రి శ్రీ క్రిష్ణధన్ ఘోష్ సివిల్, సర్జన్ అయితే, తల్లి స్వర్ణలతా దేవి గృహిణి. అరవిందుని ఏడవ ఏట అతని సోదరునితో సహా తండ్రి ఇద్దరినీ ఇంగ్లాండు పై చదువులకోసం పంపించాడు. తర్వాత పదునాలుగేళ్ళు అంటే అతనికి ఇరవైఒకటవ సంవత్సరం వచ్చేదాకా అరవింద ఘోష్ ఇంగ్లాండులోనే విద్యాభ్యాసము చేసారు. అక్కడ ఇంగ్లీష్ కాక గ్రీకు, లాటిన్ లాంటి పురాతన భాషలో ప్రావీణ్యం సంపాదించారు. ఇంగ్లాండులోని సైంట్ పాల్స్ స్కూలులోను తర్వాత కింగ్స్ కాలేజీలోనూ స్కాలర్షిప్‌తో చదువుకుని సివిల్ సర్వీసెస్ పరిక్షలో రాంకులో పాస్ అయినప్పటికీ గుర్రపుస్వారికి వ్యతిరేకుడవడం వలన దానిలోకి వెళ్ళలేక పోయినారు. తన ఇరవై ఒకటవ ఏట పూర్తిగా ఒక అపరిచితుడులా 1893 లో భారతీయ గడ్డపై అడుగు పెట్టారు. బరోడా మహారాజుగారి సర్వీస్‌లో రెవెన్యూ డిపార్టుమెంటులోనూ తర్వాత మహరాజావారి కాలేజీలో అధ్యాపకుడుగా జేరారు. కొన్నాళ్ళు వైస్ ప్రిన్సిపాలుగా, ఇంగ్లీషు ప్రొఫెసర్‌గా పనిచేసారు. అక్కడ వున్నప్పుడే బెంగాలీ, గుజరాతీ, సంస్కృతం మరాఠీలాంటి భారతీయభాషలని ఎన్నిటినో అభ్యసించారు. 1905 లో జరిగిన మొదటి బెంగాలు విభజన రాజకీయాలవైపు నడిపించింది. బరోడా సర్వీసు వదిలి కలకత్తా నేషనల్ కాలేజీ ప్రిన్సిపాలుగా జేరడానికి అక్కడకి వెళ్ళారు. 1910 దాకా రాజకీయాలలో చురుకుగా పాలుగొన్నారు. ఆలీపూర్ బాంబు కేసులో బ్రిటీషు ప్రభుత్వం వీరిని ముద్దాయిగా కోర్ట్‌లో నిలబెట్టింది. దీనిని నడిపించిన జడ్జి ఇంగ్లాండులో అరవిందుని సహాధ్యాయి. ముద్దాయి అడుగుపెట్టగానే లేచినుంచుని తన గౌరవభావాన్ని ప్రకటించేవాడని కథలు ప్రచారంలో వున్నాయి. అప్పటి ప్రముఖ జాతీయవాది వకీలు అయిన చిత్తరంజనదాస్ అరవిందుని పక్షపు వకీలు. "ఈసంవాదం నిశ్శబ్దంలో అణగిపోయిన తర్వాత, ఈ ఆందోళన చరిత్రపుటల వెనక్కి వెళ్ళినతర్వాత, ఈ వ్యక్తి మరణించి ధూళిలో కలిసిన తర్వాత ఈతనిని దేశభక్తిగల వ్యక్తిగా, జాతీయవాదపు ప్రవక్తగా, సమస్త మానవాళిని ప్రేమించిన మహనీయుడుగా చరిత్ర గుర్తుపెట్టుకుంటుంది. ఇతను మరణించి ధూళిలో కలిసిన తర్వాత ఈతని వాక్కులు దేశ విదేశాలలో మానవాళి తల్చుకుని గర్వపడుతుంది" అంటూ చిత్తరంజనదాస్ చేసిన కోర్టు ప్రసంగం చిరస్థాయిగా నిలచిపోయిందంటే అది అరవింద ఘోష్ శ్రీ అరవిందులుగా మారతారని మనకి అందిన మొదటి సంకేతం అని అనుకోవచ్చును. ఇతనిని కోర్టు

విడుదలచేసింది అయినా కొంతకాలం జైలు శిక్ష తప్పలేదు. జైలులో వున్నప్పుడు తనకి నారాయణ దర్శనం అయిందని అరవిందులు స్వయంగా చెప్పుకున్నారు. ఈ అలౌకిక అనుభవం గురించి ఉత్తరపారాలో ఇచ్చిన ప్రసంగంలో ప్రస్తావించారు.అక్కడి నుంచి రాజకీయ జీవితంనుంచి సన్యాసం పుచ్చుకుని లౌకిక జీవితాన్ని పరిత్యజించి 1910 లో చందర్ నాగోర్ వెళ్ళి అక్కడినుంచి అప్పటి ఫ్రెంచి కాలనీ అయిన పుదుచ్చేరి చేరుకున్నారు. అక్కడ వీరు ఆశ్రమం నెలకొల్పి తక్కిన జీవితాన్నంతా అక్కడే గడిపారు. ఆశ్రమం ఉన్నచోట ఒకప్పుడు అగస్త్యమహర్షి నివశించే వారని స్థానికుల నమ్మకం. తన జన్మదినమైన ఆగష్టు పదిహేనున తప్ప తన గదిని విడిచి రాలేదు. తక్కిన జీవితాన్నంతా ధ్యానంలో ఆధ్యాత్మిక చింతనలో గడిపారు. ఈ నలభై సంవత్సరాలలో తమ జీవనంలో తాను పొందిన ప్రతి ఆధ్యాత్మిక అనుభవాన్నీ శ్రీ అరవిందులు తన రచనలలో పొందుపరిచారు. నలభై సంవత్సరాల నిశ్శబ్దం, ధ్యానం వారి కొసగిన అపూర్వ ఆలోచనలన్నిటినీ అరవిందులు వారి శిష్యులు తర్వాత తరాలకోసం క్రోడీకరించారు.

శ్రీఅరవిందుల రచనల కొస్తే వారి బరోడా రోజులలోనే రచనావ్యాసంగం మొదలయింది. వందేమాతరం, స్టాండర్డ్ బేరర్, ఆర్య, ప్రవర్తాః కర్మయోగిన్ వంటి ఎన్నో పత్రికలు తానే నడిపి తన రాజకీయ, ఆధ్యాత్మిక సాంస్కృతిక భావనలనన్నిటినీ ప్రజలముందు పెట్టడం మొదలుపెట్టారు. వందేమాతరం రోజుల్లో శ్రీఅరవిందుల రాజకీయ జీవితాన్ని భారత స్వాంతంత్రోద్యమాన్ని, ముఖ్యంగా ఆ రోజుల్లో జరిగిన బెంగాలు విభజనకి వ్యతిరేకంగా శ్రీ అరవిందులు వారి అనుయాయులు సృష్టించిన రహస్యోద్యమాలు దానిపై అరవిందుల రచనలు అన్నీ ఆర్యలోను వందేమాతరం లోను ప్రచురింపబడ్డాయి. వీరి రచనలపైనా, పత్రికలపైనా ప్రభుత్వ నిఘా తర్వాత నిషేధం విధించబడ్డాయి. అరవిందులు రాజకీయ జీవితంలోకి అడుగుపెట్టిన తర్వాత చాలామట్టుకు ఆలీపూర్ జైలులోనే గడిపారు. పాండిచ్చేరి వెళ్ళేక అక్కడ వారి సాహిత్య ఆధ్యాత్మిక రచనలన్నిటికీ పునాది పడింది. నిజానికి శ్రీ అరవిందుల సాహిత్యం వేదాంతంకంటే వేరు కాదు. సంవత్సరాల తపస్సుతో తాను సాధించిన జ్ఞానాన్ని సాహిత్య రూపంగా వేదాంత గ్రంధాల రూపంగా శ్రీ అరవిందుల రచనలు మన ముందు దర్శనమిస్తాయి. శ్రీ అరవిందుల రచనలను సాహిత్యమైనా వేదాంతమైనా మౌలికంగా అర్థం చేసుకోవాలంటే వారి సమగ్ర యోగ సిద్ధాంతాలని అర్థంచేసుకోవటం అవసరం. దీనిని శ్రీఅరవిందులు ఇంటెగ్రల్ యోగా అని ఒక సమగ్రమైన వేదాంతిక ఆధ్యాత్మిక సిద్ధాంతంగా తీర్చిదిద్దారు.

దీనిని గురించి తెలుసుకునే ముందు శ్రీ అరవిందుల వ్యక్తిగత నమ్మకాలు వారి సహజసిద్ధమైన ప్రతిభ దానిని ప్రపంచ ప్రయోజనంకోసం తీర్చిదిద్దాలనుకుని వారు చేసిన ప్రయత్నాల గురించి కొంత తెలుసుకోవాలి. భారతదేశానికి తిరిగివచ్చిన తర్వాత శ్రీ అరవిందులు భారతీయభాషలను అధ్యయనం చేయడంతో పాటు భారతీయ ఆధ్యాత్మిక పరంపరని అర్థంచేసుకోడానికి అనన్య సామాన్యమైన కృషి చేసారు. వేదాలు, ఉపనిషత్తులు వేదాంతసారం అన్నిటినీ అర్థం చేసుకోవడంతో పాటు ప్రబంధ సాహిత్యాన్ని సంస్కృత కావ్యసారాన్ని వంటపట్టించుకున్నారు. భారతీయ ఆధ్యాత్మిక సంపదని పశ్చిమ దేశాలకి అర్థమయ్యేలా రాయాలని తపన పడ్డారు. ఆ రోజుల్లో భారతదేశపు పురాతన సంస్కృతిని గురించి తెలియని భారతీయులెందరో వుండేవారు. పాశ్చత్యదేశాల నాగరికతలోనే తమకీ తమజాతికీ విముక్తి వుందని నమ్మిన వారిలో ప్రముఖుడు స్వయంగా అరవిందుల తండ్రిగారే. అయితే తాను నేర్చుకున్న పాశ్చాత్య నాగరికత భాషల సహాయంతోనే భారతీయ సంస్కృతిని విదేశాలకి అందించడంతో పాటు దానిని గురించి తెలియని భారతీయులకి కూడా ఈ ఆధ్యాత్మిక తత్వాన్ని పునఃపరిచయంచేయటానికి ప్రయత్నంచేసారు. ఒక అరుదైన హేతుబద్ధమైన భావజాలం వీరి రచనల్లో కనిపిస్తుంది. ఒక క్రాంతికారుడుగా బ్రతికిన ఈ మేధావి చిన్నతనంనుంచి ప్రతి విషయాన్ని ఆలోచనాత్మకంగా విశ్లేషించటం అలవరుచుకున్నారు. చేపట్టిన ప్రతిదానిలో ఒక వున్నతస్థాయికి చేరుకోవాలనే దృక్పథం కూడా అలవడింది. విద్యార్థిగా ఎప్పుడూ మొదటి రాంక్‌లోనే వున్నారు. వివిధభాషలని సునాయాసంగా నేర్చుకున్నారు. ఐ. సి యస్ లో ప్రప్రథముడుగా పాస్ అయినారు. గుర్రపుస్వారి

నచ్చక తానే దానిని వదులుకున్నారు. అధ్యాపక వృత్తిలో మంచి టీచరుగా పేరు తెచ్చుకున్నారు. రాజకీయాలలో ప్రవేశించి తీవ్రవాదిగా జైలుకి వెళ్ళారు. అన్నీ వదులుకుని ఆశ్రమవాసంలో ప్రవేశించినప్పుడు పురాతన ఋషి సాంప్రదాయ పద్ధతిలో ఋషిగా, దార్శనికునిగా ఇరవై శతాబ్దంలో తనని మించిన వారు లేరనిపించుకున్నారు. ప్రాక్పశ్చిమదేశాల మధ్య తన జ్ఞాన పటిమతో వంతెనలు నిర్మించిన కవి, దార్శనికుడు. స్వాతంత్ర సమరయోధుడు నైతిక సిద్ధాంతాలు ప్రాతిపదికగా భారత స్వాతంత్ర సమరాన్ని నడిపిన అహింసా మూర్తి కర్మ యోగి అయిన మహాత్ముడెలాగ ఆదర్శప్రాయుడో, భారత ఆధ్యాత్మిక సంపదని చికాగో కాంగ్రెస్ ఆఫ్ రెలిజన్‌లో విజయవంతంగా - ఆవిష్కరించిన వివేకానందుడు ఎలాంటి భక్తియోగి అయిన మహర్షియో శ్రీ అరవిందులు అదే ఆధ్యాత్మిక తత్వాన్ని పాశ్చాత్యులకి, భారతీయులకి తన జీవితకాలపు ఆధ్యాత్మిక అనుభవాలన్నిటినీ జోడించి జాతికి ఇచ్చిన జ్ఞానయోగి.

వీరి యోగాన్ని అర్థం చేసుకోవడానికి ఒక మూల సిద్ధాంతం వారి ప్రాచ్య పాశ్చాత్య నాగరికతలపై గల పట్టు అని మొదట తెలుసుకొవాలి. చార్లెస్ డార్విన్ ప్రతిపాదించిన జీవపరిణామ సిద్ధాంతం మనకందరికీ తెలిసిందే! అమీబా అనే ఏకకణ జీవితో మొదలైన పరిణామ క్రమం మనిషిదాకా ఎల్లా పయనించిందో అందులో ప్రస్తావించబడింది. అక్కడనుంచీ మొదలవుతుంది అరవిందుల సిద్ధాంతక్రమం. వీరి ఆలోచన ప్రకారం సృష్టిక్రమం అంతటితో ఆగిపోదు. పరిణామక్రమం అంతర్గతంగా విస్తరించి మనిషి ఆధ్యాత్మికంగా ఎదుగుతాడు. జీవపరిణామ సిద్ధాంతంలో మనిషి ఆఖరిమెట్టు అయితే శ్రీ అరవిందులు ముందుకు వెళ్ళి మనిషి లోపలి ప్రపంచం విస్తరించి నైతికంగా ఆధ్యాత్మికంగా ముందుకు వెళతాడని ప్రతిపాదిస్తారు. దీనికి వుదాహరణగా మనిషి జీవపరిణామక్రమంలో పూర్తి జ్ఞానంతో అంతశ్చేతనతో ఈ పరిణామాన్ని విస్తరించటానికి సహకరించటమేనని చెపుతారు. మొదటిసారిగా మానవచేతన ఈక్రమ వికాసానికి సహకరించిందని వీరి సిద్ధాంతం. అప్పటివరకూ వున్న జీవరాశులన్నీ వాటి ప్రమేయంలేకుండానే పరిణామక్రమంలో భాగంగా వున్నాయి. ఈ ఆధ్యాత్మిక పరిణామ సిద్ధాంతాన్ని దృష్టిలో పెట్టుకునే వారి రచనలన్ని కొనసాగుతాయి. మనిషి ఎన్నోవిధాలుగా దైవసన్నిధిని చేరుకోడానికి సృష్ట్యాదిగా ప్రయత్నం చేస్తూనే వున్నాడనీ ఈ ప్రయత్న ఫలితమే మానవ నాగరికతా వికాసమని వీరి నమ్మిక. వేదాంత, మత, సామాజిక, మానసిక వైజ్ఞానికశాస్త్ర వికాసాలన్నీ ఈ అన్వేషణ ఫలితంగానే మననాగరికతలో భాగంగా విలసిల్లి మానవచైతన్యాన్ని పెంపొందించాయని వీరి విశ్వాసం. మానవ ప్రయత్నాలన్నీ వాని సాధనా పటిమ మీద ఆధారపడివుంటాయని ఈసాధన ఒక తపస్సులా మనిషి చెయ్యగలిగిననాడు దైవం తరపు నుంచి సహాయమందుతుందనీ వీరు చెపుతారు. ఇదే వేదాంతపరంగానూ సాహిత్యపరంగానూ కూడా చెపుతారు.

ఊర్వశి, అహనతో మొదలై వీరు రాసిన రచనలన్నిటిలోనూ ఈ మానవారోహణ దైవాధిరోహణ సిద్ధాంతం కనిపిస్తుంది. ఈ వాక్చిత్రాల ప్రతీకలు అన్నీ సావిత్రి అనే బృహత్కావ్యంలో పరిపూర్ణమైన యోగ సిద్ధిలా ప్రత్యక్షమవుతాయి. అదే సావిత్రి వేదాంతపరంగా లైఫ్ డివైన్ గా రూపొందింది. వారిరచనలన్నీ పునర్ముద్రితాలై పాండిచేరి ఆశ్రమం వారి సహృదయ సహకారాలతో వారి జన్మశతాబ్ది సందర్భంగా జాతికి పునరంకితం చెయ్యబడ్డాయి. ఎస్సెన్షియల్ యూనిటీ ఆఫ్ ఆల్ రెలిజన్స్, ఫౌండేషన్స్ ఆఫ్ యోగా, ఫ్యూచర్ పొయ్‌ట్రీ, లైట్స్ ఆన్ వేదాస్, లైట్స్ ఆన్ ఉపనిషత్స్, ఆన్ వ్యాస, వాల్మీకి, కాళిదాసలాంటి ఎన్నో రచనలు చేశారు. వారు ఉచ్చరించిన ప్రతి ఆలోచన అక్షరబద్ధం చెయ్యబడింది వారి శిష్యబృదం సహకారంతో. తనజన్మదినం రోజున భారత దేశం స్వాతంత్రదేశమవటం తనసిద్ధాంతాలకొక గొప్ప ఉత్ప్రేరకమైన విషయం అని అరవిందులు స్వాతంత్రానంతరం ఆల్ ఇండియా రేడియో కార్యకర్తతో ప్రసంగిస్తూ ఒక సందేశాన్నిచ్చారు. 1950 లో డిశంబరు 5 న వీరు మహాసమాధిని పొందారు. అయిదు రోజులపాటు వీరి పార్థివశరీరం క్షీణించలేదని చెపుతారు. 1914 ప్రాంతాలలో వీరిని మొదటిసారి దర్శించటానికి వచ్చిన ఫ్రెంచి వనిత మీరా రిచర్డ్స్ 1920లో వీరి ఆశ్రమంలో శాశ్వత ప్రాతిపదికమీద వచ్చి ఇక్కడే వుండి పోయినారు. ఈమె శ్రీ అరవిందుల ఆధ్యాత్మిక సహాధ్యాయిగా వుంటూ మాతృమూర్తిగా వీరి అనుయాయులందరిచేత గుర్తింపబడి 1973 దాకా ఆశ్రమవ్యవహారాలనన్నిటినీ సరిచూసుకున్నారు

మిస్టిక్ పొయ్‌ట్రీ గురించి చెపుతూ శ్రీ అరవిందులు ఒకచోట ఇలా అంటారు. మిస్టిక్ పోయం అనేది అలౌకిక ప్రపంచానికి చెందిన అనుభవానికి చెందినది. ఇందులో ప్రతిపదమూ విశ్లేషణచేసి అర్థం చేసుకోటానికి ప్రయత్నిస్తే పెద్ద ప్రయోజనం వుండదు. ఈ అనుభవసారం చదువరుల్ని కవి దర్శించిన అలౌకిక సౌందర్యపు సరిహద్దులదాకా తీసుకెళుతుంది. రంగులద్వారానో ప్రతీకలద్వారానో ఈ అనుభవం మనకి అందించబడుతుంది.

**ఇక కొన్ని పద్యాలకి స్వేచ్ఛానువాదం:**

**ఎవరు కవితలో**

ఆకాశపు నీలిమలో, అడవుల పచ్చదనంలో
అందాల మెరుపులని చిత్రిస్తూ ఎవరిదీ చెయ్యి?
ప్రాణవాయువుల అంతఃగర్భాన గాలులు పెనునిద్దురలో వున్నప్పుడు
వాటిని మేల్కొలిపి ఉద్ధృత గాలితరంగాలను రేకెత్తించినదెవరు?

అతను హృదయంతరాళాల లోతులలో ప్రకృతిలోయల్లోపల మాటుమణిగినా
మానవమేధస్సులో తాను నిర్మించే ఆలోచనలలో ప్రత్యక్షమవుతాడు.
పరిమళించే పుష్పాల వికాసక్రమంలో మిళితమవుతాడు.
మెరిసేతారలువిరిసిన వలలకాంతులలో చిక్కుకుపోతాడు.

మానవుడి ధారుఢ్యంలోనూ, స్త్రీ  సౌందర్యంలోనూ అతడే!
బాలుని నవ్వుల్లో, బాలిక నునుసిగ్గులలో అతనే!
బృహస్పతిని రోదసిలో గిరికీలు కొట్టించిన చెయ్యి గడుపుతుంది అతి చాతుర్యంతో
అందమైన యువతి కేశాలలో ఒక్క ఉంగరాన్ని తీర్చిదిద్దటానికి సంవత్సరాలు!

ఇవన్నీ అతని లీలలు, మేలిముసుగులు, నీడలు
మరి అతనెక్కడ? ఏ పేరుతో అతన్ని మనమెరుగుదుము?
బ్రహ్మా, విష్ణువా; ప్రకృతియా, పురుషుడా?
సగుణుడా, నిర్గుణుడా? ఒంటరివాడా జంట శక్త్యా?

అతను సకల ప్రపంచానికీ తన లీలగురించీ తన చతురత గురించీ చెపుతాడు.
అతనికి బాధలోని ఆనందం, అతి భావుకత్వంలోని బాధ తెలుసు.
మనబాధల్లో అతనికి ఆనందం, మనల్ని ఏడ్చే స్థితికి తీసుకొస్తాడు.
అప్పుడు మళ్ళీ తనే సుఖసంతోషాల ఎరతో ఆకర్షించి దగ్గరికి చేర్చుకుంటాడు.

సంగీతనాదమంతా అతని నవ్వులనినాదమే!
సౌందర్యసారమంతా అతని బ్రహ్మానంద స్వరూపమే!
మనజీవితాలు అతని గుండె చప్పుళ్ళు, మన సంతోషం
రాధామాధవకేళీ విలాసం, మన ప్రేమవారి చుంబనమాధుర్యం!

అతని బలం అత్యంత పైస్థాయిలో మ్రోగించే బాకా
తనరథంలో అతను వెళుతూ వుంటాడు, తన బల్లెంతో గాయపరుస్తూ
సునాయాసంగా సంహరించగలడు, అత్యంత దయతో ఆదరించనూగలడు.
ప్రపంచం కోసం ఆద్యంతం పోరాడుతాడు.

కొట్టుకుపోయే ప్రపంచాల తీవ్రతలో, యుగాల సముద్దీపనంలో
అచలంగా, ధైర్యంగా, ధీమాగా, స్పటిక స్వచ్ఛంగా
మేధావుల ఆలోచనల చిట్టచివరి శిఖరాగ్రాన పైన, దానికింకావెనుక
అతను తన సింహాసనం మీద శాశ్వతంగా నిలచి వుంటాడు.

మానవజాతికి యజమాని, అతని అజరామర ప్రేమికుడు
మనకి చూడగలిగేకళ్ళుండాలేగానీ, మన హృదయాలకెంతో ఆప్తుడు
అయితే అహంతో అంధులమైనవాళ్ళం, ప్రేమలనే మోహజాలంలో చిక్కుకున్నవాళ్ళం,
మన ఆలోచనలచే బంధింపబడినవాళ్ళం, అదే స్వేచ్ఛ అని నమ్మినవాళ్ళం.

సూర్యునిలో నిక్షిప్తమైన జరా మృతి లేని శక్తి అతడే!
అతని ఛాయ అర్థరాత్రి అంధకారం దాక వ్యాపిస్తుంది.
అంధకారపు అంధత్వంలో, అంధకారంచే పరివేష్టితుడై
అతను అధివసించి వుంటాడు, విశ్వవ్యాప్తుడై, ఒంటరివాడై!

<u>అధివాస్తవిక శాస్త్రం యొక్క స్వప్నం</u>

ఒకడు కలగని ఒక గ్రంధి హామ్లెట్ రాయడం చూశాడు.
సముద్ర కన్య ద్వారా అమృతాన్ని సేవించి అమరుడైన ఇంకొకడి
హార్మోనులు ఏజియన్ సముద్రపు ఒడ్డున కూర్చుని
ఇలియడ్, ఒడిస్సీ సృష్టించాయి!

ఒక థైరాయిడ్ గ్రంధి దాదాపు నగ్నంగా తపస్సు చేసి
భోధి వృక్షపు నీడలోకూర్చుని జ్ఞానకాంతిని పొందింది.
ఒంటరి ధ్యానంనుంచి కళ్ళుతెరిచి చక్రంగురించి
అష్టవిధ ముక్తి మార్గాలగురించి మానవాళికి బోధించింది.

ఇంకొక మేధావి, జీర్ణశక్తిక్షీణించి చేసిన ప్రకోపంతో,
యూరోపునంతటిని గడగడలాడించి, జయించి, పాలించి పతనుడైనాడు.
సెయింట్ హెలీనానుంచి స్వర్గానికి వెళ్ళివుంటాడు, బహుశా!
ఈ అధివాస్తవిక ప్రపంచం ఇలా నడుస్తూ వుండగా

ఒక శాస్త్రవేత్త అణుసముదాయంతో ఆడుకుంటూ
భగవంతుడు అరిచి హెచ్చరించేలోపు సమస్త విశ్వాన్ని ధ్వసం చేసేశాడు!

## పులి - లేడి

ఈ పచ్చని అడవుల మధ్య అడుగులో అడుగువేస్తూ నెమ్మదిగా వంగి క్రుంగి నడుస్తూ
అత్యద్భుతమైన అందం, ధీమాగా మెరిసేకళ్ళు, ఉబికే ధీటైనవక్షం శబ్దంలేని అడుగులతో
చేరువయ్యే అతి సుందరమైన హంతకుడు ఎవరు వీడు?

భయపడినాయో అన్నట్లు పవనతరంగాలు కూడా సడిలేకుండా ఆకులసందులనుంచి తప్పుకుంటున్నాయి. తమ కదలిక ఈ నిర్దయాశీలమైన సౌందర్యాన్ని చెదరగొట్టకూడదని కాబోలు వూపిరిని కూడా నిలవరించాయి.

కాని గొప్ప అడవి సౌందర్యం వంగి వంగి అడుగులు వేస్తూ నిశ్శబ్దంగా ఆఖరిసారి ముందుకు అడుగువేసింది.

చివరిగా మృత్యువు ఒక్క గెంతులో అక్కడే అడవి సెలయేటిలో చల్లని నీళ్ళని త్రాగుతున్న చేరువవుతున్న మృత్యువుగురించి ఏమాత్రం తెలియని అమాయిక లేడికూన మీదికి దూకింది.

లేడి కుప్పకూలింది చీలిన శరీరంతో, మృత్యువు కౌగిట్లో వున్న దాని మనస్సునిండా అడవుల మధ్య తను వదిలివచ్చిన సఖున్ని తలపే

నోరులేని మెత్తని ఆ జీవి అడవిలోని క్రూర సౌందర్యానికి అల్లా బలి అయిపోయింది ప్రకృతిన్యాయానికి బద్దమై

కాని మానవ చరిత్రలో ఏదోఒకరోజు అడుగులో అడుగువేస్తూ ఆసియా దేశపు ప్రమాదకర అడవులలో లేళ్ళని చంపే పులులు అంతర్ధానమయ్యే రోజు వస్తుంది.

ఈ క్రూర జంతువులు ఆసియా ఖండాన్నిక భయపెట్టలేవు. అందమైన లేళ్ళూ హాయిగా సెలయేళ్ళలో నీళ్ళు తాగగలవు.

బలవంతులు వారి బలంతోనే హతమవుతారు. హతులు హంతకుల్ని జయించి జీవిస్తారు.

(ఈనాడు ఆసియా ఖండంలో అంతర్థానమైన పులుల గురించి ఆలోచిస్తే ఈ ఋషి వాక్కు నిజమైందని అనిపిస్తుంది. అయితే శ్రీఅరవిందులు రాజకీయంగా ఆసియాఖండాన్ని అణగద్రొక్కిన విదేశీ నాగరికతలమీద చేసిన వాఖ్య ఇది అప్పటి సందర్భంలో).

✡ ✡✡

*డా.శ్యామల కల్లూరి*

*మానవీయ సామాజిక శాస్త్ర విభాగం, ఐ.ఐ.టి న్యూఢిల్లీ*

# సరోజినీ నాయుడు

(1879-1949)

**భారతీయాంగ్లకవులలో** చెప్పుకోదగ్గ కవయిత్రులలో మొదట చెప్పవలసిన పేరు సరోజినీ నాయుడిదని సర్వథా అంగీకరింపబడిన విషయం. అయితే స్కూళ్ళలో, కాలేజీలలో విశ్వవిద్యాలయాలలో, క్లాసు రూములలో సరోజిని నాయుడు ఎవరు అని ఎవర్నైనా ప్రశ్నిస్తే ఈ తరం వాళ్ళిచ్చే సమాధానం ఆమె 1857 తర్వాత స్వాతంత్ర సమరంలో పాల్గొన్న మొదటితరం యువతి అనీ, మహాత్మాగాంధీని మొదటిసారి 'మహాత్మా' అని సంభోదించటంతో పాటు ఆయనని మిక్కీ మౌస్ అనిపిలవగలిగిన అనుయాయి అనీ, గాంధీగారి దర్బారులో తాను నవ్వుతూ నలుగురినీ నవ్విస్తూ వెలిగిన హాస్యప్రియ అనీ, స్వయంగా తన వాగ్ధాటితో తనకు తాను ఒక స్థానాన్ని సంపాదించుకున్న పేరెన్నికగన్న వక్త అనీ, స్వతంత్ర భారతంలో గవర్నరుగా నియుక్తురాలైన మొట్టమొదటి వనిత అనీ ఎందుకు ఆమె చిరస్మరణీయురాలో చెప్పటానికి ఎన్ని చారిత్రక విషయాలున్నాయో అన్నిటినీ ఏకరువు పెడతారు. ఝాన్సీలక్ష్మీబాయిని మినహాయిస్తే ఈమెకు ముందు భారత స్వాతంత్ర సమరంలో స్త్రీల సంఖ్య దాదాపు లేదనే చెప్పాలి. ఈ తరం వారికి ఆమె భారతకోకిల అని బిరుదాంకితురాలని తెలుసు కాని ఈ బిరుదు ఎందుకు ఆమెకి శోభనిస్తుందో తెలియదు. అందుకే చరిత్ర పుస్తకాలలోంచి ఈమెని వెలికి తీసి సాహిత్యప్రపంచంలో కూడా ఆమెదైన స్థానాన్ని ఆమెకి ఇచ్చి గౌరవించవలసిన బాధ్యతకొక రూపకల్పన చెయ్యటానికి ఈ చిన్నప్రయత్నం.



1879లో ఫిబ్రవరి 13 ఈమె జననం నాటి నైజాం ప్రభుత్వ పాలనలో వున్న హైదరాబాదులో జరిగింది. తండ్రి శ్రీ అఘోరనాథ్ చటోపాధ్యాయ నైజాంగారి దర్బారులో దివానుగా వుండే వారు. స్వయంగా శాస్త్రవేత్త, పండితుడు, స్థాపకుడు అనేవారు. అప్పటి రోజులలో నైజాం కాలేజి వ్యవస్థాపకులు మొదటి ప్రిన్సిపాలు కూడా. తల్లి వరదసుందరీ దేవి కవయిత్రి. వీరు హైదరాబాదులో స్థిరపడిన బెంగాలీ కుటుంబీకులు. సరోజిని జన్మతః ప్రతిభా సంపన్నురాలు. తన పన్నెండవయేట మెట్రిక్యులేషన్ పరిక్షకి కట్టి ప్రతిభతో పాస్ అయింది. ఇంట్లో ట్యూషన్ చెప్పటానికి వచ్చిన లెక్కల టీచర్ ఇచ్చిన లెక్కతో విసుగెత్తి విరామంకోసం లేడి ఆఫ్ ది లేక్ అనే పదమూడు వందలలైన్ల పద్యంరాసి కవితావ్యాసంగాన్ని మొదలుపెట్టిందని అంటారు. అల్లా మొదలయిన సాహిత్య ప్రయాణంలో వెనుదిరిగి చూడలేదు. తండ్రితో కలిసి మెహెర్ మునీర్ అనే పద్యనాటకాన్ని పర్షియన్ భాషలో రచించింది. ఆ కవితలని చూసి ముగ్ధుడైన తండ్రి దానిని నైజాం కోర్టులో చూపిస్తే, నైజాం -

ఆమెకు విదేశాలలో చదవడానికి స్కాలర్షిప్ ఇచ్చారు. ఉర్దూ, తెలుగు, బెంగాలీ, పర్షియన్, ఆంగ్ల భాషలలో ప్రావీణ్యం వున్న కవయిత్రి. దాదాపు పదహారేళ్ళ చిన్న వయస్సులో సరోజిని హైదరాబాదు వాస్తవ్యుడైన డాక్టర్ గోవిందరాజులు నాయిడిగారితో ప్రేమలో పడింది. ఆంధ్రా నాయుడైన ఈ యువకుడితో ఈమె సంపర్కం బెంగాలీ తల్లిదండ్రులకి జాతిపరంగా కూడా నచ్చలేదు. వయస్సులో కూడా చిన్నదైన ఈమెను మధ్యవయస్కుడైన డాక్టరుతో వివాహానికి తల్లిదండ్రులు వ్యతిరేకులవటంతో స్కాలర్షిప్ నెపంతో ఆమెని పై చదువులకి ఇంగ్లాండు పంపటం జరిగింది.

భారతదేశానికి తిరిగి వచ్చి ఏ గోవిందరాజులు నాయుడిని పెళ్ళాడటానికి తల్లిదండ్రులు వ్యతిరేకించి ఆమెని ఇంగ్లాండు పంపారో ఆ నాయుడిగారిని తన పందొమ్మిదో ఏట వివాహం చేసుకుంది. జయసూర్య, పద్మజ, రణధీర్, లీలామణి అని నలుగురు పిల్లలని కంది. అనారోగ్యంతో మంచమెక్కింది. పుంజుకుని గాంధీజీ అనుయాయిగా అతనితో అడుగులో అడుగు కలిపి స్వాతంత్ర సమరంలో పాలు పంచుకుంది. గాంధీగారితో పాటు ఉప్పు సత్యాగ్రహం, సహాయనిరాకరణ ఉద్యమాల్లో పాల్గొనటమేకాక ఇండిగో కార్మికుల కోసం నడిపిన పోరాటంలో ముందుండి పాలుపంచుకుంది. అంతేకాకుండా రోజుల్లో స్త్రీల హక్కులకోసం పోరాడిన వారిలో ఈమె ప్రముఖురాలు. భారత జాతీయ కాంగ్రెస్కి మొదటి మహిళా అధ్యక్షురాలు. గాంధీజీ తోనేకాక, జవహర్ లాల్ నెహ్రూ, మదన్ మోహన్ మాలవియా, గోపాలక్రిష్ణ గోఖలే వంటి ప్రముఖులెందరితోనో సన్నిహితంగా ఉండి ఎన్నోరకాలుగా భారత స్వాతంత్ర సమరంలో తిరుగులేని నాయకురాలుగా పేరుపొందింది. ఈసందర్భంగా అనేకసార్లు జైలు పాలయ్యింది. దాంతో ఆరోగ్యం మరింత దెబ్బతింది కూడా.

ఇక కవితావ్యాసంగానికొస్తే స్వాతంత్ర సమరంలో చేరిన తర్వాత తన కవితావ్యాసంగానికి స్వస్తి చెప్పింది. ఇంగ్లాండు దేశంలో కింగ్స్ కాలేజిలో విద్యనభ్యసించిన రోజులలోను తర్వాత స్వదేశానికి తిరిగి వచ్చిన క్రొత్త దినాలలోనూ అనేక విషయాలమీద కవితలల్లింది. ఈమె అదృష్టంకొద్దీ ఇంగ్లాండులో ఎడ్మండ్ గోస్, ఆర్థర్ సైమన్స్ వంటి కవితా దిగ్గజాలతో ఈమెకి పరిచయమైంది. వీరు సరోజిని కవితలని చదివి సంతోషించికూడా ఆమెకు జీవితాంతం పనికి వచ్చే కొన్ని సలహాలనిచ్చారు. సరోజిని తన కవిత్వంద్వారా ఆంగ్ల దేశపు పుష్పాలనీ పక్షులనీ గురించీ పాడడంకంటే తన స్వంత దేశపు పువ్వులని పక్షులనీ తదితర ప్రకృతినీ ప్రతిబింబించే కవితలు రాస్తే మంచిదని సలహాలనిచ్చారు. దాంతో సరోజిని భారతీయ దర్శనం మొదలయిందని చెప్పాలి. భారతదేశపు గాలి నీళ్ళూ, ప్రకృతి, దేశపు బజార్లు, వీధివ్యాపారస్తులు అన్నీ ఆమె కవితల్లో చోటుచేసుకోవటం మొదలెట్టాయి. బజార్స్ ఆఫ్ హైదరాబాద్, ది రాయల్ టూంబ్స్ ఆఫ్ గోల్కొండ లాంటి కవితలెన్నో నవాబు లేలిన హైదరాబాదు గురించి వ్రాసింది. క్వీన్స్ రైవల్ అనే ఒక కవిత ఎన్నో స్కూళ్ళలో పిల్లలు చదువుతూ వుంటారు. ఇది ఒక పెర్షియన్ రాణిని గురించిన కథ. తన రాజభోగాలతో విసుగెత్తిన రాణి ఎప్పుడు చూసినా తనను పరివేష్టించి వుండే భోగభాగ్యాలనుంచి మార్పుని కోరుకుంటూ తన అసంతృప్తిని రాజుకి తెలియజేస్తుంది, తనకొక ప్రతిద్వంది కావాలనే విచిత్రమైన కోరిక కోరుతుంది. రాజు రాత్రికి రాత్రి ఆమె కోరిక తీర్చటం కోసం ఏడుగురు రాజకుమార్తెలని దేశవిదేశాలనుంచి తెచ్చి ఆమె ముందు నిలబెడతాడు. వాళ్ళెవరూ ఆమె అందానికి సాటిరారు. అదే అసంతృప్తి, అదే అశాంతి ఆమె మనస్సులో. అప్పుడు ఉన్నట్టుండి ఆమె ఏడేళ్ళ కుమార్తె పరుగుపరుగున వచ్చి ఆమె చేతిలోని అద్దాన్ని లాక్కుని తన ముంగురులు సరిదిద్దుకుంటుంది. రాణి పకాలున నవ్వుతుంది. "నా ప్రతిద్వంది నాకు దొరికింది, ఇదిగో" అని రాజుకి చెప్పి ఆనందపడుతుంది. అల్లాగే కోరోమొండల్ ఫిషర్స్, బాంగిల్ సెల్లర్స్, ఇండియన్ వీవర్స్ లాంటి కవితలు భారత శ్రామికవర్గ సౌందర్యం గురించి వ్రాసింది. తన బాధలు, ప్రేమకోసం పరితపించటం, తన కష్టాలు, తన సుఖాల వల్ల తను పొందిన ఆధ్యాత్మిక ఆనందం, ఆత్మార్పణలోని ఔన్నత్యం, దానినుంచే ఉద్భవించిన అసంతృప్తులు, భగవంతుడిపట్ల భక్తి. ఏ మతాల సరిహద్దులచేత బంధింపబడని ఒకానొక విశ్వజనీనమైన ప్రేమ - ఇవన్నీ ఈమె కవిత్వంలో కనిపిస్తాయి. భారతీయాత్మని మనకి గోచరం చేస్తాయి. గోల్డెన్ థ్రెష్హోల్డ్, ఫెదర్ ఆఫ్ డాన్, బ్రోకెన్ వింగ్ అనే మూడు సంకలనాలు ఆమె జీవితకాలంలో ప్రచురింపబడినాయి. తర్వాత రచనల సంపూర్ణ సంకలనం వెలువడింది. ఆమె వ్రాసిన ఉత్తరాలు, చేసిన

ప్రసంగాలు అన్నీ పుస్తకాలుగా వెలువడ్డాయి. హైదరాబాదులో ఆమె నివసించిన స్వగృహం గోల్డెన్ థ్రెష్‌హోల్డ్‌లో నేడు హైదరాబాదు సెంట్రల్ యూనివర్సిటీ వారి పెర్‌ఫామింగ్ ఆర్ట్స్ విభాగం నడుస్తోంది. కొన్నేళ్ళక్రితం ఈ భవనాన్ని షాపుల సముదాయంగా మార్చి మాల్ క్రింద మార్చే ఉద్దేశ్యాన్ని పురప్రముఖుల వ్యతిరేకత కారణంగా విరమించుకుని యూనివర్సిటీ వారి క్రిందే వుంచేయటంతో ఈమె నివసించిన గృహం ఎప్పటికైనా హెరిటేజి భవనంగా మారవచ్చునన్న ఆశని కల్పిస్తున్నది.

*కొన్ని కవితలు తెలుగు అనువాదంలో:*

**అంతరాత్మ ప్రార్థన**

నేను గర్వంతో పలికాను
పసితనపు అహంకారంతో,
"నీ ఊపిరితో నన్ను మలచిన నాస్వామీ,
నీ జీవన్మరణాల రహస్యాలనన్నిటినీ నాకు వెల్లడించు!"
అంతూదరీ లేని దాహార్తిని,
నీ అనంతమైన దయార్ద్రహస్తాలతో
నాపాత్ర నింపు
కడు చేదైన, కడు తీయనైన అనుభవాలతో!
ఒక్క ఆనందాన్ని వదలకు,
ఒక్క దుఃఖలేశాన్ని మరువకు!
ఒక్క బహుమతినీ ఒక్క వేదననీ
దేనినీ కాదనకు.
సమస్త ప్రేమలూ జీవన్మరణాల రహస్య జ్ఞానం
అన్నీ నాస్వంతం చెయ్యి"

అప్పుడు దేముడు బదులు పలికాడు
నెమ్మదిగా, స్థిర కంఠంతో
"నీ ప్రార్థన విన్నాను, నీ పసి ఆత్మ
అనంత దుఃఖాల్ని, అంతులేని ఆనందాల్ని
అవశ్యం పొందుతుంది.
పరిశుద్ధమై నీ ఆత్మ అప్పుడు
నీ ఈ గుడ్డి ప్రార్థననుంచి విముక్తిని కోరుతుంది!
అలసిన అనుభవంతో పండిన నీ ఆత్మ

అప్పుడు గ్రహిస్తుంది నాశాంతి రహస్యాన్ని!

ఏడు ప్రపంచాల ఎత్తునుంచి అప్పుడు
ఇస్తాను నీకు నా అపార శాంతి సందేశాన్ని!
జీవితం నా వెలుతురుని ప్రసరించే స్పటికం
మృత్యువు నా ముఖంయొక్క ఛాయ!

<u>ఉత్తరాదినుంచి ఒక ప్రేమగీతం</u>

నీ ప్రేమగురించి నాకింక చెప్పకు, పపీహా!
ఉదయ సాయం సంధ్యల నక్షత్రకాంతులలో నాప్రక్కన నాప్రేమికుని
పదములసవ్వడి చేరువయినప్పుడు
నాగుండెలలో అదృశ్యమైన అనంద స్వప్నాలని
తిరిగి ఎందుకు గుర్తుకుతెస్తావు, పపీహా!
నదీతీరాలలో మబ్బులరెక్కలని చూస్తూవుంటాను
కాంతులీనే వర్షపుచినుకుల తళుకులలో మామిడాకుల
కంపనాన్ని గమనిస్తాను!
మైదానాలలో లేతకొమ్మలమీద పూసిన పువ్వులు చూస్తాను.
ఈ అందాలన్నీ నాకేమి మిగులుస్తాయి పపీహా!
పరిమళించే పుష్పాలు, పులకరించే వర్షపు చినుకులు
నా ప్రేమికుణ్ణి వెనక్కి తేలేవుగా, పపీహా!
నీ ప్రేమగురించి మరింత చెప్పు పపీహా!
నాగుండెలలో అంతర్థానమైన ప్రేమ, సంతోషం
వాటి తాలూకు వ్యధలు నీ పిలుపుతో మళ్ళీ మేల్కొలుపుతావా, పపీహా!

(పపీహా: అనే పక్షి మామిడిపళ్ళ ఋతువులలో పళ్ళు తిని "పీ కహాఁ, పీకహాఁ" - Where is my love?- అని అరుస్తూ వుంటుందని అది నా ప్రేమ ఎక్కడ అని అర్థం వస్తుందని కవయిత్రి కల్పన)

<u>విషాద మోహనమూర్తికి</u>

నీ కఠోర దేవాలయంలో నేనొక ఇష్టంలేకుండా చేరిన పూజారిణిని,
దయవిహీనిడివైన బాధల భగవానుడివి నువ్వు! నన్ను పట్టి
నీ పూజలకు అయిష్టంగా బద్ధురాలిని చేశావు
భరించలేని వేదనతో నిండిన నాహృదయం

అవిశ్రాంతమైన నా ఫాలం నీ సేవలో!
నీ సేవలో బహుకాలం గడిపాను, కఠినమైన వత్సరాల
సంవేదనతో నిండిన రోజులు, నిద్రావిహీనమైన రాత్రులు
భారంతో వ్యర్థంగా నీ పూజావిధులు నిర్వర్తిస్తూ!
చీకటినిండిన నీ గర్భగుడిలో, శమన కలిగించే మందులు, పాలు, అన్నం ఏమీ లేవు!
నా ఆత్మనే నువ్వు బలికోరావు
నాయవ్వనకోరికల మధువుల్ని గ్రోలావు
అణచివేయబడిన నాప్రాణశక్తి నుంచి వడికిన తైలం నీది!
నాపుష్పసమానమైన స్వప్నాలు, వజ్ర సమానమైన ఆశల అగ్ని
ఉదయించే ఉషః కాంతిలా పైకిలేస్తుంది!

నాదగ్గర నీ కివ్వటానికింకేమీ లేదు, నాకున్నదంతా
నీ గుడిలో నీకు నివాళిగా సమర్పితం
ఇంక నన్ను వెళ్ళనీ, నా ఆత్మని పూర్తిగా పిండి
నీకు సమర్పించిన ప్రార్థనాగీతాలు ఇవి.
నన్నిక వెళ్ళనీ, బలహీనమైన కరచరణాలతో
ప్రాకుకుంటూ ఏనీడనో చేరి, నిద్రలో మునుగుతాను.

*నిశ్శబ్ద ప్రేమ*

నా తనువు ఇవ్వగలిగిన సుఖాలు, నా ఆత్మ అనే నిధినీ
నా సర్వస్వాన్నీ నీకు సమర్పించాను కనుక,
నీవు నాకు ఋణగ్రస్తుడవైనావు కనుక
నా ప్రేమ తన వుదారతని మరచి నీ నుంచి
ఒక ప్రేమోపహారాన్ని బ్రతిమిలాడో, కోరికతోనో
హక్కుగానో నీ అయిష్ట హస్తాలనుంచి అడుగుతుంది.

నీ ఇష్టమొచ్చిన ఉపహారం ఇవ్వు... నీదనేదేమైనా నీ దగ్గరుంటే
అయితే నీ ఊపిరితోనే నాజీవితం నిలిచివుంది కనుక
నా జీవితంలో ప్రతిదినమూ అసంపూర్తిగా మిగిలిన నా ఆర్తికీ, కోరికలకీ
ఒక మండుతున్న చితిలాగా నాప్రేమ ఇప్పుడెల్లాగ
నీ జీవితాన్ని హృదయాన్నీ కోరి కోరి
ఈ విషాద జ్ఞాపకాల అసంతృప్తులతో నింపగలదు?

నా హృదయంలో దాహార్తి నిండిన పదాలన్నీ ఇప్పుడు పరితుష్టిపొందాయి!
నేనిప్పుడు మరణించినా నీ నిండుగా ప్రవహించే నదులనుంచి
నాకు పునర్జీవనాన్నిచ్చే ఒక్క చిన్న తుప్పరని ఎల్లా కోరగలను?
నీ ఉత్సాహభరితమైన వత్సరాలనుంచి ఒక్క గంట వెచ్చించమని
ఏవిధంగా కోరగలను?
అయినా నియతి నాకు, నాప్రేమకి ఈ భావస్ఫూరకమైన నిశ్శబ్దాన్నీ,
నిరాశనీ భరించమని రాసిపెట్టింది.

✡ ✡✡

*డా. శ్యామల కల్లూరి*
*మానవీయ సామాజిక శాస్త్ర విభాగం, ఐ.ఐ.టి న్యూఢిల్లీ*

# జయంత మహాపాత్రా

## (1928)



**ఇప్పటిదాకా ఈ శీర్షికలో** చర్చించిన కవులందరూ 19వ శతాబ్దపు రెండవ భాగంలో జన్మించి స్వాతంత్ర్య సంగ్రామ కాలంలో గాంధీ గారి ఉద్యమాలు ప్రబలంగా వున్నప్పుడు కవితలు రాసినవాళ్ళు. అంటే బ్రిటీషు ప్రభుత్వపు రాజకీయ దౌష్ట్యాన్ని వ్యతిరేకించినా ఆంగ్లభాష ప్రయోజనాన్ని గుర్తించి ఆ - భాషలో సాహిత్యసృష్టి చెయ్యాలని తపన పడిన మొదటి రెండవ తరం కవులు. తర్వాత తరంవాళ్ళు 1925 తర్వాత జన్మించిన కవులు స్వాతంత్ర సంగ్రామం ఉధృతంగా ఉన్నప్పుడు జన్మించి ఉప్పు సత్యాగ్రహం, దండి మార్చి, సహాయనిరాకరణోద్యమం, క్విట్ ఇండియా ఉద్యమం జరుగుతున్న రోజులలో పెరిగి పెద్దవారైన వాళ్ళు. స్వాతంత్రం వచ్చిన తర్వాతకూడా కవితలల్లిన వాళ్ళూ, ఇంకా రాస్తున్నవాళ్ళు. అరచేతిలో వైకుంఠంలా వస్తుంది వస్తుంది అని వూరించిన స్వాతంత్రం, స్వేచ్ఛ వచ్చాకా ఎల్లా నిరాశలో ముంచి తేల్చయో చూసి, అనుభవించిన వాళ్ళు. డెరోజియో మైకేల్ మధుసూదన్ దత్ లాంటి కవులు ఆద్యులవుతే ఇప్పటిదాకా వచ్చిన కవులు సరోజినీనాయుడు దాకా రెండో తరం కవులు. ఇప్పుడు మనం మూడో తరం కవుల పరిధిలోకి వచ్చినట్టు చెప్పుకోవచ్చును. వీరిలో చాలామంది వృద్ధులైనా ఇంకా సాహిత్యపరంగా ఉత్సాహంగా రాస్తూనేవున్నారు. ఈ తరం వాళ్ళలో మొదట చెప్పుకోవలసిన వారు శ్రీ జయంతమహాపాత్రా.

జయంత మహాపాత్రా 1928లో ఒరిస్సా రాష్ట్రంలోని కటక్ లో జన్మించారు. స్కూలు చదువు స్థానికంగానూ, కాలేజీ చదువు సైన్స్ కాలేజి పాట్నాలోనూ చదివారు. తన జీవితంలో చాలాకాలం ఫిజిక్స్ లెక్చరర్‌గానూ ప్రొఫెసర్‌గానూ పని చేసారు. అల్లా వృత్తిచేత ఫిజిక్స్ అధ్యాపకుడు ప్రవృత్తిచేత కవి అవడం వలన జీవితంలో మధ్య వయస్సు దాటాక కవితలు వ్రాయడం మొదలుపెట్టారు. 2009లో వీరికి భారత ప్రభుత్వం పద్మశ్రీ అవార్డుని ఇచ్చి గౌరవించింది. రాజకీయ పరంగా ఒరిస్సా దేశంలో ఆర్థికంగా వెనకబడిన వర్గానికి చెందటం, వ్యక్తిపరంగా... మతం మార్చుకోవడం అనే రెండు విషయాలు వీరి కవిత్వాన్ని చాలా ప్రభావితం చేసాయి. వీరి కవిత్వంలో క్రిస్టియానిటీని గురించిన వస్తువైవిధ్యం కంటే హిందూ సమాజంలోని అసమానతలగురించిన వేదన ఎక్కువగా కనిపిస్తుంది. గుళ్ళలో గోపురాలలో మతమౌఢ్యాలలో అన్నిటా వీరికి ఒరియా సమాజపు వెనుకబడినతనం కనిపిస్తుంది. తక్కిన భారతీయాంధ్ర కవులలా పబ్లిక్ స్కూలులో చదువుకోలేదు. మహానగరాలలో పెరిగి పెద్దవ్వలేదు. గ్రామీణ ప్రాంతాలలో పంటభూముల నేపధ్యంలో పెరిగారు. తనచుట్టూ ఎక్కడచూసినా దారిద్ర్యం, అనారోగ్యం, ఆకలి, ఆకలిచావులు వీరుచూసిన నిరాశామయ ప్రపంచం. కరువుకాటకాలు, వరదభీభత్సాలు

అప్పటికీ ఇప్పటికీ వీరి జన్మభూమిని పట్టి పీడించే శాపాలైతే, వీటిని గురించి రాయడం తప్ప కవికి వేరొక మార్గంలేదు. జీవితంలో చూడని ప్రేమని కవిత్వంలో చూపించలేక పోవడం వీరి కవిత యొక్క నిజమయితే చదివేవారికీ ఒక నిరాశామయ ప్రపంచం కనిపిస్తుంది తప్ప ఆశా, మానవత్వం పట్లనమ్మకం కనిపించవు అనేది ఒక విమర్శ అని చెప్పవచ్చును.

వీరి కవిత్వంలోకి వస్తే చదువరులకి మనకి గతంపట్ల ఒక నిరాశపూరితమైన దృక్పథం కనిపిస్తుంది. కొన్నిరకాలగతాలుంటాయి. అవి స్వంతంగా కవి జీవితానికి చెందినట్టే స్వదేశపుగతానికి కూడా చెందుతాయి. మూడురకాల గతాలు కనిపిస్తాయి – వీరి కవితల్లో. ఒక గతం గురించిన చరిత్ర పుట్టక ముందునుంచీ వున్నది, జాతి యొక్క ఆధ్యాత్మిక, మానసిక, పౌరాణిక సంస్కృతిలో నిక్షిప్తమై వుంటుంది. తనజాతి పట్టి పీడించే మూఢనమ్మకాలన్నీ ఈ గతంలోంచి వచ్చాయి. రెండోది చారిత్రకంగా తన జాతి ఎదుర్కొన్న యుద్ధాలు, రక్తపాతాలు మొదలైనవి. అశోక చక్రవర్తి సృష్టించిన కళింగయుద్ధం గురించి చరిత్ర మనం చదివితే ఈ యుద్ధం కారణంగానే అశోక చక్రవర్తిలో హృదయ పరివర్తనం జరిగి అతను స్వయంగా బౌద్ధధర్మాన్ని స్వీకరించి ప్రపంచమంతటా శాంతి సందేశాన్ని అందించటానికి పునాదులు వేసిందని అర్థమవుతుంది. కానీ ఈయుద్ధం వలన జరిగిన రక్తపాతంతో ఈనేల తడిసిపోయిందని అనేది కవి దృక్పథం. రాజులో మార్పు వచ్చినా ఈ మార్పు వెనకాల ఎన్నివేల జీవితాలు మట్టిలో కలిసిపోయాయో చరిత్ర చెప్పదు. మూడో రకమైన గతం నిన్నమొన్నటిది. స్వాతంత్రోద్యమం, గాంధీజీ ప్రభోధించిన అహింసా సిద్ధాంతాలు అన్నిటి పట్ల ఈ కవి అసంతృప్తుడైనట్టు తెలుస్తుంది. అయితే గాంధీగారి మరణం తర్వాత గాంధీపట్ల వీరిదృక్పథంలో మార్పు వచ్చింది. స్వాతంత్రానంతరం ఒరిస్సా రాష్ట్ర ఎదుర్కొన్న ఎదుర్కొంటున్న తీవ్రవాద సిద్ధాంతాలు అసలే వెనుకబడిన రాష్ట్రాన్ని ఇంకా వెనక్కి నెట్టాయని వీరి వేదన. పెరుగుతున్న తీవ్రవాద చర్యలు నక్సల్ బారీలో మొదలై బెంగాలు, బీహార్ ఒరిస్సా, ఆంధ్రప్రదేశ్ నేటి ఛట్టిస్‌గఢ్ ప్రాంతాల్ని అల్లకల్లోలం చెయ్యటానికి ముందు మొదట్లో ఈ రాజకీయ అనిశ్చిత పరిస్థితికి కారణమైన ఆర్థిక మాంద్యం ఎన్నో అమాయక జీవితాలు ఎన్ కౌంటర్లలో అంతమవడం ఈ కవికి కలిగించిన వేదన అన్నీ కవిత్వంలో కనిపిస్తాయి. క్లోస్ థ స్కై, టెన్ బై టెన్ , స్వయంవరా అండ్ అదర్ పోయమ్స్, ఎ ఫాదర్స్ అవర్స్, ఆరైన్ ఆఫ్ రైట్స్, వైటింగ్, లైఫ్ సైన్స్, రాండం డిస్పెన్ట్, లై ఆఫ్ డాన్స్ తదితరమైన ఎన్నో కావ్య సంకలనాలని వెలువరించారు. ఎన్నో జాతీయ అంతర్జాతీయ అవార్డులని సన్మానాలనీ అందుకున్నారు. ఆంగ్లంలోనే కాక ఒరియాలోనూ కవితలు రాసారు. ఎంతోమంది ఒరియన్ కవితలని అనువదించారు. చంద్రభాగ అనే సాహిత్య పత్రికని చాలాకాలం నడిపారు. ఆర్థిక వత్తుడుల కారణంగా దీనిని మూసివేయువలసి వచ్చిందని స్వయంగా చెప్పారు.

**మహాపాత్రా కవితలు**

**<u>వరిపొలాల మీద మబ్బులా క్రమ్మిన తెర</u>**

ఒక నల్లటి ఆవుతో అప్పుడే పుట్టిన లేగదూడ!
పొడవైన కాళ్ళు కుదురులేని నడకతో,
హైరోడ్డులో వేగంగా దూసుకు వెళ్ళే లారీ,
ఇవన్నీ చెపుతాయి, నేను ఏవో జ్ఞాపకాల వేటలో వున్నానని...
ఏనాడో కాలధర్మంచేసిన మామ్మ
నా చెక్కిళ్ళ మీద కురిపించిన చిరుముద్దులో
నా తల్లి మూసివేసిన యవ్వన తలుపుల బయట
నేను కురిపించిన కన్నీళ్ళ చినుకులో

ఈ రోజు ఈ జ్ఞాపకాల దారం వ్రేలాడుతూ, సగందాకా వస్తుంది!
కానీ నా చేతులు దానిని స్పృశించలేవు!
నేనేదో ఒక తీర్పుకోసం ఎదురుచూస్తున్నానని కాదు.
కాని అప్పుడప్పుడు ఒక ఛాయ ఈ జ్ఞాపకాల మీద
నెమ్మదిగా కదులుతుంది. ఈ ఛాయకి
గతంలేదు, భవిష్యత్తూ లేదు!
ఆ చిన్నతనపు జ్ఞాపకాల పద చిహ్నాలు
మసకమసకగా నిలచివుంటాయి.
ఎంత తేలికైన చిహ్నాలు
లోపలికీ బయటికీ మామిడిచెట్ల గుబుర్లలోనుంచి
గెంతుతూ, ఉడుతల్లా!

## పూరీలో ఒక ఉదయం

కాకుల అరుపులు, అంతంలేకుండా!
ఆ పవిత్ర ఇసుకతిన్నెలమీద ఒక కపాలం వంగి వుంది
ఆకలి దిశగా, ఖాళీ దేశంలా!

తెల్లటి వస్త్రాలు ధరించిన వితంతు స్త్రీలు
వాళ్ళ జీవితాల మధ్య వయస్సుని దాటి
ఎదురుచూస్తున్నారు, ఆ గొప్ప దేవాలయంలో
ప్రవేశించటానికి.

వాళ్ళ కఠినన్రేత్రాలు కన్నార్పకుండా చూస్తూ వుంటాయి
వలలో చిక్కుకున్నట్లు, వ్రేలాడుతూ
ఉషస్సు యొక్క మెరిసే నమ్మకపు దారంలా

ఉదయపు లేతకాంతులు చిట్లి, ఛిద్రుపలై
ఒకదాని మీద ఒకటి ఆనుకుని పడివున్న గుడ్డి గవ్వల మీద!
పేరుకొన్న ముఖాల సమూహం!

ఉన్నట్టుండి ఒక చితి మంట
పైకెగుస్తుంది, వృద్ధాప్యం పైబడ్డ
మామ్మలా, ఒక ఒంటరి మంట.

ఈ పుణ్యస్థలంలో అంతిమ సంస్కారం ఆమె ఆఖరి కోరిక!
కదిలే ఇసుకతిన్నెలా
మెలికెలు తిరిగే వెలుగు రేఖలా
ఆమె ఆఖరి కోరిక!

## ముసుగు

మళ్ళా వేసవి వచ్చింది కాబోలు
సూర్యకాంతి అంతకంతకూ తీవ్రమౌతున్నది.
ధాన్యపు ముఖాలు కఠిన శిలల్లా వున్నాయి.
వాటి పిడికిళ్ళు ఎప్పుడూ మూసుకునే వుంటాయి.
పిల్లల్ని మోసుకుంటూ స్త్రీలు తిరుగుతున్నారు,
విషాద శూన్యమైన కదలికలతో!
నేను నా లక్ష్యంలేని నడకనుంచి తిరిగి వచ్చాను.
నా కిటికీలోంచి బయటికి చూశాను.
ఒక బస్సు నాకళ్ళముందే నిండి
వెనుతిరుగుతోంది. ఒక మనిషి నవ్విన నవ్వు
నన్ను విచలితుణ్ణి చేస్తున్నది.
నా మనస్సునిండా శూన్యం నిండిపోతున్నది.
ఆకలి ప్రతి ఒక్కడికి ఒక ముసుగునిస్తున్నది.
ముసుగునుంచి వాసన, ఒక బంధింపబడిన జంతువులా!

## నా కవితలో పంక్తులు

పంజరంలో నాకవిత చూస్తూ వుంటుంది
పై నుంచి బయటికి ఇబ్బందికరంగా, తదేక దీక్షతో!

దాని పూర్వపు వైభవానికి అది ఇప్పుడొక ఛాయ మాత్రమే,
బయటికెళ్లా రావాలో తెలియని నాకవిత
మరో చిన్న బిడ్డ ఆకలి ముందు
అడుగు ముందుకు పడక నిలిచిపోతుంది.
నాకవితలోని పంక్తులు బహుకాలం దాకా
కుంటి నడక నడుస్తూనే వుంటాయి.
ఎందుకంటే అవి కొసావోలోని భీభత్సాన్ని చూసిన
బాలిక వేదనాభరిత కేకలముందు నిస్సహాయమైపోయినాయి!
పశ్చిమతీరాన కోపంతో మండిపడే బాలుని
స్మృతిని వదిలించుకోవటానికి సకల ప్రయత్నాలు చేస్తున్నాయి!
ఈ దేశపు సంవత్సరాల బీదరికపు
భారంతో క్రుంగి పోతున్నాయి.
నా ప్రభుత్వం అదిచేసిన వాగ్దానాలను మరచినప్పుడల్లా
నాకవిత్వపు ఒకపంక్తి విశాలమైన డిల్లీ వీధుల్లోకి లాగబడుతుంది.
ఎవర్నైనా సంతోషపెట్టే వూహ అసలుందా, వుంటే ఎక్కడ వుంది?
ఒక భయంకరమైన చరిత్రచే పీడింపబడుతున్న ప్రజలు
తరాలతరబడి రక్తమోడుతూ బ్రతుకుతున్నారు.
ఈ నాకవిత నిశ్శబ్దంగా నిలబడిన నియతి అనే
చెట్ల మధ్య తిరుగువుంటుందా?
దేనినుంచి అది దూరంగా పరిగెడుతోందో
దానికి తెలియదు.
చేదు అనుభవమొక్కటే ఈ కవితని
సజీవంగా నిలబెడుతుందనుకోవటం తప్పా?

కవితా, నాతల్లీ, బాధ ద్వారా నువ్వు గతం భవిష్యత్తు అనే
అంతరాలని దాటడానికి పడ్డ శ్రమనెలా ఓర్చుకున్నావు?
నా పగిలిన అంతరాత్మచుట్టూ
పరివేష్టించిన ఒక సురక్షా కవచానివి!
ఈ రోజు ఈ కవితలోని ఒక పంక్తి దాని
ఆరోగ్యకరమైన చరణాలని కోల్పోయింది.
ప్రపంచపు అంతరాత్మ అనే పంజరంలో
బంధించబడి రెక్కలు కొట్టుకుంటున్న

పిచ్చుకపిల్లలా నా కవిత
వర్తమానమనే నేలలో క్రుంగిన దయార్ద్ర దృశ్యమిది!
మీ కాళ్ళకి గురి పెట్టి కాల్చరనే వార్తాపత్రికల మాట
శుద్ధ అబద్ధం! వాళ్ళు కవిత్వానికే అధిపతులు!
కానీ మనం భయపడవద్దు!
విచక్షణని మానవ చరిత్ర ఎన్నడూ అంగీకరించలేదు!
సారవంతమైన తడినేల కాంక్రీటుగా మారవచ్చును.
కవితలు వారి పాటల ఉరుములలోకి జొరబడవచ్చును.

కానీ అద్భుతాల నిజాలు కవితల్లోని పదాల
ప్రయోగాల కారణాల్ని వెతుక్కోవు
రక్తానికి తెలియదు దాని ఫలితాలు సరితూగుతాయో,లేదో!

✡ ✡✡

*డా.శ్యామల కల్లూరి*
*మానవీయ సామాజిక శాస్త్ర విభాగం, ఐ.ఐ.టి న్యూఢిల్లీ*

# ఎ.కె.రామానుజన్

## (౧౯౨౯-౧౯౯౩)



**ఇరవైవ శతాబ్దపు** భారతీయాంగ్ల కవులలో ఎ.కె. రామానుజన్‌కి ఒక ప్రత్యేకమైన స్థానం వుంది. ఈ ప్రత్యేకత అనేక కారణాల వల్ల శ్రీ రామానుజన్‌కి సహజంగా సంక్రమించింది. కవి, అనువాద కవి, విమర్శకుడు, సాంస్కృతిక పురామానవ విజ్ఞానశాస్త్రంలో (మానవజాతుల, సంస్కృతుల వికాసాన్ని శాస్త్రీయంగా పరిశీలననుకూలమైనవిధంగా విశ్లేషించే శాస్త్రమని చెప్పవచ్చును - కల్చరల్ ఆన్థ్రపాలజిస్ట్ అని ఆంగ్లంలో వాడుకలో వున్న పదం) విశేషమైన పరిశోధన చేసిన మేధావి ఎ.కె. రామానుజన్. సాంస్కృతిక మనో వైజ్ఞానిక పరంగా జాతులనీ సంస్కృతులనీ వాటి వికాసాన్నీ చదవడమేకాదు, దాని ప్రభావంతో ఎన్నో రచనలు చేసి, అరుదైన, ఎవరికీ అంతగా పరిచయంలేని భారతీయ సంస్కృతులని ముఖ్యంగా దక్షిణాది సంస్కృతిని శాస్త్రీయ దృక్పథంతో పాశ్చాత్యులకి పరిచయం చేసిన ఘనత వీరికి దక్కింది. పూర్తిపేరు అట్టిపట్టు క్రిష్ణస్వామి రామానుజన్ . పుట్టింది 1929లో దక్షిణభారతదేశం మైసూరులో, చదువుకున్నది నేటి తమిళనాడులోను, అమెరికాలోని ఇండియానా స్టేట్ యూనివర్సిటీలోను, వృత్తిపరంగా కూడా అమెరికాలోని షికాగో యూనివర్సిటీలో దక్షిణపూర్వ ఆశియా భాషా, నాగరికతల విభాగంలో అధ్యయనవేత్త, ప్రొఫెసర్ (South East Asian Languages and Civilizations)గా చాలాకాలంపనిచేసారు. తన అమెరికా వృత్తిజీవనంలో అనేకమంది విద్యార్థులు, అభిమానులు వీరి మేధస్సుపట్ల ఆకర్షితులైనారు. మరణించిన చాలాకాలంతర్వాతగూడా వీరు రాసిన, ప్రచురించిన, ప్రచురణకి నోచుకోని ఎన్నోరచనలని అభిమానులు వెలికితీశారు. 1993లో ట్యూమర్‌కి గురి అయి శస్త్రచికిత్స చేస్తూవుంటే ఆపరేషన్ టేబిల్ మీద ప్రాణాలు వదిలారు. భారతీయ సంస్కృతికి భాషా వికసాలకి వీరి మరణం ఒక తీరని లోటు.

కవిగా రామానుజన్ గురించి చెప్పేముందు వీరి ఇతర అభిమాన విషయాల గురించి తెలుసుకోవటం అవసరం. భారతీయ సాహిత్యాలకి అనువాదాల అవసరం ఎంత వుందో చాటి చెప్పిన విద్వాంసుడు. తాను స్వయంగా మూడవ శతాబ్దానికి చెందిన తమిళ సంగం కవులని, పదకొండవ శతాబ్దానికి చెందిన కన్నడ వచన కవులని ఆంగ్లంలోకి అనువదించారు. అంతేకాదు! ఇరవైవ శతాబ్దంలో శ్రీ యు.ఆర్ అనంతమూర్తి కన్నడంలో రాసిన సంస్కార అనే కన్నడ నవలని ఆంగ్లంలోకి అనువదించారు. అనువాద సాహిత్యానికి పరిమాణాలని నిర్దేశించగలిగిన స్థాయిలో తాను అనువాదాలు చెయ్యటమేకాక తన తర్వాత ఎందరికో అనువాద సాహిత్యం ద్వారా తమభాషా సాహిత్యాలని ఎల్లా నలుగురి దృష్టికి తీసుకెళ్ళచ్చో మార్గదర్శకత్వం చేశారని చెప్పవచ్చును. పురాతన సాహిత్యాన్ని, ఆధునిక

కవిత్వాన్నీ ఒకేవిధమైన పరిణతితో అనువదించగలిగినారు. అనువాద సాహిత్యాన్ని కేవలం దాని ప్రతిభమీద విశ్లేశించటానికి అనుగుణంగా ఎన్నో రచనలను తన అనువాదాలతో ప్రజలముందుకు తెచ్చారు. యు.కెలో లండన్ ట్యూబ్ స్టేషన్‌లో తరచు ప్రపంచ కవుల కవితలు నోటీస్ బోర్డ్‌లో ప్రచార ప్రాతిపదికమీద కనిపిస్తుంటాయి. కవితాభిమానులు ఈ కవితలని చదవటానికి ఆగడం అసాధారణమూ కాదు. ఒకసారి మూడవ శతాబ్దపు సంగం కవుల కవిత కనిపించింది. కవితాభిమానులందరూ మూల తమిళ కవితతో పాటు ఆంగ్లంలో కనిపించిన ఈకవితని చూసి ముగ్ధులైపోయారని నాటి పేపర్లన్నీ రిపోర్ట్ చేశాయి. ఇది రామానుజన్ సంపాదించిన అరుదైన తమిళ వ్రాతప్రతి అనీ, దానికి వారు చేసిన అనువాదమని వేరే చెప్పక్కరలేదు.

తర్వాత చెప్పుకోదగినది వీరికి పురా మానవశాస్త్రపు జాతుల, సంస్కృతుల పట్ల ఉన్న ఆకర్షణ. దక్షిణపూర్వ ఆసియాటిక్ నాగరికతల పైన విశేషమైన కృషి చేశారు. భారతీయ నాగరికత సంస్కృతి పట్ల ఆకర్షణ వుండడమే కాదు పాశ్చాత్య నాగరికతనుంచి తాను నేర్చుకున్న హేతుబద్ధమైన అలోచనావిధానం ఒక ప్రత్యేకమైన నిరపేక్షతతో దీనిని గురించి వ్రాయటానికి వీరిని ప్రోత్సహించింది. ఉదాహరణకి ఒక రచన గురించి ప్రస్తావిస్తే వీరి ఆలోచనాదృక్పథంలో ఉన్న ప్రత్యేకత అర్థమవుతుంది. "భారతీయ ఆలోచనాదృక్పథంలో ఏదైనా ఒక భారతీయత వుందా?" అనే ప్రశ్నార్థకంతో ఒక వ్యాసాన్ని రాశారు. ఈప్రశ్నకి నాలుగు రకాలైన సమాధానాలున్నాయని మొదలుపెడతారు. మొదటిది భారతీయత ఒకప్పుడు ఉండేదా, ఇప్పుడుకూడా ఉందా అనేది మొదటి ప్రశ్న. భారతీయులు తమదైన ప్రత్యేక వైదిక సంస్కృతిలో బ్రతికిన రోజులలో ఒక ప్రత్యేకత ఉండేదని కొందరి వాదన అది ఇప్పుడు ఉందాలేదా అనేది సందేహాస్పదమైన విషయమని మరికొందరు అనుకుంటారు. భారతీయులందరిలో ఒకేరకమైన భారతీయత ఉందా అనేది రెండో ప్రశ్న. దేశీ, మార్గ సంప్రదాయాలు, గ్రామీణ/నగర నాగరికతలు, సాంప్రదాయ/వాచక పరంపరలు లాంటి ఎన్నో వైవిధ్యాలు భారతీయ ఆలోచనాదృక్పథంలో నిబిడీకృతమై వున్నాయి. భారతీయులలో వారికే ప్రత్యేకమైన ఆలోచనాధోరణులున్నయా అనేది మూడో ప్రశ్న. నేటి భారతం తక్కిన ప్రపంచంతో పాటే నడుస్తోంది. మనకంటూ ప్రత్యేకమైన ధోరణులేమీలేవు అని పలువురి భావన. అది కూడా ప్రశ్నించదగినదే ఎందుకంటే మన కళలు, సాహిత్యం, సంగీతం మన ప్రత్యేక ఆస్తులని మనమనుకోవడం సర్వసాధారణంగా చూస్తూవుంటాము. నాలుగో ప్రశ్న మరీ క్లిష్టమైనది. భారతీయులసలు ఆలోచిస్తారా అన్నది నాలుగో ప్రశ్న. అప్పటికీ ఇప్పటికీ మనం ఇండియాలో వైదిక కర్మల పట్ల నమ్మకాలు అవీ చూస్తుంటే ఇండియా ఇప్పటికీ వైదికయుగంలోనే వుందని అనిపిస్తుంది. ప్రతి చోటా భారతీయ నైజంలో ఒక వైరుధ్యంవుందని తర్వాత చెపుతారు. తన తండ్రి తలపాగా ధోవతి పంచెకట్టుకుని ధరించి, టై, బూట్లు వేసుకోటం దీనికి ఉదాహరణగా చెపుతారు. తన తండ్రి గారి తరంలో ఎంతోమంది సంస్కృత విద్వాంసులు గణిత శాస్త్రంలోనూ నిష్ణాతులని, జ్యోతిష్య శాస్త్రాన్ని, ఖగోళ శాస్త్రాన్ని సమ ప్రాతి పదిక మీద అధ్యయనంచేసేవారని చెపుతారు.

ఈవైవిధ్యం వారి నైజంలో ఒకవిధమైన ద్వైదీభావనకి కృతిమతకి తావునిచ్చిందని చెపుతారు. ప్రపంచవ్యాప్తంగా విలువలు విశ్వజనీనమై సర్వులూ ఒకే చిత్తశుద్ధితో అమలుపరచదగినవనుకుంటే, భారతీయులు అల్లాఅనుకోరు. వీరికి విలువలు వ్యక్తి యొక్క స్వభావమ్మీద, సాంఘిక సాధారణ ధర్మాలమీద ఆధారపడివుంటాయి. అబద్దంచెప్పటం తప్పు అని ఒకవేపు చెపుతూనే "వారిజాక్షులందు, వైవాహికంబులందు, ప్రాణవిత్త మానభంగంబులందు" బొంకవచ్చునని ఆపద్ధర్మాన్ని నిర్దేశిస్తారు. కర్మను గురించి మాట్లాడుతూనే, తలవ్రాత అని సరిపెట్టుకుంటారు. అనేక సందర్భాల మీద వీరినమ్మకాలు అనేక రకాలుగా అమలు జరుగుతూవుంటాయి. ఒకేరకమైన నేరానికి రాజుకి, ధనవంతుడికి, నిమ్నజాతివాడికి విడివిడిగా శిక్షలు అములు జరుగుతాయి. జాతిని మించి ఆలోచించంటం మనువు నుంచి ఏ ఋషి మనజాతికి నేర్పలేదు. జాతి గాని, జీవితపు విలువలుగాని సందర్భాలమీదే ఆధారపడివుంటాయి. దీనిని వీరు కాంటెక్ట్ సెన్సిటివ్ థింకింగ్ అని చెపుతారు. వ్యాకరణసూత్రాలు సందర్భాలమీద ఆధారపడవు, ప్రాశ్చాత్యదేశీయుల విలువలలాగా. బృహదారణ్యకోపనిషత్తులో అయితే ప్రజాపతి దాం, దాం, దాం (దత్తత,దామ్యత,దయాధ్వం) అనే గర్జనని దేవతలు మనుష్యులు దానవులు

వారి నైజాన్ని బట్టి మూడు రకాలుగా అర్థంచేసుకోవడాన్ని ఉదాహరణగా చెపుతారు. చివరిగ ఇరవైశతాబ్దంలో భారతం సందర్భరహిత ఆ-లోచనవేపు మొగ్గుచూపటం మొదలుపెట్టాయని చెపుతూ ముగిస్తారు.

చివరిగా చెప్పవలసింది వీరి ఆంగ్ల కవితలగురించి. ఇప్పటిదాకా చెప్పినట్టు సంస్కృతులవైవిధ్యాలు వీరి కవితలలో గూడా కనిపిస్తాయి. స్ట్రైడర్స్, రిలేషన్స్, సెకండ్ సైట్, బ్లాక్ హెన్, స్ట్రైడర్స్,కలెక్టెడ్ పోయమ్స్, అన్ కలెక్టెడ్ పోయమ్స్ ఆంగ్లంలో రాసిన కవితా సంకలనాలు. వీటిలో మొదటిమూడు వీరు జీవించవుండగానూ, తర్వాతవి వీరి మరణానంతరం భార్య మోలీ రామానుజన్, కుమార్తె కృత్తిక రామానుజన్, తక్కిన స్నేహితులు విద్యార్థులు అభిమానులు కలిసి కృషిచేసి ప్రచురించినవీను.

ఇవికాక పురాతన తమిళ సాహిత్యాన్నీ, కన్నడ భక్తి సాహిత్యాన్ని ఆంగ్లంలోకి అనువాదంచేసారు.

***<u>కొన్ని కవితలు ఆంగ్లంలో రచించినవి:</u>***

***<u>తిరిగి వచ్చిన కొడుకు</u>***

ఒక మధ్యాహ్నం మండుటెండలో ఇంటికి తిరిగి వచ్చి
అమ్మకోసం అన్నిచోట్లా వెతికాడు, అతడు.
ఆమె వంటింట్లో లేదు, పెరట్లో లేదు
ఆమె ఎక్కడా కనిపించలేదు

అతడు వెతికాడు, వెతికాడు- ఖంగారు పడ్డాడు.
మంచంక్రింద చూశాడు, పాత చెప్పులు, దుమ్మూ ధూళీ తప్ప
తల్లి జాడ కానరాలేదు!
బయటికి పరిగెత్తాడు 'అమ్మా' అని అరుస్తూ.

ఎక్కడున్నావు నువ్వు? నేనింటికి వచ్చాను, ఆకలితో!
జవాబులేదు, తన పిలుపుకి ప్రతిధ్వనికూడా లేదు
బయట సూర్యకాంతినిండిన నిర్మానుష్యమైన వీధిలోనుంచి.
అప్పుడతనికి అకస్మాత్తుగా గుర్తుకొచ్చింది
అప్పుడు తనకి అరవైయొక్క ఏళ్ళని
గత నలభై సంవత్సరాలుగా తనకి తల్లి లేదని!

***<u>నది</u>***

మధురై-
దేవాలయాలగురించి, నగరాలగురించి పాడిన
దేవాలయాలునిండిన, కవుల నగరం.

ప్రతివేసవిలోను
నది ఎండి బీటలువారి బిందుమాత్రంగా వుంటుంది.
ఇసుకతిన్నెల ఎముకలు బయటికి వచ్చివుంటాయి
నదీద్వారం దగ్గర గేట్లు స్త్రీల జుట్టుతోనూ ఎండిపేరుకున్న గడ్డితోనూ
మూసుకుపోతాయి. నది వంతెన క్రింద రిపేరుకొచ్చిన గతుకుల గట్లు!
తడిరాళ్ళు నిద్రపోతున్న మొసళ్ళలా మెరుస్తుంటే, పొడిరాళ్ళు
ఎండ కాచుకుంటూ నున్నగా క్షవరం చేసుకున్న ఎద్దుల్లా నిలుచుంటాయి.

అయితేకవులు వరదలగురించే గానం చేస్తారు.

అతను అక్కడ ఒక్కరోజు వున్నాడు
వరదలు వచ్చినరోజు!
నీటి మట్టం ఎన్ని అంగుళాలు పైకి వచ్చిందో
స్నానఘట్టంలో ఎన్నిమెట్లు నీటిలో మునిగాయో
అనే ప్రజలందరూ మాట్లాడుకుంటున్నారు.
గ్రామంలో మూడు ఇళ్ళూ, ఒక గర్భవతి అయిన స్త్రీ,
గోపీ,బృందా అనే రెండు జంట ఆవులు నీటిలో కొట్టుకుపోయాయి.
క్రొత్త కవులు ఇంకా పాత కవుల్ని నెమరువేస్తూనే వున్నారు.
కాని మరణించిన గర్భిణి స్త్రీ గురించీ,
ఇంకా పుట్టకుండానే ఆమె గర్భసంచి అంచులకి కొట్టుకుంటూ
కన్నుమూసిన ఆమె కవలపిల్లల గురించి కవులు తల్చుకోరు!
అతను అన్నాడు ఏడాది కొకసారి నది నిండుగా ప్రవహించే వరద నీరు
కవితా వస్తువు అవుతుంది. మొదటి అరగంటలోనే, మూడు ఇళ్ళు
గోపి, బృందా అనే రెండు ఆవులు, కవలలని కనబోతున్న ఒక
గర్భిణీ స్త్రీ, విడివిడిగా గుర్తించటానికి రెండు రంగుల్లో వాళ్ళ లంగోటీలు
కొట్టుకుపోతాయి, వరద నీటితో!

***<u>పెళ్ళానికి ప్రేమలేఖ</u>***

ఒక జీవితకాలపు సహజీవనం తర్వాత
మనల్ని విడదీసి వుంచేవి
విడివిడిగా జీవించిన మన బాల్యాలు.
ఉదాహరణకి నువ్వు నాతండ్రిని కలవలేవు

ఏనాడో కాలం చేసాడు కనుక
నేను నీ తండ్రిని ఎరుగను
ఇప్పుడాయన కోపిష్టితనం అంతా కోల్పోయి
మరోమనిషైనాడు మరి!

అన్నదమ్ములందరం కలిసి
అర్థరాత్రిదాకా చెప్పుకునే కబుర్ల దీర్ఘప్రహసనాల్లో
మన మధ్యలేని తాతల గైరుహాజరీల్లో
బ్రాందీ, పొగల మత్తుల్లో
నువ్వు నా గతంకోసం తపిస్తావు.
నేను నీ గతంలో
నువ్వు చిన్నతనంలో చేసిన కుక్కసవారీల గురించి
మీ ఏడుగురి అత్తల వింత కథనాలువిని
అసూయతో జ్వలిస్తాను.
పాతఫొటో ఆల్బంలలో ప్రేతాకారంతో మొదలయి
నేటిదాకా వున్న ఫొటోలలో
నన్ను గుర్తించటం నేర్చుకుంటావు.
స్నానం చేసేటప్పుడు సబ్బుతో నాన్న
వీపు మీద మ్రోగించే చప్పుళ్ళగురించి
మా అన్నల కథలలో వింటావు!
పెళ్ళిళ్ళ గ్రూపు ఫోటోలలో
ఆయనరూపం నీ ముందు నిలుస్తుంది.
గొర్రె ముఖంలాంటి మూతి
నెత్తిమీద ఠీవైన తలపాగా
ఫొటోల్లో నాన్న,
ప్రక్కనే అమ్మ,
వెడల్పై అరిగి చెప్పుల్లేని కాళ్ళతో
వేళ్ళకి మట్టెలతో!
నా తండ్రి డైరీలో వ్రాసుకున్న ఒక్క వాక్యంతో
నా వ్యక్తిత్వాన్ని ముడిపెట్టేస్తావు!
నీ తండ్రి వయస్సు పైబడ్డకా,
ఇప్పుడు ఒప్పుకోకపోయినా

ఆనాడు-
ఆయన నీ సాయంకాలాల మీద పెట్టిన ఆంక్షలు
రాత్రి నువ్వు ఇల్లు చేరేదాకా
వరండాలో సిగరెట్లు కాలుస్తూ చేసిన పచార్లు,
నువ్వు అమాయకమైనవని నమ్మిన
నీ ముస్లిం స్నేహితుడితో నీ షికార్లు,
ఆ సాయంకాలాలు వాటి స్పర్శలు అన్నీ పైకి వస్తాయి!
గత వారం మీ అన్న జేమ్స్ వచ్చినప్పుడు గుర్తులేదూ!
మీ చిన్ననాటి ఇంట్లో పెరట్లో నుయ్యి ఎక్కడవుండేదో
అనే విషయమ్మీద మీ వాదనలు
ఉన్నట్టుండి నేలమీద కూర్చుని
పాతపేపర్లమీద, కవర్లమీద
అమెరికా మ్యాపులవెనక
మీరు గీస్తూ వాదించుకున్న
ఆ మీ చిన్ననాటి నూతి గట్టు గురించి.
ఒకవేపు నేను, మరోవేపు మీ వదిన
పూర్తి ఆగంతకుల్లా మీ సంభాషణకి బయట!
మీరేమో మీ ఆస్తులు పతిదేవుళ్ళ సంపాదనలు
ఫణంగా పెట్టుకుంటూ చనిపోతున్న చెట్ల గురించి
తవ్వుకున్న జ్ఞాపకాలు.

ఈజిప్షియన్ల పద్ధతి మేలు!
ఆ దేశపురాజులకి అక్కచెల్లెళ్లే భార్యామణులు!
పసితనపు వికృత లైంగిక వూహలకి
వాళ్ళు పెళ్ళిళ్ళైన తర్వాతకూడా
కోటలు కట్టుకుంటారు!
అదికాక పోతే హిందువుల పద్ధతి!
ఉయ్యాలల్లో వున్నప్పుడే
పాణిగ్రహణానికి పునాదులు పడతాయి!
జాతకాలు, వాళ్ళు
రజస్వలలయ్యే ముహూర్తాలు,
అన్నీ ముందే నిర్ణయించబడతాయి!

చిన్నన్నాటి నేస్తాలు, మేనమామ కూతుళ్ళూ
భార్యలవుతారు. అప్పుడు
విడివిడి బాల్యాలనేవే వుండవు!

✡ ✡✡

*డా.శ్యామల కల్లూరి*
*మానవీయ సామాజిక శాస్త్ర విభాగం, ఐ.ఐ.టి న్యూఢిల్లీ*

## రాజగోపాల్ పార్థసారథి

## (1934)

**తమిళనాడులోని తిరుచ్చిరాపల్లి** వద్ద వున్న తిరుప్పరైతురై అనే గ్రామంలో శ్రీ రాజగోపాల్ పార్థసారథి 1924 లో జన్మించారు. జన్మస్థానం తమిళనాడు అయినా విద్యాభ్యాసం డాన్ బోస్కో స్కూలులోను తర్వాత నేటి ముంబాయిలోను చేశారు. తర్వాత 1963-64లో యు.కేలోని లీడ్స్ యూనివర్సిటీలో బ్రిటిషు స్కాలర్‌గా గడిపారు. విద్యాభ్యాసం తర్వాత యూనివర్సిటీలో పదేళ్ళపాటు అధ్యాపక వృత్తిలో గడిపారు. నేటి చెన్నైలో 1971లో ఆక్స్‌ఫర్డ్ యూనివర్సిటీ ప్రెస్‌లో స్థానిక సంపాదకునిగా గడిపి 1978 లో డిల్లీలో ఒ.యు.పిలో పనిచేశారు. ప్రసుతం న్యూయార్క్ సిటీ దగ్గర సరతోగా స్ప్రింగ్స్ అనే చోట స్కిడ్ మోర్ కాలేజిలో ఆసియన్ సంస్కృతి లోను ఆంగ్లభాష విభాగంలో ప్రొఫెసర్ గానూ బహుకాలంనుంచీ పని చేస్తున్నారు.

భారతీయాంగ్లకవులలో చాలా కొట్టవచ్చేటట్టు కనిపించే వస్తువు కవుల అస్థిత్వానికి సంబధించిన ద్వైదీభావనలు. ఈ ద్వందాలు భాషాపరమైనవి, మతపరమైనవి, సంస్కృతీ పరమైనవే కాక వ్యక్తిగతమైన స్వభావ అనుభవాలకి చెందినవి. కవులు ధర్మపరంగా, భాషాపరంగా, సంస్కృతీపరంగా, ప్రాంతీయ ప్రాతిప్రదికపై వివిధ అస్థిత్వమూలాలకి చెందినవారు. వీరి కవిత్వంలో ఈ ధర్మసంకటాలన్నీ అనేక సందర్భాలలో అనే ప్రతీకల రూపంలో మనకి ప్రత్యక్షమవుతాయి. కాశ్మీరు నుంచి కన్యాకుమారి వరకు, గుజరాతు నుంచి తూర్పుతీరాన వున్న బెంగాలుదాకా ఈ కవులు వేరువేరు ప్రాంతాలకి చెందినవారైనా తమ తమ ప్రాంతీయ వైవిధ్యాలగురించి వ్రాయడంతో పాటు అనేక రకాలైన అస్థిత్వాలకి చెందిన 'ద్వందాలని' గురించి వ్రాయటం చూస్తాము. పార్థసారధి రాసిన మొదటి, ప్రస్తుతందాకా ఒకేఒక పద్య సంకలనం *రఫ్ పాసేజ్* అనే కావ్యం. తను చేసిన కవితాయానాన్ని ఒడుదుడుకుల గతుకుల రోడ్డుమీద చేసే ప్రయాణం అని చిత్రీకరిస్తారు. తమిళనాడులో పుట్టినా పెరిగిన చోటు బొంబాయి. అక్కడ తండ్రి తమిళభాష నేర్పించటానికి చేసిన ప్రయత్నాలన్నీ ఎలా బూడిదలో పోసిన పన్నీరుగా మారాయో "వ్హోరింగ్ ఆఫ్టర్ ఇంగ్లీష్ గాడ్స్" అనే వ్యాసంలో సవివరంగా ప్రస్తావిస్తారు. వారికోసం నిర్ణయింపబడిన తమిళ ఉపాధ్యాయుడు ఎంత కఠినప్రకృతి చెందిన వాడో తెలియజేస్తూ తమిళం నేర్చుకోవటంపట్ల తనకి కలిగిన వ్యతిరిక్తతకి అదేముఖ్యమైన కారణంగా చెపుతారు. అక్కడినుంచి చదువుకోసం ఇంగ్లాండు దేశానికి వెళ్ళటం అక్కడ పూర్తిగా ఆంగ్ల భాష ప్రభావం క్రిందకి రావటం జరుగుతుంది. ఒకవైపు సామ్రాజ్యవాదాన్ని వ్యతిరేకిస్తూనే దానికి చిహ్నమైన ఆంగ్లభాషని అక్కున చేర్చుకోవటం వీరికొక ముఖ్యమైన సంకటం. అయితే పెరిగే వయస్సులో వారి భాషా సంస్కృతులకి దూరంగా పెరగటంతో మాతృభాష అనే ఒక ముఖ్యమైన లింకు వీరి జీవితంలో తెగిపోయింది. దేశ సంస్కృతి నుంచికూడా ఆంగ్ల భాషాబోధన విద్యావిధానం దూరంగానెట్టివేశాయి. ప్రవాసం (ఎక్సైల్) అనేది రఫ్ పాసేజ్ లో మొదటి భాగం. రవిశంకర్ సంగీత ప్రభావాన్ని ఇంగ్లాడులోని ఒక రూములో స్నేహితులతో సిగరెట్లు త్రాగుతూ అనుభవించానని ఒకచోట రాస్తారు. తర్వాయి భాగం ట్రయల్ అనబడే దూరదేశంలో కవి అనుభవించిన ఒంటరి తనపు కష్టాల గురించిన ప్రకరణం. ఎంతదూరంగా వుంటే స్వదేశం పట్ల సంస్కృతి పట్ల మమకారం అంత పెరుగుందనేది ఈ కవి పట్ల నిజమై మూడో భాగమైన స్వదేశాగమనంలో (హోం కమింగ్)కనపడుతుంది. అప్పుడు పెరిగిన పెద్దదయిన తర్వాత నిజమైన

మమకారంతో తమిళభాషని అభ్యసించి తన స్వంతభాష ఇచ్చిన క్రొత్త స్ఫూర్తితో ఆంగ్లకవిత్వాన్ని తీర్చిదిద్దుకున్నారు. సృజనాశక్తితో తమిళంలో రాయగల సామర్థ్యం లేదని తెలిసిపోయింది. తనకి వృత్తినిచ్చిన భాషనే ప్రవృత్తిగా మార్చుకుని తనభాషా సంస్కృతులగురించి - ఆంగ్ల కవితలద్వారా తన అమెరికా జీవితంలో రాస్తారు. న్యూయార్క్‌లో స్కిడ్‌మోర్ కాలేజీలో ఆంగ్లభాషాధ్యాపకుడుగా చేసి అక్కడే తన జీవితాన్ని ప్రస్తుతం గడుపుతున్నారు.

రఫ్ పాసేజ్ కాక టేల్ ఆఫ్ అన్ ఏంక్లెట్ అనే పేరుతో శిలప్పదికారం అనే తిరుకురల్ ఇలాంగో అదిగలై అనే జైనముని రచించిన కావ్యాన్ని ఆంగ్లంలోకి అనువాదించారు. తమిళభాష వీరిని తిరిగి ఎల్లా అక్కున చేర్చుకుందో దీన్ని బట్టి అర్థమవుతుంది. ఈ అనువాద కావ్యానికి కేంద్ర సాహిత్య అకాడమీ వారి అనువాద పురస్కారం లభించింది. ఇప్పుడు ది హౌస్ డివైడెడ్ 'విభజించబడిన గృహం' అనే రెండో కావ్య సంకలనం రూపుదిద్దుకుంటోంది. అడిగిన వెంటనే తమ లిఖితప్రతి నుంచి కొన్ని కవితలను పంపిన కవికి కృతజ్ఞతలతో వీరి కొన్ని కవితలు ఆంధ్రానువాదంలో.

***కవితలు:***

***డార్జిలింగ్ టీ***

(ఎలాన్ రాస్ కోసం)

ఒక వుడుత గడ్డిలో కూర్చునివుంది
భోధిసత్త్వునిలా వెలిగిపోతూ!
రోడ్డుప్రక్కన విరజిమ్మినట్లు పువ్వులు
నీ క్రాబ్ ఆపిల్ చెట్టునుండి రాలి పడుతూ!
ఆ వయస్సుమళ్ళిన కుక్క వర్షంలో
తడిసిన నేలనాఘ్రాణిస్తూ!

నీ ఆరు బై పది అడుగుల వంటగదిలోకి
హిమాలయాన్నంతటినీ వంపుతూ
ఒక కప్పు డార్జిలింగ్ టీ!
నువ్వు మొగ్గుతావు వాలుకుర్చీలోకి
వంగినట్టు దాని సువాసన వేపు !

మరొకరోజు నీ ముఖంలో ఆవలిస్తూ,
తయారవడానికి సమయమాసన్నమైంది!
విసుగు అనే నీరవమైన యూనిఫాం ధరించి
ప్రపంచాన్ని సూటిగా చూడు!

*తూర్పు వైపు కిటికీ*

అది మధ్యాహ్న సమయం.
ఓక్ మాపిల్ వృక్షాలు సూర్యకాంతి కోసం
తగవులాడుకుంటున్నాయి మా పెరటిలో!
పూలునిండిన క్రాబ్ వృక్షం
తూర్పుకిటికీ నుండి కదుల్తుంది!

మనం ఒకర్నొకరం తిట్లనే సిగరెట్లతో
కాల్చుకుంటాము, ప్రక్కమీద బూడిద విదిలిస్తూ!
వాడని రోజుల్ని మడిచిలోపలపెడతాం
పుస్తకంలో వత్తిపెట్టిన ఆకులాగా!

శారీరకావసరాలు చాలాతక్కువ
మనస్సునే తృప్తిపరచటం కష్టం
వసంత ఋతుమధ్యాహ్నవేళ
మనచేతులనీ కళ్ళనీ విచ్చుకోనివ్వు
బ్లూ ఫ్లోక్స్‌లా సేలం సముద్రతీరాన
ప్రశాంతమైన కారు షికారులా
ప్రతిమామూలు రోజునీ ఒక అపూర్వ సత్యంలా!
అందమంతా సంభవించని దాంట్లోనే వుంది!

కాందిశీకుడునైన నాకు ఇల్లంటూ ఏముంది
నీ అరచేతి ఆంగణం తప్ప.
ప్రేమ అనే ఒక్కపదమే వుంది,
మూర్ఖుడు దానిని నేర్చుకునే ప్రయత్నంలో
పదేపదే ఉచ్చరిస్తూ తన నాలుకని
అరగదీస్తాడు ప్రతిరోజూ
నాలాగా!

*గుర్తుకుతెచ్చుకున్న గ్రామం*

నీ గ్రామం అంటే నీకంత ప్రేమయితే
ఇక్కడెందుకున్నావు, అతను అడిగాడు.

ఇండియా ఎంత అద్భుతమైన దేశమో అనే
చెత్త వర్ణనలు విని వినీ విసిగెత్తిపోయావు!
చల్లారిపోయిన టీపాట్ లాంటివి అవి
మళ్ళీ తాజాగా చెయ్యాలి!

అయితే అక్కడ రెండు మూడున్నయి
వాటికోసం నీవేమయిన చేస్తావు.
కుళితలైలో అత్తయ్య ఇల్లు, ఉదాహరణకి
దాని పాదాలు అప్పుడప్పుడు నదిలో
తడుస్తూ వుంటాయి.
వాన మెలికలు తిరుగుతూ బుసలుకొడుతూ
పై కప్పుమీద పడుతూ వుంటుంది.
నుయ్యి నిండి నీరు పైపైకి ఉబికి వస్తూ వుంటుంది.
వాళ్ళ పన్నెండిళ్ళ వీధి చంద్రకాంతిలో మునిగి తేలుతూ వుంటుంది.
నదీతీరాన్ని వెదురుగడలు బంధించి వుంచుతాయి

ఒక నల్ల పెళ్ళైయార్ దేవాలయం వూరికి
చివర కూర్చుని వుంటుంది రాతి దిమ్మమీద
పండగరోజులలో భక్తుల మ్రోతతో చిక్కి సన్నబడివుంటుంది.
పూజారి వుచ్ఛరించిన సంస్కృత మంత్రాలు విని
గుడిగంటలు పెదవి విరుస్తాయి.
బయట వీధికుక్కలు గుంపుగా అరుస్తాయి.
సరిగ్గా అదే సమయానికి ధాన్యపు క్షేత్రాలవెనకనుంచి
ఈరోడ్ మైల్ వెళ్తూ కనిపిస్తుంది.
ఒక సూదిలాంటి ధూమరేఖ నీగ్రామం లాంటి
గ్రామాలెన్నిటినో కలుపుకుంటూ సమయాన్ని నిర్దేశిస్తూ కనిపిస్తుంది.
ఈ రైలు ఎప్పుడూ తప్పిపోదు.

*<u>ప్రవాసము- తిరిగిరాక</u>*

నా నాలుక ఆంగ్ల భాష సంకెళ్ళలో -
నీ దగ్గరికి తిరిగి వచ్చాను, ఒక తరం తర్వాత

నా ద్రావిడ మూలాల్లోకి.
ఇప్పుడు నేను చివరి అంచులో
అయితే నీ గురించిన దాహార్తి
ఇప్పటికీ తీరలేదు - తడబడతాను
తప్పులు చేస్తాను.

అలసిపోయి కురల్‌లో నిద్రిస్తున్న భాషని
కష్టపడి పలుకుతాను!
అంతా క్రొత్తగా వుంటుంది.
దంతాలు, అంగుటి, పెదవులు అన్నీ
మళ్ళీ శబ్దాలని క్రొత్తగా అనుభవిస్తాయి.
అయితే ఇప్పుడు జిగేలుమనిపించే సినిమా తెరలమీద
ఖరీదైన వరండాల్లో భాష అంతా క్రొత్త!

చివరికి ఇల్లా జరిగింది- ఒక కుటుంబ సమావేశం
తాతయ్య పోయిన ఏడాది, మార్చి ‘59
తర్వాత మళ్ళీ ఇప్పుడు!
తిరుచానూరునుంచి దాయాదులు
క్రిక్కిరిసిన బస్సుల్లో ప్రయాణించివస్తారు!
ఉత్తరాలుకూడా లేని
మట్టి కప్పుకు పోయిన జ్ఞాపకాల తెరల్ని చీల్చుకుని
నీ ముందు - మళ్ళీ ఇప్పుడు
వెంటనే పోల్చలేము ఎవర్నీ.
మడిచిన కాళ్ళతో
మండుతున్న అగ్నికుండంలోంచి కొబ్బరికాయలని బయటికి
లాగుతున్నట్టు మరిచిపోయిన జ్ఞాపకాలని వెలికితీస్తూ
సత్రం మెట్లమీద కూర్చుని వేడితో పొగలుగక్కుతున్న అన్నం
ఊరగాయతో నంజుకు తిన్నప్పుడు
పెరిగిన పరిచయాలు - మళ్ళీ ఇప్పుడు

సుందరి - మామయ్యకూతురు-
పెద్ద పరికిణితో నాతోపాటు ప్రతి ఉదయం

నిషేదవృక్షాలను ఎక్కిన నా చిన్ననాటి నేస్తం
అదుగో, నలభైఏళ్ళ పొడవు ఎదిగి
ముగ్గురు కూతుళ్ళనే సురక్షిత గ్రహాలమధ్య
దూరంగా నిలబడుతుంది!

వీడ్కోలు చెప్పటం నా ప్రత్యేకత అయింది.
ఒక అనుకోని నవంబరు నా మొహమ్మీద
తటాలున తలుపు మూసివేసేసింది!
నా గాజు గృహం తునాతునకలై చెల్లాచెదరైంది.
నాతండ్రి మృత్యు వార్త ఒక ఘాతంలా తగిలింది!

శ్మశానవాటికలో మండుతున్న కాష్ఠం చుట్టూ
ఆశ్చర్యార్థకాల్లా చుట్టాలు నిలబడివుంటారు.
నా తండ్రి శరీరాన్ని అగ్ని పూర్తిగా దహిస్తుంది
అన్ని గుర్తింపులనుంచీ ఆయనని వంచిస్తుంది!

ఇప్పుడు నేను నాతండ్రిని!
నా హస్తరేఖలు
దిక్సూచిలా, ఆయన వెళ్ళిన మార్గాన్ని ధరిస్తాయి!
అదేబాటలో నేను,
నాతర్వాత ఇంకా పుట్టని నా పుత్రరత్నం
మరుపు అనే సూదికి ఉన్న అతి చిన్నబెజ్జంలోంచి
మా బాట సాగుతూనే వుంటుంది!

**కృతజ్ఞతలతో:**

"Darjeeling Tea." Copyright (c) -997 by R. Parthasarathy. Originally appeared in London Magazine. Translated by permission of author.

"East Window." Copyright (c) -992 by R. Parthasarathy. Originally appeared in Salmagundi. Translated by permission of author.

"Remembered Village." Copyright (c) 2000 by R. Parthasarathy. Originally appeared in Verse. Translated by permission of author. R. PARTHASARATHY, "Homecoming -, 3, and 4" from Rough Passage (Oxford University Press, Delhi, -977). Copyright (c) -990 by R. Parthasarathy. Translated by permission of author.

*డా.శ్యామల కల్లూరి*

*మానవీయ సామాజిక శాస్త్ర విభాగం, ఐ.ఐ.టి న్యూఢిల్లీ*

# కమలా దాస్

## (1934-2009)



**భారతీయాంగ్ల** కవిత్వం స్వాతంత్రానంతరం మారిన పరిస్థితులతో మార్పు చెందుతూ క్రొత్త మలుపులు తిరుగుతూ ముందుకు సాగింది. ఈ మార్పుని తెచ్చిన వాళ్ళలో కవులలో నిసీంఇజేకియల్ని కవయిత్రులలో కమలాదాస్ని తల్చుకుంటారు. నిజం చెప్పాలంటే వస్తువు ప్రధానంగా తీసుకుంటే నిసీంఇజేకియల్ కంటే కమలాదాస్ నాలుగడుగులు ముందుందనే చెప్పాలి. తన తరం కంటే రెండు మూడు ముందున్న తరాలవారికోసం కవిత్వం రాసిన కవయిత్రి కమలాదాస్ .

దక్షిణాది రాష్ట్రమైన కేరళలోని మలబారులో 1934 లో ఈమె నాయర్ల కుటుంబంలో జన్మించింది. ఆర్థికదృష్ట్యా కలిగిన కుటుంబం. తల్లి నలపాట్ బాలామణి అమ్మ మలయాళంలో కవయిత్రి, ఈమె ప్రభావం కమల మీద చిన్నతనంనుంచే వుంది. మాతృసామ్య సంస్కృతికి పెట్టింది పేరు కేరళ రాష్ట్రమని గుర్తుంచుకుంటే కమలాదాస్ కవిత్వంలో నూతనత్వం అర్థమవుతుంది. ఇంటిదగ్గరే పదునాలుగో ఏడొచ్చేదాకా చదువుకున్న తర్వాత పదునైదవ ఏట తనకన్నా వయస్సులో దాదాపు పదునాలుగు సంవత్సరాలు పెద్దవాడైన మామ మాధవదాసుని వివాహంచేసుకుంది. పదహారో ఏట మొదటిసారి తల్లి అయింది. తనకి మూడవబిడ్డ పుట్టే దాక తల్లి అవటంలో వున్న బాధ్యతలు తనకి అర్థం కాలేదని ఆమె స్వయంగా ఒక ఇంటర్వ్యూలో చెప్పుకున్నారు. ముగ్గురుపిల్లల బాధ్యతలతో, ఇంటి పనులతో సతమవుతూ రాత్రి అందరూ పడుకున్నతర్వాత రచనావ్యాసంగాన్ని కొనసాగించిందంటే ఈమెలో రాయాలనే కోరిక ఎంత బలమైననదో వూహించుకోవచ్చును. భర్త ఉద్యోగకారణంగా కలకత్తాలోను ఢిల్లీ బొంబాయి నగరాలలోను నివసించి నగరసంస్కృతిని అవగాహనలోకి తెచ్చుకుంది. వయస్సు వ్యత్యాసం వలననో గాని, ఆలోచనావిధానంలోని వైవిధ్యంవలననో గాని ఈమె ఆత్మకథ "నా కథ" చదివితే ఈమె వైవాహిక జీవితం అంత సుఖమయంకాదేమోనని అనిపిస్తుంది. అయితే అవకాశం వచ్చినప్పుడల్లా తన సాహిత్య ప్రస్థానంలో తన భర్త వలన తను పొందిన సహకారం అనేకసార్లు తల్చుకున్నదనేది కూడా గుర్తుంచుకోవల్సిన విషయమే! అడుగడుగునా భర్త మాధవ దాస్ ఈమెని కవిత్వం రాయటంలో ప్రోత్సాహించటమే కాక రాసిన వాటిని ప్రచురించటంలో కూడా ఒక ప్రముఖ పాత్రని నిర్వహించారు. మలయాళంలో మాధవీకుట్టి అనే కలంపేరుతో కథలు రాసింది. ఈ కథలుకూడా భర్త సహకారంతోనే ప్రచురించింది. కుటుంబపు ఆర్థిక పరిస్థితిని మెరుగుపర్చవలసిన అవసరాన్ని గుర్తించిన కారణంగానే భర్త ప్రోత్సహించారని ఒకచోట చెప్పుకున్నారు. (సాహిత్య అకాడమీ వారు ప్రచురించిన ఒక వీడియో ఇంటర్వ్యూలో అనారోగ్యంతో ఆస్పత్రి పాలైనప్పుడుకూడా హాస్పిటల్ రూములో ఒక పాత టైపు రైటర్ పెట్టుకుని పనిచేసేదాన్నని చెప్పారు). భర్త మరణానంతరం మతం మార్చుకుని ఇస్లాం మతంలోకి మారి కమలా సురయా అనే పేరుతో రచనలు చేసింది. ఈ మతం మార్పిడి చాలామంది సమకాలీనులని ఆమె భావాలకి వ్యతిరేకంగా మారేలా చేసింది. తర్వాత కొన్నిరోజులు ఒక రాజకీయ పార్టీని కూడా స్థాపించి రాజకీయాలలో ప్రవేశించటానికి ఒక విఫల

ప్రయత్నం చేసారు. జీవించినంతకాలం సమకాలీన సమాజంతో అప్పటికి పాతుకుపోయిన లింగ వైరుధ్యాలతో ఒక నిరంతర పోరాటంగా జీవితాన్ని తీర్చుకుంది. తన డెబ్బయ్ అయిదవ ఏట మే 31న, 2009లో కుమారుడు జైసూర్య ఇంట పూణేలో కన్నుమూసారు.

ఇక ఈమె కవిత్వానికొస్తే చెప్పుకోదగిన అంశాలు అనేకం వున్నాయి. ఒకచిన్న పరిచయవ్యాసంలో అన్నీ చెప్పటం సాధ్యంకాదు కూడా! 1965 నుండి 1985లోపు ఆరు కవితా సంకలనాల్ని ప్రచురించింది. సమ్మర్ ఇన్ కలకత్తాతో మొదలైన కవితాప్రస్థానం ది డిసెండెంట్స్ , ది ఓల్డ్ ప్లే హౌస్ అండ్ అదర్ పోయెమ్స్, ది అన్నామలై పోయెమ్స్, ఓన్లీ ది సోల్ నోస్ హౌ టు సింగ్ మొదలైన సంకలనాలు ప్రచురించటమే కాక ప్రీతిష్ నంది తో కలిసి ఒక సంకలనం ప్రచురించటం దాకా కొనసాగింది. మై స్టోరీ అనే ఆత్మ కథ రాసింది. మలయాళంలో కథలు నవలలు నవలికలు అనేకం రాసింది మాధవీకుట్టి అనే పేరుతో. పద్మావతి అండ్ అదర్ స్టోరీస్ ఆంగ్లం వెలువడిన కథ సంకలనం. ఇక కవిత్వతత్వానికొస్తే ఆమె బ్రతికిన కాలంలో ఎవరూ ఊహించలేని అంశాలమీద కవితలల్లింది. అయితే ఈమెని స్త్రీవాద కవయిత్రి అనడానికి వీలులేదు. స్త్రీవాదులు వివాహాన్ని, పితృసామ్యవ్యవస్థని తృణీకరించారు ఆరోజులలో. ఈమెలో కనిపించే స్వేచ్ఛాప్రియత్వం లైంగిక స్వాతంత్రానికి సంబంధించినది, హద్దులు సరిహద్దులులేని ప్రేమ, స్త్రీ శరీరంపట్ల అరుదుగా కనిపించే అవగాహన అన్నీ ఈమె కవితా వస్తువులు. స్త్రీని స్త్రీత్వాన్ని ఒక బంధనగా భావించలేదు సరికదా స్త్రీలకు తమ స్త్రీత్వంపట్ల మమకారం గర్వం వుండాల్సిన అవసరాన్ని గురించి రాసింది. ఒక విచ్చలవిడి తనం ఇందులో వుండటంలో ఆశ్చర్యంలేదు సరికదా ఇది ఈరోజులలో ఒక సర్వదా అంగీకరింపబడిన సమానత్వపు పునాదికి ఒక నాంది అని చెప్పచ్చు. ఒకరకంగా మనసాహిత్యంలో చలానికున్న స్థానం మలయాళ సాహిత్యంలో ఈమెకుంది. తేడా అల్లా స్త్రీ అయి వుండి ఈరకమైన స్వేచ్ఛని గురించి నిస్సంకోచంగా నిర్భయంగా నిజాయితీతో ఆరోజుల్లో రాసింది. ప్రేమని కాంక్షించే ప్రతి స్త్రీ తరపున తను రాస్తున్నానని చెప్పుకుంది. సాంఘిక నిబంధన కారణంగా భారతీయ స్త్రీలు మాట్లాడలేని అనేక విషయాలు ఈమె కవితావస్తువులు. ఈ ప్రయత్నంలో కొంత హద్దులు మీరిన శృంగారమున్న మాటా నిజమే! సమాజ దృష్టిలో ప్రతిబంధకాలైన అంశాలు స్త్రీలనుంచి సమాజమాశించే గుణాలు, కోరికలు స్త్రీలు గర్వింపదగిన అంశాలవటంలో అసంబద్ధమేమీ లేదని ఈమె భావన. ఈమె ఆత్మకథ అందుకే సంచలాన్ని రేపింది. దేనికీ ఎవరికీ భయపడలేదు. హృదయంలోనుంచి వచ్చిన భావాలని స్వేచ్ఛగా నిస్సంకోచంగా, రాసింది. ఇదే రకమైన మానవతా దృక్పథం మానవ హక్కుల గురించిన అవగాహన స్త్రీల గురించిరాసినప్పుడే కాదు కొజ్జాలగురించి రాసినప్పుడు కూడా ప్రదర్శించింది. అందుకే ఈమెని స్త్రీవాదానికి పరిమితం చెయ్యటం కష్టం.

<u>కొన్ని కమలాదాస్ కవితలకి ఆంధ్రానువాదం:</u>

<u>1.స్వపరిచయం</u>

నాకు రాజకీయాలు తెలియవు, కాని అధికారంలో
వున్నవాళ్ళ పేర్లు తెలుసు, వారాల, నెలల పేర్లు అప్పచెప్పినట్టు
అందరిపేర్లు చెప్పగలను, నెహ్రూతో మొదలుపెట్టి!
నేను భారతీయురాల్ని, గోధుమరంగు శరీరం నాది!
మలబారులో పుట్టాను. మూడుభాషల్లో మాట్లాడగలను,
రెండిట్లో రాయగలను, ఒకే ఒకదాంట్లో స్వప్నాలు చూస్తాను.
వాళ్ళన్నారు - ఆంగ్లంలో రాయకు, అది నీ మాతృభాష కాదు.
నా మానాన నన్నెందుకు వదిలెయ్యరు, ఈ విమర్శకులు,
స్నేహితులు, దూరపు బంధువులు ప్రతి ఒక్కరూ!

నాకిష్టం వచ్చిన భాషలో నన్నెందుకు మాట్లాడనివ్వరు?
నేను మాట్లాడే భాష నాదవుతుంది, దాని తప్పొప్పులు,
వింత పోకడలు అన్నీ నావే, నా ఒక్కదానివే!
సగం ఆంగ్లం, సగం భారతీయం, వింత అనిపించవచ్చును!
కానీ నిజాయితీతో నిండి వుంటుంది
నేనెంత మానవస్వభావినో నా భాషా అంతే!
నేచెప్పేది వినబడుతోందా? అది నా సంతోషాల్ని, నా కోరికల్ని
నా ఆశల్ని అన్నిటినీ తలపిస్తుంది! కాకులు అరవటం
సింహాలు గర్జించటం మనుష్యులు మాట్లాడటం ఎంత సహజమో
నా యీ భాష నాకంత స్వాభావికం!
ఇది మానవ భాష, మెదడుకి చెందిన భాష!
ఇక్కడుంటుంది అక్కడుండదు అని లేదు.
చూడదగిన, వినగలిగన ప్రతి మెదడులో దాని స్పృహ వుంటుంది!
మూగవై, గుడ్డివై తుఫానుల్లో చిక్కుకున్న వృక్షాల మౌనభాష కాదు,
వర్ష ఋతు మేఘాల వర్షపు భాష కాదు, మండుతున్న చితుల
అగ్నికణాల భాష కానేకాదు!
నేనొక శిశువుని!
వాళ్ళు చెప్పారు నాకు నేనెదిగానని,
అవును పొడవుగా ఎదిగాను, నా కరచరణాలు నిండుగా పెరిగాయి!
అక్కడక్కడ వెంట్రుకలు కూడా లేచాయి!
ప్రేమార్థినై ఏంకావాలో కోరుకోవాలో
తెలియని పదహారేళ్ళ వయస్సులో వున్న నన్ను
అతను గదిలోకి లాగి తలుపు వేసేశాడు.
అతను నన్ను కొట్టలేదు కాని నా దుఃఖిత స్త్రీ శరీరం
కొట్టినంత బాధననుభవించింది. నా పొంగిన రొమ్ముల
పెరిగిన గర్భపుభారం నన్ను అణచివేసింది.
నేను హృదయవిదారకంగా కృంగిపోయాను!
అప్పుడు షర్ట్ వేసుకుని నా సహోదరుని పాంట్ వేసుకున్నాను
నా జుట్టు పొట్టిగా కత్తిరించుకున్నాను, నా స్త్రీత్వాన్ని నిర్లక్ష్యం చేశాను
వాళ్ళన్నారు - చీరలు కట్టుకో, అమ్మాయిలా, భార్యలా వుండు.
ఎంబ్రాయిడరీ చెయ్యి, వంటలు చెయ్యి, పనివాళ్ళతో తగదాలు పడు!
ఇమిడిపో, వీటన్నిటికీ చెందినదానిలా వుండు.

గోడలమీద కూర్చోకు, పరదాల సందుల్లో నుంచి
మా యింటిలోకి తొంగి చూడకు!
అమీగా లేదా కమలగా వుండు!
ఇంకా కావాలంటే మాధవీకుట్టిగా వుండు!
నీకై నువ్వు ఒక పేరు, ఒక పాత్ర సృష్టించుకోవల్సిన
సమయాసన్నమయింది.
ఈ బూటకపు నాటకాల ఆటలు ఆడవద్దు.
స్కిజోఫేర్నియాక్లోనో నింఫోలానో నటిస్తూ వుండిపోకు.
నీ ప్రేమ నిన్ను వంచించినప్పుడు గట్టిగా ఏడవకు అసందర్భంగా!

ఒకవ్యక్తిని కలిశాను, అతనిని ప్రేమించాను!
ఏదో ఒక పేరుతో అతనిని పిలవలేదు
ఎందుకంటే, ప్రేమని కోరే ప్రతి స్త్రీలో నేనెల్లాగో
స్త్రీని కాంక్షించే ప్రతి పురుషునిలో అతనే!
అతనిలో ఆర్తి ఆకలిగొన్న నదిలా,
నా నిరీక్షణ అవిశ్రాంతమైన సముద్రంలా!
నువ్వెవరు, నేను ప్రతి ఒక్కరినీ అడుగుతాను.
సమాధానం 'నేను'. ఎక్కడైనా మరి ఈ ప్రపంచంలో అతను
బిగుతుగా ఒరలో ఒదిగిన ఖడ్గంలా.
నేను తీసుకుంటూ వుంటాను,
అర్థరాత్రి పన్నెండు గంటలకి ఒంటరి గ్లాసులో షరాబు
తెలియని నగరాల హోటళ్ళలో!
నేను నవ్వుతాను, నేను కోరికతో ప్రేమిస్తాను
మళ్ళీ సిగ్గుతో అవమానంతో కృంగిపోతాను!
నా గొంతుకలో గరగరతో మరణశయ్యమీద నేను!
నేను పాపిని, నేను ఋషిని.
ప్రేమింపబడిన దానిని నేనే,
తిరస్కరింపబడినదానిని నేనే!
నీకు చెందని సంతోషాలు నాకు లేవు!
నువ్వు అనుభవింపని బాధలు నాకు లేవు!
నన్ను నేను అనుకుంటాను, నేను 'నేనే'!

2. నాని

గర్భవతి అయిన పనిపిల్ల నాని ఉరిపోసుకుంది.
స్నానాలగదిలో. మూడు గంటలపాటు పోలీస్ వచ్చేదాకా
ఆమె శరీరం వ్రేలాడుతూనే వుంది, గాలికి వూగుతూ
తోలుబొమ్మలా.
మా పిల్లలందరికీ నాని మమ్మల్ని నవ్వించటానికి
ఆడుతున్న ఆట అనిపించింది, హాస్యభరితమైన నృత్యంతో!
తర్వాత అక్కడ అడవి చెట్లు పెరిగాయి.
ఆ తలుపులని గోడలనీ పూర్తిగా మూసేస్తూ
పసుపు పచ్చని పూలతలు!
ఆ రూముని ఎవరూ వాడలేదు  తర్వాత.
నాని అనబడే మృత్యువాతపడ్డ
దేవతకోసం వెలసిన ఒక దేవాలయం,
ఒకస్మృతి చిహ్నం అది!
ఒకటి రెండేళ్ళ తర్వాత అమ్మమ్మని అడిగాను-
నాని గుర్తుందికదూ, నల్లగా బొద్దుగా, నూతిదగ్గర నాకు
స్నానం చేయించేది...ఆమె!
అమ్మమ్మ ముక్కుమీద కళ్ళజోడు సద్దుకుంటూ
నాకేసి చూసి అడిగింది - 'నాని ఎవరు?'
ఆ ప్రశ్నతో నాని జీవితం అంతమైంది. ప్రతి మృత్యువు
జీవితానికి అల్లాగే అంతం పలుకుతుంది ప్రశ్నతో!
ఈకోరి తెచ్చుకున్న చెవిటితనం, ప్రతి మృత్యువునీ
అమరం ప్రతి సత్యాన్ని అజరామరం చేస్తుంది.
ప్రశ్న అడిగి జవాబు కెదురుచూడక ముందుకు
నడిచే వాళ్ళు అదృష్టవంతులు.
వినీలమైన నిశ్శబ్దప్రాంతాలలో ఏసందేహాలు లేకుండా
నివసించే జ్ఞానులు, వారిది శాంతనిక్షిప్తమైన జీవితం!
కోయిల గ్రుడ్డులో నిబిడమైన సంగీతంలా,
రక్తంలో దాగిన కోరికలా వృక్షాలలో దాచుకున్న జిగురులా!

3. అమ్మమ్మ గారిల్లు

చాలాదూరంలో, బహుకాలంక్రిందట
ఒక ఇల్లు వుండేది, ప్రేమని పంచిన ఇల్లు!

ఆమె ఇప్పుడు చనిపోయింది!
నేను మరీ చిన్నదాన్నయి, చదవలేని రోజుల్లో
అక్కడ ఎన్నో పుస్తకాలు!
వాటిమధ్య ఇప్పుడు పాములు తిరుగుతూ వుంటాయి!
నా రక్తం చందమామలా చల్లబడుతుంది!
ఎన్నోసార్లు అనుకుంటాను
మళ్ళీ అక్కడికి వెళ్ళాలని.
మూసుకుపోయిన కిటికీల సందుల్లోనుంచి తొంగి చూడాలని
గడ్డ కట్టిన గాలి సవ్వడి వినాలని.
అక్కడి చీకటినైనాసరే మూటకట్టుకుని ఇక్కడికి తెచ్చుకోవాలని
నా పడకగది బయట కాపలాకుక్కలా
చీకటిని పడుకోబెట్టాలనీ!
నువ్వు నమ్మలేవు ప్రియతమా!
ఒకప్పుడు  ఇంట్లో నేను నివసించాననీ
ధీమాగా బ్రతికాననీ, ప్రేమని చవిచూసానని
ఇప్పుడు నన్ను చూస్తే నమ్మలేవు!
అన్నీ పోగొట్టుకుని ఒక ఆగంతకుడి ముందు బిచ్చగత్తెలా
చిన్నమొత్తాలలో ప్రేమని అడుక్కునే నన్ను చూస్తే
నిజంగా నమ్మలేవు నువ్వు!

4. పరాన్నభుక్కులు

యమునాతీరంలో  సూర్యాస్తమయపు సాయంవేళ
కృష్ణుడామెని ఆఖరిసారిగా ప్రేమించి వదిలి వెళ్ళాడు...
రాత్రి భర్త బాహువుల్లో రాధ అనుభవించే మృత్యుశైతల్యాని
గమనించి భర్త అడిగాడు - ఏమైంది? నా చుంబనాలు నచ్చలేదా నీకు?
ఆమె అంది: "అదేంకాదు".
అనుకుంది: పరాన్నభుక్కులు మీద
వాలితే శవానికేం పట్టుంది?

✡ ✡✡

Acknowledgments to
**© The Estate of Kamala Das**

*డా.శ్యామల కల్లూరి*
*మానవీయ సామాజిక శాస్త్ర విభాగం, ఐ.ఐ.టి న్యూఢిల్లీ*

# సునీతా జైన్

(1940)

1940లోజూలై 13న పంజాబు రాష్ట్రంలో జన్మించిన సునీతాజైన్ భారతదేశంలో ఇంద్రప్రస్థ కాలేజీ, ఢిల్లీలో బి.ఎ చదువు ముగించి స్టోనీబ్రూక్లోని న్యూయార్క్ స్టేట్ యూనివర్సిటీలో ఎం.ఎ డిగ్రీ పుచ్చుకున్నారు. తదనంతరం యూనివర్సిటీ ఆఫ్ నెబ్రాస్కాలో పి.హెచ్.డి పట్టా పుచ్చుకున్నారు. తర్వాత యునైటెడ్ స్టేట్స్ లోనే ఏ డ ల్ఫీ సఫోక్ కాలేజిలోనూ యూనివర్సిటీ ఆఫ్ నెబ్రాస్కా లింకన్ లోనూ ఆంగ్లభాషాబోధన చేశారు. న్యూడిల్లీలోని భారతీయ ప్రాగ్యోగిక సంస్థలో (ఐ.ఐ.టి డిల్లీ) మానవీయ సామాజిక శాస్త్ర విభాగంలో 1974 లో అసిస్టెంట్ ప్రొఫెసర్గా చేరిననాటినుంచి వివిధ పదవులలో పనిచేసి ప్రొఫెసర్ పదవికి ఎదిగి హెడ్ ఆఫ్ డిపార్ట్ మెంట్గా 2001లో రిటైరయినారు. అంతకుముందు ఢిల్లీయూనివర్సిటీకి చెందిన ఇంద్రప్రస్థకాలేజిలోనూ, అరబిందోకాలేజీలోను ఆంగ్లభాషాధ్యాపకురాలుగా పనిచేశారు

ఆంగ్లంలోనూ, హిందీ భాషలోనూ సృజనాత్మకశక్తిగల ఈమె రెండు భాషలలో కవితలు నవలికలు రాశారు. బెట్వీన్ యూ అండ్ గాడ్, టిల్ ఐ ఫైండ్ మైసెల్ఫ్, సెన్సం, బినీత్ ద ప్రోస్ట్, సైలెన్సెస్, కల్లెక్టెడ్ పోయమ్స్ (1965-2000) అనే సంకలనాలేకాక అమెరికన్ దేశీ అండ్ అదర్ పోయమ్స్ అనేసంకలనాన్ని 2007లో ప్రచురించారు. ఎ గల్ ఆఫ్ హర్ ఏజ్, అనే నవలనీ, అనేక కథలనీ కూడా రాశారు. ప్రీలాండ్ అవార్డ్. నిరాలా నమిత్ అవార్డ్, మహాదేవివర్మ సమ్మాన్, సాహిత్యభూషణ్ లాంటి ఎన్నో అవార్డులు ఆంగ్ల హిందీ కవితలకి అందుకున్నారు. వీటన్నిటికీ పరాకాష్ట గా 2004 లోభారత ప్రభుత్వం నుంచి పద్మశ్రీ గౌరవాన్ని పొందారు.

ద్విభాషావేత్త, జైనమతానుయాయి అయిన ఫ్రొ. సునీతాజైన్ తమ జైన గురువుల ప్రవచనాలని ఆంగ్లంలోకి అనువదించారు. ఇక కవిత్వానికొస్తే ప్రాచ్య, ప్రాశ్చాత్య సంస్కృతుల రెండింటిలోనూ నివశించిన అనుభవాలు కవిత్వానికొక వింతశోభని తెచ్చిపెట్టాయి. డిల్లీ వీధులగురించి రాసినంత అవలీలగా ప్రాశ్చాత్యజీవిత కోణాలని అవగాహనచేసుకున్నారు. బాంధవ్యాలు, చిన్నతనపు అరక్షణలు, పితృసామ్యవ్యవస్థలో విచ్చుకోకుండానే నేలరాలిపోయే ఎదుగుతున్న ఆడపిల్లల కోరికలు కాంక్షలు, వివాహవ్యవస్థ, ప్రేమ బంధాలు మాతృత్వం, వయస్సు పైబడుతున్నా చివరిదాకా వెన్నంటి వచ్చే చిన్ననాటి స్మృతులు లాంటి అనేక వస్తువులమీద అనేక కోణాలనుంచి కేవలం ఆత్మాశ్రయ దృక్పథంతో కవిత్వాన్ని సృష్టించారు. టీ.టి.లెమన్ అనే అమెరికన్ కవి వీరి కవితని విశ్లేషిస్తూ ఒక విశిష్టమైన వ్యక్తిత్వంలోంచి ఉద్భవించిన వీరి కవిత బలమైన పదచిత్ర ప్రయోగాలతో రాణిస్తుందని చెప్తారు. మేధస్సుని మించిన ఒక సహృదయత, అనుభవైకవైద్యమైన చింతన వీరికవిత్వంలో కనిపిస్తుంది. నిజాయితీ నిండిన నియంత్రితమైన భావావేశం, భాషమీద అరుదైన నిబద్ధత ఈమె ప్రత్యేకత. సిల్వియా ప్లాత్ లాంటి కవయిత్రుల కవిత్వవేదనలో తడిసిన వీరి కవిత అంతటి సునిశితత్వాన్ని, సున్నితత్వాన్ని ప్రదర్శిస్తుంది. స్త్రీవాదానికి దూరంగావున్నా స్త్రీత్వపు మమకార అస్థిత్వాలనుంచి దూరంగా లేరు.

*అమ్మలు జీవిస్తే...*

అమ్మలు చనిపోవటానికి వీలులేదు
భావనల్లో
మనస్సుల్లో
కవితల పదాలలో
వాళ్ళు జీవించేలా చెయ్యాలి.
అమరత్వానికి మనకున్న
ఒకేఒక్క ఆధారం అమ్మలే!
పడిపోయిన మహావృక్షాలకి
వ్రేళ్ళలాంటి వాళ్ళు అమ్మలు;
అమ్మలు జీవించివుంటే
మోడువారిన వృక్షాల
మొండేలలో చిరు చిగుళ్ళు
తిరిగి మొలకెత్తుతాయి

*చెత్తబుట్ట*

మృదువైన ముఖం,
ఆర్ధ్రత నిండిన కళ్ళు
స్వచ్ఛగంభీరమైన గళం,
సన్నని నడుము-
తన శరీరం పట్ల
ఆమెకెంత మమకారం?
స్వశరీర కామనా ఇది?
కాదిది అంత సులభమైన పదం
సంస్కృతంలో దీన్ని అంటారు
ఆత్మరతి అని
కానీ కేవలం అదికూడా కాదు!

ఇది ఒక దేవాలయపు అంతః గృహం
దోచుకోటానికి కాదీ శరీరం
మనస్సు అంతకంటే కాదు

వార్తాపత్రిక పేజీలోంచి చనిపోయిన
వ్యక్తి ముఖం ఆమెకేసి చూస్తుంది
అతను ఫోన్‌లో పిలిచాడు - ఎప్పుడు?
పది పదిహేనేళ్ళక్రితం.
"ఈ రాత్రి నువ్వు ఖాళీగానే వున్నావా?"
"ఏమిటి విశేషం?"ఆమె అడిగింది ఆశ్చర్యంతో.
"మనం ఈ రాత్రి డిన్నర్ కి వెళదాం?
"నా భార్య బొంబాయి వెళ్ళింది. ఒక్కణ్ణే  వున్నాను"
ఆమె గొంతుకలో భయం, "నేను నాపిల్లలతో
భోంచేస్తాను, ఎప్పుడూ."
"కాని నీ భర్త లేడుకదా, నీకూ కంపెనీ కావాలిగా?"
"క్షమించమని చెప్పానుగా!"
"ఓహో, నీ ప్రేమకవిత్వమంతా
నీఊహల్లోనేవుందా?"

ఆమె రాత్రపతి మర్నాడు ఆమెని చేరింది,
అన్నీ తప్పులు సరిదిద్దాకాగూడా.
"అంగీకారానుసారం మీప్రతిని ప్రచురించటానికి
ప్రచురణకర్త తమ అసంసిద్ధతని వ్యక్తంచేస్తున్నారు"

సంవత్సరాలు గడిచిపోయాయి.
రాతప్రతి పాతదైపోయింది,దాని పేపరుతోపాటు.
అంచులు ముడుచుకుపోయి
ముట్టుకుంటే రాలిపోయేటట్టు తయారయ్యాయి.
ఏం రాసింది, ఎవరికోసం రాసింది, ఎందుకు రాసింది?

ముడుచుకుపోయిన నరాలతో నేడు
ఆమె కంపిస్తున్న చెయ్యి 'కవితలు' అని రాసివున్న
రాతప్రతిని చెత్తబుట్టలో పడేసింది.

<u>తండ్రి</u>

నీ గురించిన మొదటి జ్ఞాపకం
డబల్ బారెల్ గన్ తీసుకుని
భోజనాల బల్ల క్రిందనున్న
నాగుపాముకి గురిపెట్టిననాటిది!
నా కేక నా ఉనికిని కనిపెట్టింది
నా చిన్నతనాన్ని ఇలాగే తప్పించుకుంటూ
తలుపుల వెనకనుంచి నీ గళాన్ని వింటూ
నీ నల్ల మోటారు వస్తున్న శబ్దాన్ని నీ ఎర్ర టోపీ నౌకర్ రాకతో
కంచెల వెనకాల దాక్కుని చూస్తూ గడిపేశాను!
నువ్వెప్పుడు నాగురించి ఎందుకు అడగలేదు?
ప్రేమరహితంగా పెరిగాను
అప్పుడప్పుడు చెట్లు భూమిమీద పెరుగుతాయి!
మొట్టమొదటిసారి నువ్వు
నాతో మాట్లాడిందెప్పుడు, నీమూత్రపిండంలోరాళ్ళవల్ల
నెప్పితో నువ్వు మెలికలుతిరుగుతున్నప్పుడు!
నీ కళ్ళు తుపాకి గుళ్ళలా మెరుస్తూ
"వేడినీళ్ళ సీసా తే!" నువ్వు కేక పెట్టావు.
నేను వంటగదిలోకి పరుగుపెట్టాను భయంతో
ఆపరేషన్ బల్లమీద ఆఖరిశ్వాస తీసుకునేముందు
నువ్వు అన్న నీమాటలు "నా కొడుకులు సాధించలేనిదాన్ని
నా కూతురు సాధిస్తుంది" చనిపోయేముందు
నీకు లభించిన జ్ఞానరేఖా అది?

నీ మాటలు నన్ను నిలబెట్టిన పట్టుకొమ్మలు,
నాకెలా తెలుస్తుంది, నాన్నా, నీ కోరిక నేను
నిలబెట్టానో,లేదో?
నువ్వే ఎక్కడనుంచైనా నాకొక
సంకేతం పంపిస్తావా, నేను
స్వేచ్ఛగా వూపిరి పీల్చుకోడానికి?

## *నీకోసం నేనిప్పటికీ చూస్తూ వుంటాను*

నాన్నా, అందరి తండ్రులలా నువ్వునన్నెప్పుడూ
నీ గుండెల మీద గడ్డం దాకా ఎగ్రబాకి
అభిమానించే తల్లిదండ్రులున్న ఆడపిల్లల్లా
ఆడనివ్వలేదు.నువ్వు నన్ను భయపెట్టని సమయాల్లో
ఒక మూర్తీభవించిన ఆజ్ఞవి మాత్రం.
నువ్వు వెళ్ళిపోయిన తర్వాత మిగిల్చిన శూన్యం
నాపదిహేనేళ్ళ పసివయస్సుకి అందరికీ అపరిచితం
వాళ్ళు చెప్పిన అబద్ధాలు, నాశరీరంలో మిగిలిన
గాయపు గుర్తులు నేను మోయలేని వాళ్ళ బరువు!
అయినా నాన్నా, సౌష్టవముండి నీ ఎత్తు బలమూవున్న ప్రతిమొగవాడిలోనూ
నీ కోసం వెతుకుతాను నేను!

## *దురదృష్టం*

ప్రేమని గురించి రాయలేకపోతే
కవిత్వం రాసి ప్రయోజనమేమిటి అన్నారు వాళ్ళు విసుగ్గా.
అందుకే ఈ కవిత ప్రేమ అనే గొప్ప
కవితావస్తువుమీద
నా ఆఖరి కవిత, మీమీద ఒట్టు!
మొదటినించి మొదలు పెట్టనివ్వండి
మొదట్లో వెలుతురు తర్వాత అతనే మన దేముడు
వేరే తోడు లేక కొంచెం కొంచెంగా ఉదారంగా కొన్ని భాగాలు
స్త్రీని సృష్టించి పంచిపెట్టడం మొదలెట్టాడు.
కొంచెం మెదడు, మరింత శరీరం
ప్రేమదగ్గరికొచ్చేసరికి బిజి అయిపోయాడు
చాలా మంది అర్థించేవాళ్ళయిపోయారు.
బిడియపడే కవయిత్రిని నేను,
నాకన్నా ఎక్కువ జోరుగా ప్రార్థించేవాళ్ళెందరో.
వాళ్ళందరూ వచ్చేసరికి ప్రేమ బిక్షార్థులు కాదు
ప్రేమికులే, దురదృష్టాన్నివరించిన ప్రేమ వారిది.
వాళ్ళు అవునన్నప్పుడల్లా నేను గట్టిగా కాదన్నాను
"నిజంగానే" వాళ్ళన్నారు, " కానీ నీ కేశాలు ఎంత బాగున్నాయి.

నాకు చాలా ఇష్టం జుట్టూ అల్లా పడుతుంటే, ఎంత బాగా నవ్వుతావు నువ్వు!"
అవునా?
నేనెవర్ని? మీకు నచ్చి స్వంతం చేసుకునే కార్పెట్నా?
మీరుమెచ్చి గోడనలంకరించే రంగులచిత్రాన్నా?
నాలోని తిక్క మనిషి మళ్ళీ, మళ్ళీ అదేప్రశ్న అడుగుతుంది
"నేను, నన్ను గురించి చెప్పండి. నన్ను మీరు ప్రేమించగలరా?"
వాళ్ళు అర్థంకానట్టు చూస్తారు.
నా ఆంగ్లభాష అంత అర్థంకాకుండా వుంటుందా?
చివరికి నేను నిండిపోయిన నన్ను నిరసిస్తూ
వాళ్ళు వెళ్ళిపోయారు, వాళ్ళు వాడిన
విశేషణాలు మళ్ళీ పలకను.
అప్పుడే వినడం, చదవడం ఆపెయ్యకండి.
నా అసలైన ప్రేమికుల దగ్గరికి వస్తున్నాను.
అవును, నేను ప్రేమించాను
ఒకర్ని కాదు, అనేకమందిని
మొట్టమొదటనాకు గుర్తొచ్చేది మా అమ్మ
చిన్నగా, ధృఢంగా నలభై సంవత్సరాలు
యుద్ధంచేసింది మానాన్న హాయిగా
తప్పించుకుని నాతోసహా నలుగురు అల్లరికూనల్ని
వదిలి వెళ్ళాక. తర్వాత
సారీ కేవలం ఆడవాళ్ళనే ప్రేమించలేదు నేను
యువకులుకూడా వున్నారు
ఉదాహరణకి నావిద్యార్థులు
సరదాకి టీచర్నవలేదు నేను.
వాళ్ళ వూహలకి వూపిరిపోసే ఆలోచనలు తట్టినప్పుడు
మెరిసే నక్షత్రాల కళ్ళతో వాళ్ళ ఊహల్లోనే ప్రపంచం అంతా
తిరుగుతారు, గతాన్నంతా తిరగతోడుతారు.
నమ్మకం కలగటంలేదా ప్రయత్నించండి
పంచిపెట్టటంలో వున్న ఆనందం ఎందులోనూ లేదు.
సరే, ప్రేమకి వద్దాం.
వీళ్ళు కాక నేను ప్రేమించిన వాళ్ళెందరో ఎన్నో
చారిత్రక శిథిలాలు,పుస్తకాలు, నేను

నా చేతులతో నాటిన చెట్లు,
ఇంకా ఎన్నో ...
కానీ మీకేమాత్రం కుతూహలంలేదు
నాకు తెలుసు
ప్రేమ చాలా సార్లు అల్లాగే వుంటుంది.

✡ ✡✡

*డా.శ్యామల కల్లూరి*
*మానవీయ సామాజిక శాస్త్ర విభాగం, ఐ.ఐ.టి న్యూఢిల్లీ*